
# దేవుని లక్షణాలు

*బైబిలు దేవుడు నిజముగా ఎవరూ*
*అని తెలుసుకొనుట*



రామ్ కృష్ణమూర్తి

# దేవుని లక్షణాలు

## బైబిలు దేవుడు నిజముగా ఎవరూ అని తెలుసుకొనుట

**రామ్ కృష్ణమూర్తి**

# **దేవుని లక్షణాలు**

బైబిలు దేవుడు నిజముగా ఎవరూ అని తెలుసుకొనుట


రచయిత

రామ్ కృష్ణమూర్తి



ఈ పుస్తకాన్ని కాపీ చేసుకోడానికి గాని ఉపయోగించుకోవడానికి గాని రచయిత అనుమతి అవసరం లేదు.



ISBN:

స్వతంత్రం ప్రచురణ

మొదటి సంచిక

అనువాదం

లేఖనభాగాలు BSI తెలుగు బైబిలు (OV) నుండి తీసుకొనబడినవి

అంకితం

*శ్రీమంతుడును అద్వితీయుడునగు సర్వాధిపతి యుక్తకాలములయందు ఆ ప్రత్యక్షతను కనుపరచును. ఆ సర్వాధిపతి రాజులకు రాజును ప్రభువులకు ప్రభువునై యున్నాడు. సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వము గలవాడై యున్నాడు. మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదు. ఎవడును చుడనేరాడు; ఆయనకు ఘనతయు శాశ్వతమైన ప్రభావమును కలిగియుండును గాక. ఆమేన్.*

- 1 తిమోతి 6:15-16

# అంశాలు


ఈ పుస్తకం గురించి....1
భగవంతుని గుణాలను ఎందుకు అధ్యయనం చేయాలి....3
లక్షణం 1: దేవుని పవిత్రత....6
లక్షణం 2: దేవుని శక్తి....10
లక్షణం 3: దేవుని సన్నిధి....16
లక్షణం 4: దేవుని జ్ఞానం....21
లక్షణం 5: దేవుని పితృత్వం....27
లక్షణం 6: దేవుని ప్రేమ....31
లక్షణం 7: దేవుని వివేకం....37
లక్షణం 8: దేవుని ఉగ్రత....42
లక్షణం 9: దేవుని విశ్వసనీయత....47
లక్షణం 10: దేవుని సార్వభౌమాధికారము....52
లక్షణం 11: దేవుని సహనము....58
లక్షణం 12: మార్పు చెందని దేవుని....62
ముగింపు: ధన్యవాదాలు....69
రచయిత గురించి....71

# ఈ పుస్తకం గురించి

దేవుని పన్నెండు లక్షణాలను వివరించే ఈ పుస్తకాన్ని చదువుతున్నందుకు ధన్యవాదాలు. బైబిలు దేవుని నిజ స్వభావాన్ని బాగా అర్థం చేసుకోవడంలో పాఠకులకు సహాయం చేయడమే ఈ పుస్తక లక్ష్యం. విస్తృతమైన ఈ అంశం గురించి ఈ పుస్తకం లోతైన అధ్యయనం కాదు అలాగే దీనిని పండితుల కోసం రాయలేదు; అయినప్పటికీ ఈ పుస్తకం లేఖనాల బలమైన పునాదిపై ఆధారపడి ఉంటుంది.

ప్రతి అధ్యాయం చిన్నగా ఉంటుంది, దానిలో విశ్వాసులు చేయవలసినవి ఉంటాయి అలాగే క్రైస్తవేతరులకు మనవులు ఉంటాయి. జీవితంలో ఆచరణాత్మక మార్పులు చేయడానికి ప్రతి అధ్యాయం చివరిలో చర్చా ప్రశ్నలు అందించాము. ధ్యానించడానికి కంఠస్థం చేయడానికి ప్రతి లక్షణానికి సంబంధించిన ఒక లేఖనభాగాన్ని ఇచ్చాము. ప్రతి అధ్యాయం ముగింపులో ఆ లక్షణం వెలుగులో జీవించడానికి సహాపడే ఒక చిన్న ప్రార్థన ఉంటుంది.

ఈ పుస్తకాన్ని ఉపయోగించడానికి కొన్ని మార్గాలు:

- వ్యక్తిగత పఠనం.
- చిన్న సమూహం బైబిలు అధ్యయనం.
- కొత్త విశ్వాసులకు శిక్షణ ఇవ్వడానికి ఒక సాధనం. (బైబిలులో తెలిపిన మహిమాన్వితమైన దేవుడిని తెలుసుకుని ఆనందించడానికి కొత్త విశ్వాసులకు ఇది సహాయం చేస్తుంది.)
- ఇంకా క్రైస్తవునిగా కాకపోయినప్పటికీ బైబిలులోని దేవుని గురించి మరింత తెలుసుకోవడానికి సిద్ధంగా ఉన్న స్నేహితులకు కుటుంబ సభ్యులకు ఇవ్వవచ్చు.
- దేవుని వివిధ లక్షణాల గురించి తమ సంఘానికి బోధించాలనుకునే పాస్టర్లకు ఉపయోగపడుతుంది.
- పైన పేర్కొన్నవే కాకుండా, మీరు గాని మీకు తెలిసిన వారు గాని జీవితంలో దేని గురించైనా ఇబ్బందులు పడుతూ ఉంటే ఈ పుస్తకంలోని అంశాలు మీకు సహాయపడతాయి.
- ఉదాహరణకు, ఆందోళనతో ఉంటే "దేవుని ఉనికి" అనే అధ్యాయం ఎంతో సహాయకరంగా ఉంటుంది.
- అన్నీ మీకు వ్యతిరేకంగా ఉన్నాయని అనిపించినప్పుడు "దేవుని సార్వభౌమాధికారం" అనే అధ్యాయం కష్టాలలో ఉన్న ఆత్మను శాంతింపజేస్తుంది.
- పాపాన్ని అధిగమించడానికి పోరాడుతూ ఉంటే, "దేవుని పరిశుద్ధత" "దేవుని ప్రేమ" అనే అధ్యాయాలు సహాయపడతాయి.
- ఒక నిర్ణయాన్ని తీసుకోవడం కష్టంగా ఉంటే "దేవుని జ్ఞానం" అనే అధ్యాయం మార్గాన్ని చూపిస్తుంది.

కాబట్టి మీరు ఈ పుస్తకాన్ని వివిధ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవచ్చు. ఈ పుస్తకాన్ని తయారు చేయడానికి ఉపయోగించిన వనరుల జాబితా కూడా చివరలో ఇవ్వబడింది. ఈ ముఖ్యమైన అంశం గురించి లోతైన అవగాహన పొందడానికి అవి మీకు సహాయపడతాయి.

ప్రభువు ఈ పుస్తకాన్ని ఉపయోగించి మీరు ఆయనను మరింతగా తెలుసుకోవడంలో మరియు ఆయనపై మీ ప్రేమను పెంపొందించుకోవడంలో సహాయపడాలని నేను హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను.

ఈ పుస్తకంలోని ఏ భాగానికి కాపీరైట్ లేదు. రచయితకు పేరు కూడా అవసరం లేదు. కాబట్టి మీ అవసరానికి తగినట్లుగా దీనిని ఉపయోగించడానికి ఏ మాత్రం సంకోచించకండి.

దేవునికే మహిమ కలుగును గాక!

క్రీస్తులో,

*రామ్ కృష్ణమూర్తి*

# భగవంతుని గుణాలను ఎందుకు అధ్యయనం చేయాలి

AW టోజర్ తన ప్రసిద్ధ పుస్తకం, *ది నాలెడ్జ్ ఆఫ్ ది హోలీలో* ఇలా అన్నాడు:

> *దేవుని గురించి సరైన భావన క్రమబద్ధమైన వేదాంతానికి మాత్రమే కాకుండా ఆచరణాత్మక క్రైస్తవ జీవనానికి కూడా ప్రాథమికమైనది..., సిద్ధాంతంలో ఏదైనా తప్పు ఉంది అని అనుకొనుటలో లేదా క్రైస్తవ విలువలను అమలు చేయడంలో విఫలం అవ్వడం కేవలము దేవుని గురించి లోపభూయిష్ఠ మరియు నాసిరకం ఆలోచనల వలన మాత్రమే కలుగుతుందని నేను నమ్ముతున్నాను*

మనం దేవునికి ఇష్టమైన అంగీకరమైన క్రైస్తవ జీవితాన్ని జీవించాలని కోరుకుంటే, మనం ఆయన గురించి సరైన ఆలోచనలను కలిగి ఉండటానికి ప్రయత్నించాలి. బైబిలు దేవుణ్ణి ఆయన లక్షణాల ద్వారా మాత్రమే అర్థం చేసుకోగలం కాబట్టి, మనం వాటిని అధ్యయనం చేయడం చాలా ముఖ్యం. కాబట్టి ఈ చిన్న పుస్తక లక్ష్యం ఏమిటంటే దేవుని లక్షణాలను అధ్యయనం చేసి దాని ఫలితంగా ఆయన లక్షణాల గురించి మన అవగాహనను పెంపొందించుకోవడమే.

ఈ విషయంపై లోతైన అధ్యయనం చేసేలా మీకు ప్రోత్సాహం కలుగుతుందని నేను ఆశిస్తున్నాను. ఇది అనేక ఆశీర్వాదాలను అందించే జీవితకాల అధ్యయనం; వాటిలో ఐదు క్రింద ఉన్నాయి.

## దేవుని లక్షణాలను అధ్యయనం చేయడం వల్ల కలిగే ఐదు ఆశీర్వాదాలు

### ఆశీర్వాదం #1: దేవుడు అంగీకరించే ఆరాధన చేసేలా ఇది మనకు సహాయపడుతుంది.

హెబ్రీ పుస్తక రచయిత *"వినయ భయభక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవ చేయుదుము" అని మనకు ఆజ్ఞాపించాడు (హెబ్రీ 12:28). ఆయన* ఎవరో తెలుసుకోకుండా మనం దీన్ని ఎలా చేయగలం? దేవుణ్ణి ఆయన లక్షణాల ద్వారా మాత్రమే అర్థం చేసుకోగలం కాబట్టి, ఆయనకు ఇష్టమైన విధంగా ఆయనను ఆరాధించడానికి వాటి గురించి మన అవగాహన పెరగాలి.

### ఆశీర్వాదం #2: ఇది దేవునికి ఇష్టము.

దేవుని సంతోషపెడుతూ ఆయనకు తగినట్లుగా ఉండే *"దేవుని విషయమైన జ్ఞానమందు అభివృద్ధి పొందుచు .."* అని కొలస్సి 1:10 వివరిస్తుంది. దేవుణ్ణి ఆయన లక్షణాల ద్వారా మాత్రమే అర్థం చేసుకోగలం కాబట్టి బైబిల్లో మనకు వెల్లడించిన ఆయన లక్షణాలను అధ్యయనం చేస్తేనే మనం *దేవుని జ్ఞానంలో* ఎదగగలము. దేవుని గురించి అధ్యయనం చేసే దైవశాస్త్రం క్రైస్తవుల ఎదుగుదలకు చాలా కీలకం. దైవశాస్త్రం కేవలం క్రైస్తవ్యంలోని పండితులకు సంబంధించిందని అనుకోవడం అపోహ మాత్రమే. దైవశాస్త్రం ప్రతి క్రైస్తవునికి సంబంధించింది. ఎందుకంటే, ప్రతి క్రైస్తవుడు ఆయన స్వభావాన్ని అర్థం చేసుకోవడం ద్వారా దేవునిని సంతోషపెట్టడానికి ప్రయత్నించాలి!

### ఆశీర్వాదం #3: దేవుని పట్ల తప్పుడు దృక్పథాన్ని కలిగి ఉండకుండా ఇది మనల్ని కాపాడుతుంది.

ఒక వ్యక్తి స్వభావం తప్పనిసరిగా అతడు ఆరాధించే దేవుని స్వభావాన్ని బట్టి ఉంటుందని అంటారు. బైబిల్లోని దేవుని పట్ల మన దృక్పథం తప్పుగా ఉంటే, అది మన ఆరాధనను మాత్రమే కాకుండా మన స్వభావాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. అందుకే ఈ అధ్యాయం ప్రారంభంలో ఉన్న టోజర్ హెచ్చరికను పాటించడం చాలా

ముఖ్యం. దేవుని లక్షణాల గురించి సరైన అవగాహన లేకపోతే దేవుని పట్ల తప్పుడు దృక్పథం ఏర్పడుతుంది, దాని ఫలితంగా మన జీవితం ద్వారా ఆయనను సంతోషపెట్టడంలో విఫలమవుతాము. అందుకే దేవుని లక్షణాలను అధ్యయనం చేయడం చాలా ముఖ్యం. దేవుని లక్షణాలను జీవితకాలం అధ్యయనం చేసినా కూడా ఆయన లక్షణాల గురించి పూర్తి అవగాహన పొందలేమని నేను అంగీకరిస్తున్నాను ఎందుకంటే, అనంతమైన దేవుడిని పూర్తిగా అర్థం చేసుకోవడం పరిమిత జీవులకు అసాధ్యం.

అయితే, మనల్ని దేవుని స్వరూపంలో సృష్టించారు కాబట్టి దేవునికి సంబంధించిన కొన్ని సత్యాలను పరస్పరం అనుసంధానించగల సహజ సామర్థ్యం మనకు ఉంది. క్రీస్తులో నూతన సృష్టిగా ఉన్నందున (2 కొరింథీ 5:17), మనలో ఉన్న పరిశుద్ధాత్మ (1 కొరింథీ 2:13) నేర్పే మాటలతో మనం దేవుణ్ణి మరింత ఎక్కువగా తెలుసుకోవచ్చు. 25 సం. లు పరిచర్య చేసిన తర్వాత కూడా, *"నేను క్రీస్తును తెలుసుకోవాలనుకుంటున్నాను"* (ఫిలిప్పీ 3:10) అని పౌలు తన కోరికకు చెప్పాడు.

## ఆశీర్వాదం #4: ఇది మన హృదయాలలో ఆనందాన్ని కలిగిస్తుంది.

మానవుని అంతిమ లక్ష్యం దేవుణ్ణి మహిమపరచడం, ఆయనలో నిత్యం ఆనందించడమే అని వెస్ట్‌మిన్‌స్టర్ కాచికిజంలో ఉంది. దేవుని గురించి మన జ్ఞానం పెరిగేకొద్దీ, ఆయన పట్ల మనకున్న ప్రేమ పెరుగుతుంది, అలాగే మన విధేయత కూడా పెరుగుతుంది. దాని ఫలితంగా, పరిశుద్ధాత్మ మన జీవితాలలో మరింత ఆనందాన్ని కలిగిస్తుంది (గలతీ 5:22). గతకాలంనాటి ప్రఖ్యాత బోధకుడు చార్లెస్ స్పర్జన్ మాటలు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటాయి:

> *దేవుడనే లోతైన సముద్రంలో మునిగిపోండి; ఆయన అపారత్వంలో కొట్టుకుపోండి; అప్పుడు మీరు విశ్రాంతి పొంది బలం పుంజుకున్న వారిగా బయటకు వస్తారు. ఇంతగా ఆత్మను ఓదార్చగలిగి, బాధలు దుఃఖమనే ఎగసిపడే అలలను శాంతపరచి, చుట్టుముట్టిన ఇబ్బందులకు సమాధానం చెప్పగలిగే శక్తి నాకు తెలిసి మరి ఎవరికీ లేదు.*

## ఆశీర్వాదం #5: బాధలు కలిగినప్పుడు బైబిలు అనుసారంగా స్పందించడానికి ఇది మనకు సహాయపడుతుంది.

పతనమైన ఈ ప్రపంచంలో బాధలు సహజం (రోమ 8:20). క్రైస్తవులు కూడా వీటి నుండి తప్పించుకోలేరు. మనం ఎదుర్కొనే బాధలకు ఖచ్చితమైన లేదా సరైన సమాధానాలు లేవు. అలాంటి సమయాల్లో మనం దేవుని ప్రశ్నించేలా పురికొల్పబడతాము, చాలా నిరుత్సాహానికి నిరాశకు లోనై ఆయనకు దూరం అవుతాము. అయితే, ఆయన స్వభావంపై మన అవగాహన పెరిగేకొద్దీ ఆయనపై మనకున్న విశ్వాసం ఎక్కువ అవుతుంది. అది జరిగినప్పుడు, బాధలు ఎందుకు వస్తున్నాయని తెలుసుకోవడానికి బదులుగా దేవుడు మనల్ని విడిచిపెట్టలేదని, ఆయన వాగ్దానం చేసినట్లుగా మనల్ని సురక్షితంగా ఇంటికి తీసుకువెళతారని తెలుసుకుని మనం దేవునిలో విశ్రాంతిని పొందుతాము (ఫిలిప్పీ 1:6).

దైవభక్తిగల యోబు ఇది నిజమని తెలుసుకున్నాడు. అతనికి ఊహించలేని బాధలను ఎదురయ్యాయి, అనేక ప్రశ్నలతో అతడు పెనుగులాడుతూ, వాటిని దేవుడినే అడగాలనుకున్నాడు (యోబు 13:3). కానీ దేవుడు చివరకు యోబుకు తనను తాను బయలుపరచుకున్నప్పుడు, యోబు తన నోటిపై చేతులు పెట్టుకోవడమే కాకుండా తనకు అర్థం కాని విషయాల గురించి మాట్లాడినందుకు పశ్చాత్తాపపడ్డాడు (యోబు 40:4, 42:4-6). యోబు తన ప్రశ్నలకు సమాధానాలు పొందనప్పటికీ, దేవుని గురించిన తన అవగాహనను పెంచుకోవడంలో అతడు నెమ్మది పొందాడు. మీ విషయంలో నా విషయంలో అదే సత్యం. దేవుని స్వభావాన్ని మనం ఎంత ఎక్కువగా అర్థం చేసుకుంటే బాధలు కలిగినప్పుడు బైబిలు అనుసారంగా అంతగా స్పందించగలము, అంటే విశ్వాసం ద్వారా ఆయనను అంటిపెట్టుకుని ఉంటాము, ఆయనను ప్రశ్నించం, నిరుత్సాహానికి నిరాశకు గురికాకుము, ఆయన నుండి మనం దూరం అవ్వము.

ఈ ఐదు ఆశీర్వాదాలు దేవుని లక్షణాలను జీవితకాలం అధ్యయనాన్ని కొనసాగించేందుకు మనల్ని ప్రేరేపిస్తాయని నేను ఆశిస్తున్నాను. అయితే మనం ఆయన లక్షణాలను అధ్యయనం చేసే ముందు, ఈ విషయం గురించి కొన్ని ప్రాథమిక సత్యాలను చూద్దాం.

## దేవుని లక్షణాలకు సంబంధించిన ప్రాథమిక సత్యాలు

***లక్షణాలు అంటే ఏమిటి.*** ఒక వ్యక్తిలో అంతర్లీనంగా ఉండే స్వభావాన్ని లేదా గుణాన్ని లక్షణం అంటారు. దేవుని లక్షణాలను ప్రస్తావిస్తున్నప్పుడు లేఖనాలలో మనకు వెల్లడించిన ఆయన స్వభావంలో అంతర్లీనంగా నిత్యం ఉండే వివిధ లక్షణాల గురించి చెప్తాము.

***ఏవి లక్షణాలు కావు.*** దేవుని వివిధ లక్షణాలు దేవునిలోని కొన్ని భాగాలు కావు. మరో మాటలో చెప్పాలంటే, దేవుడు 10% ప్రేమ కాదు, 15% పరిశుద్ధుడు కాదు, 5% దయామయుడు కాడు. ప్రతి లక్షణం ఆయనను సంపూర్ణంగా వివరిస్తుంది. ఉదాహరణకు, ప్రేమ దేవుని స్వభావంలో ఒక భాగం కాదు; ఆయనే *ప్రేమగా ఉన్నాడు.* పరిశుద్ధత దేవుని స్వభావంలో ఒక భాగం కాదు; ఆయన సంపూర్ణంగా పరిశుద్ధుడు. నీతి దేవుని స్వభావంలో ఒక భాగం కాదు; దేవుడు పూర్తిగా నీతిమంతుడు.

దేవుడు తన లక్షణాలలో ఒకదానిని చూపించేటప్పుడు మరొక దానిని విషయంలో రాజీపడరు. మరో మాటలో చెప్పాలంటే, ప్రేమాస్వరూపియైన అదే దేవుడు (1 యోహాను 4:8) కోపాన్ని కూడా చూపిస్తారు (కీర్తనలు 5:5). "దేవుడు ప్రేమాస్వరూపి" కాబట్టి, ఆయన ప్రజలందరినీ రక్షిస్తారనే నిశ్చయానికి రాకూడదని మనం గమనించాలి. ప్రేమాస్వరూపియైన దేవుడు పరిశుద్ధుడు కనుక కోపాన్ని కూడా చూపిస్తారు. అందుకే "దేవుడు పాపిని ప్రేమిస్తారు కానీ పాపాన్ని ద్వేషిస్తారని" చాలా జాగ్రత్తగా చెప్పారు.

దేవుడు తన ప్రేమపూర్వక స్వభావం కారణంగా పశ్చాత్తాపపడిన పాపులను రక్షించినట్లే, తన పరిశుద్ధత కారణంగా పశ్చాత్తాపపడని పాపులను శాశ్వతమైన నరకంలో పడవేయమని తీర్పు తీరుస్తారు. దేవుడు కేవలం పాపాన్ని మాత్రమే శిక్షించరు. తన కుమారుడైన యేసుక్రీస్తుపై విశ్వాసం ఉంచి తన వైపు తిరగకుండా పాపంలోనే కొనసాగుతున్న పాపిని కూడా శిక్షిస్తారు. అందుకే మనం దేవుని లక్షణాలను అధ్యయనం చేస్తున్నప్పుడు, ఆయనకున్న ఒక లక్షణాన్ని వివరిస్తున్నప్పుడు మిగిలిన లక్షణాలు ప్రభావితం కాకుండా మనం జాగ్రత్తపడాలి. దేవుడు సర్వగుణ సంపూర్ణుడు.

దేవుని లక్షణాలను 2 వర్గాలుగా వర్గీకరించవచ్చు: సంక్రమించలేని లక్షణాలు, సంక్రమించగల లక్షణాలు

***సంక్రమించలేని లక్షణాలు:*** ఇవి దేవునికి మాత్రమే సంబంధించిన లక్షణాలు. అవి మనకు సంక్రమించవు. ఉదాహరణలు దేవుని స్వీయ-అస్తిత్వం, ఆయన సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞాని, సర్వాంతర్యామి మొదలైనవి.

***సంక్రమించగల లక్షణాలు:*** మనం పరిమిత స్థాయిలో కలిగి ఉండే దేవుని లక్షణాలు ఇవి. ఉదాహరణకు ప్రేమ, దయ, కనికరం మొదలైనవి.

కొన్ని లక్షణాలను ఒక వర్గానికే చెందుతాయని మరొక వర్గానికి చెందవని ఖచ్చితంగా వర్గీకరించడం ఎప్పుడూ సులభం కాదని నేను అంగీకరిస్తున్నాను. ఉదాహరణకు, సర్వజ్ఞాని అనేది సంక్రమించని లక్షణం అయితే, సర్వజ్ఞుడైన దేవునితో పోలిస్తే అది చాలా పరిమితమైనప్పటికీ, మనుషులమైన మనకూ కొంత జ్ఞానం ఉంది. కాబట్టి, లక్షణ వర్గంపై కాకుండా లక్షణాలను స్వయంగా అధ్యయనం చేయడంపై మనం ఎక్కువగా దృష్టి పెట్టాలి.

ఆ ప్రాథమిక ఆలోచనలతో ఈ క్రింది పేజీలలో కొన్ని దేవుని లక్షణాలను ప్రార్థనాపూర్వకంగా అధ్యయనం చేద్దాం.

# లక్షణం 1: దేవుని పవిత్రత

*దేవుని పరిశుద్ధత అనేది పాపం నుండి దాని అన్ని రూపాల నుండి పూర్తిగా వేరుగా ఉండడమే కాకుండా, ఆయన పవిత్రంగా, తన మిగిలిన సృష్టి అంతటి నుండి వేరుగా ఉన్నారని కూడా సూచిస్తుంది.*

క్రింది సారూప్యత మనకు దేవుని పరిశుద్ధత గురించి పై వివరణను బాగా అర్థం చేసుకోవడంలో సహాయపడవచ్చు:

> *ఆరోగ్యంగా ఉండటం అంటే ఏమిటి? ఇది కేవలం అనారోగ్యం లేకపోవడమే కాదు కానీ సరైన శక్తిని కలిగి ఉండడం కూడా. పరిశుద్ధత అనేది చెడు లేకపోవడాన్ని మరియు అనుకూలమైన సరైన విషయాల ఉనికిని సూచిస్తుంది. దేవుని గురించి చెప్పాలంటే, ఆయన పవిత్రత అనేది ఆయన వ్యక్తిత్వం మరియు స్వభావం అలాగే ఆయన చిత్తం మరియు పని యొక్క స్వచ్ఛతను సూచిస్తుంది.*

ఒక రచయిత ప్రకారం:

> *అనేకమంది దేవుని పరిశుద్ధతను అన్నింటికన్నా ప్రధానమైన లక్షణంగా చూస్తారు ఎందుకంటే పరిశుద్ధత అనేది దేవుని ఇతర లక్షణాలన్నింటిలోనూ ఉంటుంది. ఆయనకు, ఆయన చేసే వాటన్నింటికి అది అనుగుణంగా ఉంటుంది. దేవుని పరిశుద్ధతలో అనేక విశేషాలు కలగలసి ఉన్నాయి.*
>
> *"ఆయన తన సృష్టి కంటే పూర్తిగా భిన్నమైనవాడు, మహోన్నతమైన మహిమతో వాటి కంటే ఉన్నతంగా ఉన్నారు. ఆయన "మహోన్నతమైన పరిశుద్ధస్థలములో" నివసిస్తున్నాడు అని యెషయా 57:15 ఆయన సర్వోన్నత్వాన్ని వివరిస్తుంది.*
>
> *ఇది నైతిక ప్రాముఖ్యతను కలిగి ఉంది, "ఆయన చెడు నుండి పాపం నుండి వేరుగా ఉన్నారని" సూచిస్తుంది. 'పరిశుద్ధత' అనేది దేవుని గంభీరమైన స్వచ్ఛతను లేదా మహిమను సూచిస్తుంది. దీనికి పునాది లేవీ 11:44,45: "నేను పరిశుద్ధుడను గనుక మీరు పరిశుద్ధులై ఉండుము." దేవుడు నైతికంగా పవిత్రంగా ఉన్నందున, ఆయన చెడును క్షమించలేరు లేదా దానితో ఎటువంటి సంబంధం కలిగి ఉండరు (కీర్తన 11:4-6). ఆయన పరిశుద్ధతలో దేవుడు నీతి న్యాయ ప్రమాణాలను కలిగి ఉన్నారు; ఆయనే చట్టం. ఆయనే ప్రమాణాన్ని నిర్ణయిస్తారు.*

లేఖనంలో ఒక్కసారి మాత్రమే దేవుని లక్షణమైన పరిశుద్ధతను వరుసగా మూడుసార్లు ప్రస్తావించారు: *"సెరాపులు, సైన్యములకధిపతియగు యెహోవా, పరిశుద్ధుడు పరిశుద్ధుడు పరిశుద్ధుడు; సర్వలోకము ఆయన మహిమతో నిండియున్నది అని గొప్ప స్వరముతో గాన ప్రతిగానములు చేయుచుండిరి"* (యెషయా 6:3). నిజానికి, పరిశుద్ధత అనేది "అన్ని లక్షణాల లక్షణం" కావచ్చు.

దేవుని పరిశుద్ధత కనీసం మూడు విధాలుగా రుజువు కావడం మనం చూడవచ్చు.

## 1. దేవుని పరిశుద్ధత ఆయన స్వభావాన్ని బట్టి రుజువు అవుతుంది

దేవుని పరిశుద్ధత అంటే ఆయన పాపం నుండి పూర్తిగా వేరుగా ఉన్నారు. "దేవుడు వెలుగైయున్నాడని" చెప్పిన 1 యోహాను 1:5 నుండి ఈ సత్యం స్పష్టమవుతుంది. ఇతర వెలుగులలో దేవుడు ఒక వెలుగు అని గాని దేవునికి వెలుగు ఉందని గాని ఇక్కడ చెప్పలేదని గమనించండి. దేవుడు వెలుగైయున్నాడని చెబుతుంది. "దేవుడు

ఆత్మ" (యోహాను 4:24a), "దేవుడు ప్రేమాస్వరూపి" (1 యోహాను 4:8b) అయినట్లే దేవుడు కూడా తన స్వభావంలో *పరిశుద్ధుడు.* దీని గురించి ప్రత్యేకంగా చెప్పిన వచనాలు కొన్ని ఇక్కడ ఉన్నాయి:

> **నిర్గమ 15:11 –** *యెహోవా, వేల్పులలో నీవంటివాడెవడు పరిశుద్ధతనుబట్టి నీవు మహనీయుడవు స్తుతికీర్తనలనుబట్టి పూజ్యుడవు అద్భుతములు చేయువాడవు నీవంటివాడెవడు?*
>
> **1 సమూయేలు 2:2 –** *యెహోవావంటి పరిశుద్ధ దేవుడు ఒకడునులేడు నీవు తప్ప మరి ఏ దేవుడును లేడు మన దేవునివంటి ఆశ్రయదుర్గమేదియులేదు.*

## 2. దేవుని పరిశుద్ధత ఆయన పనుల ద్వారా రుజువు అవుతుంది

దేవుని పరిశుద్ధత ఆయన స్వభావంలోనే కాక సమస్త సృష్టిలోను, లేఖనాల ద్వారా కూడా కనిపిస్తుంది.

*సృష్టిలో:* దేవుడు సృష్టినంతా చేసినప్పుడు అది స్వచ్ఛంగా పాపరహితంగా ఉందని ఆది 1:31 స్పష్టంగా చెబుతుంది.

*లేఖనాలలో:* *"కాబట్టి ధర్మశాస్త్రము పరిశుద్ధమైనది, ఆజ్ఞ కూడ పరిశుద్ధమైనదియు నీతిగలదియు ఉత్తమమైనదియునై యున్నది"* అని రోమా 7:12లో ఉంది. అందుకే బైబిలును "పరిశుద్ధ బైబిలు" అని పిలుస్తారు.

కాబట్టి, పరిమితంగా బయలుపరచుకున్న దేవుని సాధారణ ప్రత్యక్షత అయిన సృష్టిలో అనగా ప్రకృతిలో, తనను తాను ఎక్కువగా బయలుపరచుకున్న దేవుని ప్రత్యేక ప్రత్యక్షత అయిన లేఖనాలలో దేవుని పరిశుద్ధత ఆయన పనుల ద్వారా రుజువు అయ్యింది. ఒక రచయిత ప్రకారం, "శక్తి దేవుని హస్తం; సర్వజ్ఞత ఆయన కళ్ళు; దయ ఆయన మనస్సు; ఆయన కాలం శాశ్వతత్వం; కానీ పరిశుద్ధత ఆయన అందం". పాపపు బంధకాల నుండి విడుదల పొందిన వారు దేవుని పరిశుద్ధతను ఆయన లక్షణాలన్నిటిలో అత్యంత సుందరమైనదిగా చూడటంలో ఆశ్చర్యం లేదు.

## 3. దేవుని పరిశుద్ధత పాపానికి ఆయన ప్రతిస్పందన ద్వారా రుజువు అవుతుంది

*"ఆయనయందు చీకటి ఎంతమాత్రమును లేదు"* (1 యోహాను 1:5b) అని చెప్పి అపొస్తలుడైన యోహాను *"దేవుడు వెలుగైయున్నాడు"* (1 యోహాను 1:5) అనే సత్యాన్ని బలపరిచాడు. దేవుడు వెలుగు కాబట్టి, వెలుగుకు వ్యతిరేకమైన చీకటి ఆయనలో ఉండదు. వెలుగు కలుషితం కానట్లే దేవునిలో చీకటి ఉండదు. అందుకే దేవుడు అన్ని రకాల పాపాలను ద్వేషిస్తారు ఎందుకంటే చీకటి అంటే పాపమే (యోహాను 3:19).

*"నీ కనుదృష్టి దుష్టత్వము చూడలేనంత నిష్కళంకమైనది గదా; బాధించువారుచేయు బాధను నీవు దృష్టింపజాలవు గదా"* అని హబక్కూకు 1:13లో పాపం పట్ల దేవుని ప్రతిస్పందనను మనం చదువుతాము. దేవుడు స్వచ్ఛతను ఎంతగా ప్రేమిస్తారో అపవిత్రత అంతే ద్వేషిస్తారు. *"భక్తిహీనుల మార్గము యెహోవాకు హేయము, నీతి ననుసరించువానిని ఆయన ప్రేమించును"* అని సామెతలు 15:9లో ఉంది. దేవుడు చెడును అసహ్యించుకుంటారు కాబట్టి, ఆయన చెడును ఖచ్చితంగా శిక్షిస్తాడు. నోవహు కాలంలో సంభవించిన జలప్రళయం, సొదొమ గొమొఱ్ఱాను నాశనం చేయడం, యూదులను బానిసలుగా మార్చుకున్నందుకు ఫరోకు ఈజిప్టువారికి తీర్పు తీర్చడం ఈ వాస్తవాన్ని నిరూపించే కొన్ని ఉదాహరణలు.

కానీ పాపంపై దేవునికి ఉన్న ద్వేషానికి అత్యున్నత ఉదాహరణ, సిలువపై మన పాపాలను భరించిన ఆయన కుమారుడైన యేసుకు ఆయన తీర్పు తీర్చడంలో కనిపిస్తుంది. ప్రభువైన యేసు మన పాపాలను సిలువపై మోసినప్పుడు దేవుడు తన ప్రియమైన కుమారునిపై తన కోపాన్నంతా కుమ్మరించారు. ఆయన కుమారుడు సిలువలో బాధపడినందుకు దేవుడు తన పరిశుద్ధతను తగ్గించుకోలేదు. ఆయన తన కుమారుని అవసరాలను తీర్చడానికి తన నీతి ప్రమాణాన్ని తగ్గించుకోలేదు. దేవుడు పాపాన్ని ఎంతగా ద్వేషిస్తున్నాడో దీన్ని బట్టి తెలుస్తుంది. ఆయన చీకటితో ఎప్పుడూ రాజీపడరు.

# దేవుని పరిశుద్ధతకు మన ప్రతిస్పందన

కాబట్టి, దేవుని పరిశుద్ధతకు మన ప్రతిస్పందన ఎలా ఉండాలి? అపొస్తలుడైన పేతురు దానిని 1 పేతురు 1:14-16లో (లేవీ 11:44-45, 19:2 నుండి) చాలా చక్కగా చెప్పాడు, *"నేను పరిశుద్ధుడనై యున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడని వ్రాయబడియున్నది. కాగా మీరు విధేయులగు పిల్లలై, మీ పూర్వపు అజ్ఞానదశలో మీకుండిన ఆశల ననుసరించి ప్రవర్తింపక, మిమ్మును పిలిచినవాడు పరిశుద్ధుడైయున్న ప్రకారము మీరును*

*సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులైయుండుడి."* ఒక రచయిత చాలా సరిగ్గా పేర్కొన్నట్లుగా, ఇదే దేవుణ్ణి ఘనపరచడానికి ప్రధాన మార్గం. అద్భుతాలను ప్రశంసించడం వల్ల, ఆయన కార్యాల గురించి గొప్పగా చెప్పడం వల్ల కన్నా కల్మషం లేని ఆత్మతో ఆయనతో సంభాషించాలని ఆకాంక్షిస్తున్నప్పుడు, ఆయనలాగే ఆయన కోసం మనం జీవించినప్పుడు మాత్రమే మనం దేవుణ్ణి ఎక్కువగా మహిమపరచగలము.

ప్రభువు మనకు నేర్పిన ప్రార్థనలో మొదటి వాక్యం *"పర లోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడుగాక* (మత్తయి 6:9) అని ఉంటుంది. పరిశుద్ధుడైన దేవుణ్ణి ఘనపరచడానికి మనం పరిశుద్ధమైన జీవితాన్ని గడపడమే ఉత్తమ మార్గం. అభిమానానికి సరైన స్పందన అనుకరణ మాత్రమే! దేవుడు పరిశుద్ధుడు కాబట్టి పరిశుద్ధంగా ఉండాలనే విశ్వాసి కోరికలోని సారాంశాన్ని ఒక పాత విశ్వాసి ప్రార్థన తెలియజేస్తుంది:

> *నా దేవా,*
>
> *నేను నిన్ను సంతోషపెట్టడాన్ని, నేను ఎలా ఉండాలనుకుంటున్నానో అలా ఉండడాన్ని నేను పరలోకంగా భావిస్తున్నాను. నీవు పరిశుద్ధుడవు నేను పరిశుద్ధునిగా ఉంటాను, క్రీస్తులా నేను పరిశుద్ధుడనవుతాను, పరిశుద్ధాత్మలా నేను పరిపూర్ణుడనవుతాను!*
>
> *ఇవి నీ గ్రంథంలో అత్యుత్తమ ఆదేశాలు అని భావిస్తున్నప్పుడు నేను వాటిని ఉల్లంఘించగలనా? నేను వాటిని మీరగలనా? నేను ఇక్కడ నివసించినంత కాలం అలాంటి అవసరం నాకు ఉంటుందా?*
>
> *పాపినైన నాకు శ్రమ శ్రమ! దయామయుడు కరుణామయుడైన దేవుణ్ణి నేను దుఃఖపెడుతున్నాను ...*
>
> *ఆ మహోన్నతుడిని కీర్తించడానికి పూజించడానికి నేను ఏమి చేయాలి? ఆయనను సేవించడానికి నిత్యం నా ఆత్మను శరీరాన్ని పరిశుద్ధపరచుకోవడమే కదా!*
>
> *ఇకపై ఆయన ఇష్టానికి ఆయన ప్రేమకు అనుగుణంగా లేని నా సొంత ఇష్టాలను, ఆలోచనలను, బంధాలను అనుసరించకుండా ఆయనకు నన్ను నేను అప్పగించుకోవడమే కదా!*

*"పరిశుద్ధతలేకుండ ఎవడును ప్రభువును చూడడు"* అని హెబ్రీ 12:14 స్పష్టంగా చెప్తుంది. *"తన పరిశుద్ధతలో పాలుపొందవలెనని"* దేవుడు తన పిల్లలను క్రమశిక్షణలో ఉంచుతారు (హెబ్రీ 12:10). *"దేవుని భయముతో పరిశుద్ధతను సంపూర్తిచేసికొనుచు, శరీరమునకును ఆత్మకును కలిగిన సమస్త కల్మషము నుండి"* మనల్ని మనం వేరుగా చేసుకోవాలని ఆజ్ఞాపించారు (2 కొరింథీ 7:1). *"పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా"* మనల్ని మనం నిరంతరం దేవునికి సమర్పించుకోవాలి (రోమా 12:1). ఈ వచనాలు ఆయన దయతో పరిశుద్ధాత్మపై ఆధారపడటం ద్వారా పాపంతో పోరాడడానికి, పరిశుద్ధతను నిత్యం వెంటాడడానికి పిలుపునివ్వలేదా?

అందుకే యేసుపై ఎప్పుడూ విశ్వాసం ఉంచని వారు ఆలస్యం చేయకుండా ఆయన వైపు తిరగడంతో మొదలుపెట్టాలి. మీరు ఈ పరిశుద్ధ దేవుని నుండి తప్పించుకోలేరు. భవిష్యత్తులో తీర్పు రాబోతోందని బైబిలు స్పష్టంగా చెబుతోంది. మీరు యేసు ద్వారా మీ పాపాలకు క్షమాపణ పొందకుండా చనిపోతే, మీ భవిష్యత్తు చీకటిమయంగా ఉంటుంది. అటువంటి వారందరికీ అంతిమ నివాస స్థలం అగ్నిగుండమే (ప్రకటన 20:14), దీనినే నరకం అని కూడా పిలుస్తారు (మత్తయి 5:29), అక్కడ వారు నిత్యం హింసించబడుతూ బాధలు అనుభవిస్తారు. సాతానుకు, దాని దుష్టాత్మలకు శాశ్వతమైన శిక్ష విధించి పడవేసే చోట కూడా నరకమే (ప్రకటన 20:10; మత్తయి 25:41).

కాబట్టి, ప్రేమపూర్వకంగా నేను మీకు విజ్ఞప్తి చేస్తున్నాను: ఈ రోజే మీ పాపాలను విడిచిపెట్టి క్రీస్తు వైపు తిరగండి. *"మీరాయన మాట వినినయెడల మీ హృదయములను కఠినపరచుకొనకుడి"* (హెబ్రీ 4:7b). మీ పాపాలు క్షమించబడే ఏకైక మార్గం యేసు మాత్రమే. యేసు ద్వారా మాత్రమే మీరు ఈ పరిశుద్ధ దేవునితో సమాధానపడగలరు. మిమ్మల్ని రక్షించమని యేసుకు మొరపెట్టి మీ పాపాల నుండి విడుదల పొందిన ఆనందాన్ని అనుభవించండి. అప్పుడు మాత్రమే మీరు పరిశుద్ధమైన జీవనశైలిని ఆలోచనలలో పనులలో రెండింటిలోనూ కొనసాగించగలిగే శక్తిని పరిశుద్ధాత్మ ద్వారా పొందుతారు.

*"దేవుడు వెలుగైయున్నాడు; ఆయనయందు చీకటి ఎంతమాత్రమును లేదు"* (1 యోహాను 1:5) అని గుర్తుంచుకోండి. దేవునికి చీకటితో ఎలాంటి సంబంధం లేదు, కాబట్టి ఆయన పిల్లలుగా మనకు కూడా చీకటితో సంబంధం లేదు. దేవుని మార్గాలు పరిశుద్ధమైనవి కాబట్టి అవి ఎల్లప్పుడూ ఉత్తమమైనవి. ఇది జీవమార్గం వెలుగు మార్గం; తప్పిపోడానికి తడబడటానికి ఎటువంటి ఆస్కారం కారణం లేదు. దేవుని పట్ల మన దృక్పథం ఎంత ఉన్నతంగా ఉంటుందో, అంత పరిశుద్ధంగా మన ప్రవర్తన ఉంటుంది. తప్పు చేయడానికి ఒప్పుకోని

చిన్నపిల్లవాడిని అతని స్నేహితుడు, “మీ నాన్న నిన్ను కొడతారని భయపడుతున్నావు కదా!” అని ఆటపట్టించినప్పుడు “కాదు. నేనే మా నాన్నను *బాధపెడతానేమోనని* భయపడుతున్నాను” అని చెప్పే ఆ చిన్నపిల్లవానిగా దేవుని పట్ల మన వైఖరి ఉండాలి.

చీకటిలో కాకుండా వెలుగులో నడిచే వ్యక్తి మనస్తత్వం అలా ఉంటుంది. పాపం దేవుణ్ణి బాధపెడుతుంది కాబట్టి మనం పాపాన్ని ద్వేషించాలి. పాపం మనకు చేసినదాని వల్ల కాదు గాని మన ప్రియ రక్షకునికి అది చేసిన దానిని బట్టి మనం పాపాన్ని ద్వేషించాలి. కాబట్టి, మనం ఏదైనా పాపం నుండి బయటపడవలసి ఉంటే, ఆలస్యం చేయకుండా పరిశుద్ధాత్మ శక్తిపై ఆధారపడి దానిని నుండి విడుదల పొందుదాం!

## చర్చా ప్రశ్నలు

1. ఈ అధ్యాయం దేవుని పరిశుద్ధత గురించి మీ దృక్కోణాన్ని ఎలా ప్రభావితం చేసింది?
2. దేవుని ఈ లక్షణాన్ని బట్టి మీరు జీవితంలో ఎలాంటి మార్పులు చేసుకుంటారు?
3. దేవుని ఈ లక్షణం మీ ప్రార్థనలను ఎలా ప్రభావితం చేస్తుంది?
4. దేవుని ఈ లక్షణం మీ సువార్త ప్రచారాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

## ధ్యానించవలసిన /కంఠత చేయవలసిన వాక్యం

**నిర్గమ 15:11 –** *యెహోవా, వేల్పులలో నీవంటివాడెవడు పరిశుద్ధతనుబట్టి నీవు మహానీయుడవు స్తుతికీర్తనలనుబట్టి పూజ్యుడవు అద్భుతములు చేయువాడవు నీవంటివాడెవడు?*

## ప్రార్థన

*ప్రభువా, క్షమించబడిన పాపిలా నన్ను పరిశుద్ధపరచండి.*

# లక్షణం 2: దేవుని శక్తి

*దేవుని శక్తి ఆయన పరిశుద్ధ స్వభావానికి అనుగుణంగా ఆయన చేయాలనుకున్నవన్నీ చేయగల ఆయన సామర్థ్యాన్ని సూచిస్తుంది.*

"బలము తనదని ఒక మారు దేవుడు సెలవిచ్చెను" అని కీర్తన 62:11లో దావీదు చెప్పాడు. బలం దేవునిది, దేవునిది మాత్రమే. "సర్వశక్తిమంతుడు" (ఆది 17:1; నిర్గమ 6:3; 2 కొరింథీ 6:18; ప్రకటన 1:8) అంటే దేవుడు మాత్రమే సమస్త శక్తిని అధికారాన్ని కలిగి ఉన్నారని అర్థం. బైబిలులో 50 కంటే ఎక్కువ సార్లు సర్వశక్తిమంతుడు అని కనిపిస్తుంది; దేవుణ్ణి వివరించడానికి మాత్రమే ఇది ఉపయోగించారు. దేవుడు సర్వశక్తిమంతుడని వర్ణించడానికి ఉపయోగించే మరో పదం "ఓమ్నిపొటెన్స్". "ఓమ్ని", అంటే సమస్తం, "పొటెన్స్" అంటే శక్తివంతమైన అనే రెండు లాటిన్ పదాల నుండి ఈ పదం వచ్చింది. *"మీరు మనుష్యకుమారుడు సర్వశక్తిమంతుని కుడిపార్శ్వమున కూర్చుండుటయు, ఆకాశమేఘారూఢుడై వచ్చుటయు చూచెదరని చెప్పెను"* అని మార్కు 14:62లో యేసు మత నాయకులతో చెప్పినట్లు "శక్తి" అనే పదాన్ని దేవుని పేరుగా కూడా ఉపయోగిస్తారు. దేవుని కుడి చేయి అని చెప్పడానికి బదులుగా, సర్వశక్తిమంతుని కుడి చేయి అని యేసు చెప్పారు. దీనిని బట్టి దేవుడు, శక్తి రెండింటిని విడదీయలేమని తెలుస్తుంది.

దేవుని శక్తి మన శక్తి వంటిది కాదు. మనది అరువు తెచ్చుకున్న శక్తి; బయటి నుండి అంటే దేవుని నుండి పొందినది. దేవుని శక్తి ఆయనలో అంతర్లీనంగా ఉంది. ఆయన శక్తి కోసం ఇతరులపై ఆధారపడవలసిన అవసరం లేదు; ఆయన తన శక్తిని ఎలా ఉపయోగించాలో ఎలా ఉపయోగించకూడదో అని ఇతరులతో సంప్రదించవలసిన అవసరం లేదు. ఆయన సర్వశక్తిమంతుడు!

ఒక రచయిత ఇలా అన్నాడు:

> *దేవుని శక్తి ఏమిటంటే, ఆయన కోరుకున్న దానిని, ఆయన అనంతమైన జ్ఞానం నిర్దేశించిన దానిని, ఆయన పవిత్ర చిత్తాన్ని నెరవేర్చగల సామర్థ్యం, బలం; పరిశుద్ధత దేవుని అన్ని లక్షణాలలో సౌందర్యమైనది అలాగే శక్తి కూడా దైవత్వంలోని పరిపూర్ణతలకు జీవాన్ని క్రియలను ఇస్తుంది.*
>
> *శాశ్వతమైన ఆలోచనలను అమలు చేయడానికి శక్తి ముందుకు రాకపోతే అవి వ్యర్థమే కదా: శక్తి లేకుండా ఆయన దయ బలహీనమైన జాలిగా ఉంటుంది, ఆయన వాగ్దానాలు వట్టివే, ఆయన బెదిరింపులు దిష్టిబొమ్మల వంటివే. దేవుని శక్తి ఆయనలాంటిదే: అది అనంతం, శాశ్వతమైనది, అపారమయినది; సృష్టి దానిని ఆటంకపరచలేదు, నిరోధించలేదు, నిష్ఫలం చేయలేదు.*

కాబట్టి, *"యెహోవాకు అసాధ్యమైనది ఏదైన నున్నదా?"* (ఆది 18:14; యిర్మీయా 32:27) అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం, *"నీకు అసాధ్యమైనదేదియు లేదు"* (యిర్మీయా 32:17). *"నీవు సమస్తక్రియలను చేయగలవనియు నీవు ఉద్దేశించినది ఏదియు నిష్ఫలము కానేరదనియు నేనిప్పుడు తెలిసికొంటిని"* (యోబు 42:2) అని యోబు చెప్తూ ప్రతిదీ చేయగల దేవుని శక్తిని ధృవీకరిస్తున్నాడు.

దేవుని శక్తిని అధ్యయనం చేసేటప్పుడు మనం అర్థం చేసుకోవలసిన కొన్ని విషయాలు ఉన్నాయి.

మొదటిది, దేవుడు ప్రతిదీ చేయగలిగినప్పటికీ, *ఆయన తన పరిశుద్ధ స్వభావానికి విరుద్ధంగా ఏమీ చేయడు.* దేవుడు తనకు తానుగా విధించుకున్న కొన్ని పరిమితులు ఉన్నాయి. ఉదాహరణకు, *దేవుడు అబద్ధమాడడు* (తీతు 1:2, NASB), *దేవుడు కీడువిషయమై శోధింపబడనేరడు* (యాకోబు 1:13), *ఆయన తన స్వభావమునకు విరోధముగా ఏదియు చేయలేడు* (2 తిమోతి 2:13). దేవుడు తన వాక్యానికి కూడా విరుద్ధంగా ప్రవర్తించడు.

ఉదాహరణకు, దేవుడు ప్రజలందరినీ రక్షించాలని కోరుకోలేదు. తమ పాపాలకు పశ్చాత్తాపపడి, విశ్వాసంతో ఆయన కుమారుడైన యేసు వైపు తిరిగే వారు మాత్రమే రక్షించబడతారు. మిగిలిన వారు తీర్పు రోజున ఎంత వేడుకున్నా సరే వారిని నరకంలో పడవేస్తారు!

రెండవది, కొన్ని సందర్భాల్లో, దేవుడు తన శక్తిని *చూపించరు*. దేవుడు తన శక్తిని చూపిస్తే తన పరిశుద్ధ స్వభావంతో రాజీ పడేలా చేసే పరిస్థితులు ఇవి కావు. అయినా, అలాంటి పరిస్థితులలో దేవుడు తన స్వకారణాలను బట్టి తన శక్తిని *చూపించరు*. ఉదాహరణకు, దేవుడు తన కుమారుడిని సిలువ నుండి తప్పించలేదు (రోమా 8:32). ఆయన తన పిల్లలలో చాలా మందిని క్రూరమైన మరణం నుండి తప్పించలేదు (ఉదా. ఆది 4:8లో హేబెలు, అపో. కా 7:59-60లో స్తెఫను). ఆ పరిస్థితుల్లో ఆయన తన విడుదలచేసే శక్తిని చూపించలేరా? ఖచ్చితంగా చూపించగలరు! అయినప్పటికీ, వారు అనుభవించినవన్నీ వారిపట్ల ఆయన ప్రణాళికలో భాగం కాబట్టి ఆయన వారిని తప్పించలేదు.

అదే విధంగా, కొన్నిసార్లు మీరు నేను కూడా కొన్ని బాధాకరమైన సంఘటనలను ఎదుర్కోవలసి ఉంటుంది; దానికి కారణం మనల్ని విడిపించే శక్తి దేవునికి లేదని కాదు, కానీ అది ఆయన ప్రణాళికలో భాగం కాదు. దేవుడు సార్వభౌముడని చెప్పినప్పుడు మన ఉద్దేశం అదే. ఆయన సార్వభౌమాధికారిగా రాజుగా తన సృష్టిని పరిపాలిస్తారు. కాబట్టి, దేవుడు *ఎప్పుడూ* మనకు అనుకూలమైన ఫలితాన్నే ఇస్తాడని చెప్తూ, "దేవునికి అన్నీ సాధ్యమే" (మత్తయి 19:26) అనే వచనాలను *తప్పుగా ఉదాహరించకుండా* జాగ్రత్తపడాలి. పరీక్షల నుండి మనల్ని విడిపించడానికి దేవుడు తన శక్తిని చూపించగలరని, చూపిస్తారని మనం గుర్తుంచుకోవాలి. అయినా సరే కొన్ని సందర్భాలలో ఆయన ఉద్దేశాలకు అనుగుణంగా, పరీక్షల నుండి మనల్ని తప్పించరు కానీ వాటిలో మనల్ని సురక్షితంగా ఉంచుతారు. దానికి కూడా శక్తిని చూపించాలి!

## దేవుని శక్తి వివరణ

లేఖనాలలో బయలుపరచబడినట్లుగా, ఎనిమిది చోట్ల దేవుని శక్తి మనకు స్పష్టంగా కనపడుతుంది. వాటిలో కొన్ని గతానికి, కొన్ని వర్తమానానికి, మరికొన్ని భవిష్యత్తుకు సంబంధించినవి.

***1. విశ్వాన్ని సృష్టించడంలో:*** *ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను* (ఆది 1:1) అనే వాక్యంతో బైబిలు ప్రారంభమవుతుంది. వెనువెంటనే, మనకు దేవుని శక్తి పరిచయం అవుతుంది. కేవలం తన మాటతో ఈ మొత్తం విశ్వాన్ని శూన్యం నుండి ఎవరు సృష్టించగలరు? దేవుడు మాత్రమే చేయగలడు! ఆదిలోని మొదటి రెండు అధ్యాయాలు దేవుని మాటకున్న శక్తితో చేసిన సృష్టి గురించి వివరిస్తాయి. "దేవుడు ... పలుకగా"" (ఉదా., ఆది 1:3, 6, 9) అనే పదాన్ని పదే పదే ఉపయోగించడాన్ని, వెంటనే సృష్టిలోని సమస్తం "కలిగెను" అని గమనించండి. (ఆది 1:7, 9, 11). ఆ శక్తి –అపురూపమైన శక్తి!

దేవుని ప్రత్యేక ప్రకటన లేకున్నా బైబిలు ద్వారా రోమా 1:20 ప్రకారం, సృష్టియే దేవుని శక్తికి సాక్ష్యమిస్తుందని మనకు తెలుస్తుంది. మరో మాటలో చెప్పాలంటే, సృష్టి సృష్టికర్త గురించి సాక్ష్యమిస్తుంది. కాబట్టి దేవుని ఉనికిని ఎవరూ నిరాకరించడానికి లేదు.

***2. స్థిరమైన విశ్వంలో:*** దేవుడు విశ్వాన్ని సృష్టించడమే కాదు, దానిని స్థిరంగా ఉంచేది కూడా ఆయనే. అది కూడా ఆయన శక్తివంతమైన మాటతో జరుగుతుంది. హెబ్రీ 1:3లో *"ఆయన దేవుని మహిమయొక్క తేజస్సును, ఆయన తత్వముయొక్క మూర్తిమంతమునైయుండి, తన మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించుచున్నాడు"* అని ఉంది. యేసు తన శక్తితో సమస్త విశ్వాన్ని స్థిరంగా ఉంచుతున్నారు. సువార్తలలో ప్రకృతిపై యేసుకున్న అధికారాన్ని మనం చూస్తాము. ఇప్పుడు కూడా భూమిని కప్పివేయకుండా నీటిని దేవుని శక్తి నియంత్రిస్తుంది. ఆయన శక్తి భూకంపాలు వంటి విపత్తులపై కూడా పరిమితులను విధిస్తుంది. మనుషులను ఆదుకునేది కూడా దేవుని శక్తే. ఒక చిన్న శిశువును దాని తల్లి కడుపులో ఉన్నంత కాలం కాపాడేది దేవుని శక్తే. అంతే కాదు పెద్దవారమైన మనల్ని ఆదుకునేది కూడా దేవుని శక్తి మాత్రమే.

***3. చెడును నియంత్రించడంలో:*** దేవుడు తన శక్తితో క్రమంగా విశ్వం నుండి సమస్త చెడును తొలగిస్తారు. ఇప్పటికీ ఆయన శక్తి ఎప్పటికప్పుడు చెడును నియంత్రిస్తూ ఉంటుంది. దుర్మార్గుల చేసే భయంకరమైన పనులు మనకు ఆశ్చర్యం కలిగిస్తాయి. కాని అటువంటి పనులు నిత్యం *జరుగుతూ ఉండవనే* వాస్తవం దేవుడు చెడును నియంత్రిస్తున్నారని రుజువు చేస్తుంది. సాతాను శక్తి సహాయంతో మనుషుల దుష్టత్వం ఇంకా ఎక్కువ చెడును చేస్తుంది (ఆది 6:5; రోమా 3:14-18). అయితే తన శక్తితో పరిమితులను విధించినందుకు దేవునికి కృతజ్ఞతలు. సాతాను యోబుపై దాడి చేసినప్పుడు కూడా, అనుమతించిన దానికంటే ఎక్కువ నష్టం కలిగించకుండా దేవుని శక్తి నియంత్రణలో ఉన్నాడు. (యోబు 1:12, 2:6).

***4. తన ప్రజలను విడిపించటంలో.*** నిర్గమం వంటి సంఘటనలు దేవుని మహాశక్తిని స్పష్టంగా తెలియజేస్తాయి. నిర్గమ 15:6లో *"యెహోవా, నీ దక్షిణహస్తము బలమొంది అతిశయించును యెహోవా, నీ దక్షిణ హస్తము శత్రువుని చితక గొట్టును"* అని ఉంది. నీ దక్షిణహస్తం అంటే కుడిచేయి దేవుని శక్తికి గుర్తు. యెహోషువ నాయకత్వంలో ఆతర్వాత దావీదు నాయకత్వంలో కనానులో సాధించిన విజయాలు, తన ప్రజలను విడిపించడంలో దేవుని శక్తికి స్పష్టమైన ఉదాహరణలు.

***5. వ్యాధిని మరణాన్ని జయించడంలో.*** భూసంబంధమైన పరిచర్య చేస్తున్నప్పుడు అనేక సందర్భాలలో యేసు ప్రభువు ఒక మాటతో లేదా చిన్న స్పర్శతో అనేక వ్యాధులను నయం చేయడానికి ఈ శక్తిని ఉపయోగించారు. ఆయనే మెస్సీయ అని చెప్పడానికే ఇదంతా చేశారు, మెస్సీయగా ఆయన భవిష్యత్తులో దేవుని మహిమ రాజ్యాన్ని స్థాపించినప్పుడు ఎవరూ స్వస్థత పొందాల్సిన అవసరం ఉండదు, ఎందుకంటే అక్కడ ఎలాంటి అనారోగ్యాలూ ఉండవు.

అయితే, దేవుడు యేసును మృతులలోనుండి లేపినప్పుడు అత్యంత అద్భుతమైన శక్తిని చూపించారు. పునరుత్థానం ద్వారా వ్యాధిని మరణాన్ని జయించే శక్తి తనకు ఉందని యేసు చూపించారు. అది ఎలా? పాపం వల్లనే వ్యాధి, మరణం ఈ లోకంలోకి వచ్చాయి (రోమా 5:12, 6:23). పాపానికి పరిహారం పూర్తిగా చెల్లించారు కాబట్టి, పునరుత్థానం దానికి రుజువు కాబట్టి (రోమా 4:24-25) ఒక రోజు వ్యాధిని మరణాన్ని పూర్తిగా తొలగిస్తారు (ప్రకటన 21:1-4).

***6. జీవితాలను మార్చడంలో.*** దేవుని శక్తి మానవ జీవితాలను మారుస్తుంది, ఇది మన రక్షణలోని 3 దశలలో రుజువు అవుతుంది: విడుదల (గతం నుండి), పరిశుద్ధపరచడం (ప్రస్తుతం) చివరిగా, మహిమపరచడం (భవిష్యత్తులో).

***విడుదల:*** మనం దేవుని బిడ్డలమైతే, మనం దేవుణ్ణి ద్వేషించే వారి నుండి దేవుని ప్రేమించేవారిగా ఎలా మారాం? సువార్త ద్వారానే కదా! సువార్తను పౌలు ఈ విధంగా వర్ణించాడు: *"సువార్తనుగూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి, గ్రీసుదేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది" (రోమా 1:16).* సువార్త అంటే దేవుని శక్తి. ఈ శక్తివంతమైన సువార్త ద్వారా, దేవుడు ప్రజలను తనతో సమాధాన పరుస్తారు. దీనిని విడుదల అంటారు. ఈ సువార్త ద్వారా మనం కొత్త జీవితాన్ని పొందుతాము.

***పరిశుద్ధపరచడం:*** ఒకరు దేవుని బిడ్డగా మారినప్పుడు, వారు తమలో నివసించే శక్తివంతమైన పరిశుద్ధాత్మ ద్వారా ఆ పునరుత్థాన శక్తిని కూడా పొందుతారు. *"మీ విశ్వాసము సర్వలోకమున ప్రచురము చేయబడుచుండుటనుబట్టి, మొదట మీ యందరి నిమిత్తము యేసు క్రీస్తుద్వారా నా దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను"* (అపొ. కా 1:8) దీని ప్రకారం పరిశుద్ధాత్మ ద్వారా మనం పొందిన ఆ శక్తి మనల్ని సాక్షులుగా చేయడమే కాకుండా పరిశుద్ధ జీవితం గడిపేలా చేస్తుంది, ఎందుకంటే *"తన మహిమనుబట్టియు, గుణాతిశయమునుబట్టియు, మనలను పిలిచినవాని గూర్చిన అనుభవజ్ఞానమూలముగా ఆయన దైవశక్తి జీవమునకును భక్తికిని కావలసిన వాటినన్నిటిని మనకు దయచేయుచున్నది"* (2 పేతురు 1:3).

ఒకసారి ఒక క్రైస్తవుడు బౌద్ధమతస్థునితో మతపరమైన విషయాలను చర్చిస్తూ క్రైస్తవ మతం గురించి అతడు ఏమి అనుకుంటున్నాడో చెప్పమని అడిగాడు. అందుకు ఆ బౌద్ధమతస్థుడు ఇలా సమాధానమిచ్చాడు, "మన బోధనలలో చాలా పోలికలు ఉన్నాయి. కానీ మా విశ్వాసంలో లేనిది మీ విశ్వాసంలో ఉన్న ఒక విషయం ఏమిటంటే, నేను ఏమి చేయాలో నా విశ్వాసం నాకు చెబుతుంది కానీ అది చేయగల శక్తిని నాకు ఇవ్వదు. కాని మీ విశ్వాసం ఆ *శక్తిని ఇస్తుంది."*

***మహిమపరచడం:*** యేసు శరీరాన్ని పోలిన కొత్త శరీరాలను మనం ధరించే భవిష్యత్తును ఇది సూచిస్తుంది. పాపం, బాధ, మరణం నుండి ఈ కొత్త శరీరం విముక్తి పొందుతుంది. యేసు తిరిగి వచ్చినప్పుడు ఇదంతా జరుగుతుంది. ఫిలిప్పీ 3:20-21లో *"మన పౌరస్థితి పరలోకమునందున్నది; అక్కడనుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కని పెట్టుకొనియున్నాము. సమస్తమును తనకు లోపరచుకొనజాలిన శక్తినిబట్టి ఆయన మన దీనశరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపము గలదానిగా మార్చును"* అని ఉంది.

మహిమపరచబడే వరకు మనం రక్షణను కొనసాగించగలమా అనే అనుమానం ఉంటే, మనకు ఆదరణ ఉంది. *నిజమైన* విశ్వాసులను మహిమపరచబడే వరకు దేవుని శక్తి వారిని కాపాడుతుందని పేతురు మనకు గుర్తు చేస్తున్నాడు. 1 పేతురు 1:5లో *"కడవరి కాలమందు బయలుపరచబడుటకు సిద్ధముగానున్న రక్షణ మీకు*

*కలుగునట్లు, విశ్వాసము ద్వారా దేవుని శక్తిచేత కాపాడబడు మీకొరకు, ఆ స్వాస్థ్యము పరలోకమందు భద్రపరచబడియున్నది"* అని ఉంది.

***7. దుర్మార్గులకు తీర్పు తీర్చడంలో.*** గతంలో లోకమంతా వచ్చిన జలప్రళయం ద్వారా నోవహు కాలంలోని దుష్ట ప్రపంచానికి తీర్పు ఇవ్వడంలో ఉన్న దేవుని శక్తి గురించి ఆది 6–8 తెలియజేస్తున్నాయి. దేవుడు తన శక్తితో ఒకరోజు సాతానుకు, అతని దయ్యాలకు, ఆయనపై తిరుగుబాటు చేసిన అవిశ్వాసులందరినీ ఒకేసారి ఎలా తీర్పు తీరుస్తారో ప్రకటన 19-20 వివరిస్తుంది. ఆ తీర్పు ఫలితంగా వారిని నరకమనే అగ్నిగుండంలో పడవేస్తారు; అది నిత్య హింస, నాశనం ఉండే చోటు. గతంలో జలప్రళయం సమయంలో ఆయన శక్తిని ఎవరూ ఆపలేకపోయినట్లు అప్పుడు కూడా ఎవరూ ఆయన శక్తిని ఎదిరించలేరు.

ఇక్కడ కూడా దేవుని శక్తి కనిపిస్తుంది వారు అగ్నిగుండంలో శాశ్వతమైన హింసను అనుభవిస్తున్నప్పటికీ వారి శరీరాలు కాలి నశించిపోవు. ఎందుకు? ఎందుకంటే దేవుడు విశ్వాసులకు పరలోకానికి అనువైన శరీరాలను ఇచ్చినట్లే వారికి నరకానికి తగిన శరీరాలను ఇస్తారు. (తీర్పుదినాన గొప్ప తెల్లని సింహాసనం ముందు *నిలబడే* చనిపోయిన అవిశ్వాసులందరి గురించి ప్రకటన 20:12లో ఉంది. యోహాను 5:29లో, చెడు చేసేవారిని తీర్పు పొందడానికి లేస్తారని యేసు స్వయంగా *చెప్పారు. కాబట్టి, అవిశ్వాసులు కూడా* నరకానికి తగిన *కొత్త శరీరాలను పొందుతారు.*)

***8. కొత్త ప్రపంచాన్ని సృష్టించడంలో.*** ఇప్పుడున్న విశ్వాన్ని అగ్నితో నాశనం చేయడంలోను, కొత్త ఆకాశాన్ని కొత్త భూమిని సృష్టించడంలోను ఉన్న దేవుని శక్తిని ప్రకటన 21, 22 వివరిస్తాయి. అక్కడే మనం (అంటే, విశ్వాసులందరూ) గొప్ప దేవుని సన్నిధిలో శాశ్వతంగా నివసిస్తాము.

కనీసం ఈ ఎనిమిది విధాలుగా దేవుడు తన శక్తిని మనకు చూపించారు. దేవుని శక్తి గురించిన జ్ఞానం మన రోజువారీ జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుందో వివరించే ముందు నేను ఒక విషయం చెప్తాను: దేవుని శక్తి గురించి మన అవగాహన ఇప్పటికీ చాలా పరిమితమైనది. దేవుని గొప్ప భక్తుడైన యోబు ఈ పరిమితిని అర్థం చేసుకున్నాడు. అందుకే, 6-13 వచనాలలో దేవుని మహాశక్తి గురించి వివరించిన తర్వాత అతడు యోబు 26:14లో, *"ఇవి ఆయన కార్యములలో స్వల్పములు. ఆయనను గూర్చి మనకు వినబడుచున్నది మిక్కిలి మెల్లనైన గుసగుస శబ్దముపాటిదే గదా. గర్జనలుచేయు ఆయన మహాబలము ఎంతైనది గ్రహింపగలవాడెవడు?"* అని ఒప్పుకున్నాడు. ఇవి ఆయన శక్తి గురించి గుసగుసలు మాత్రమే అని యోబు చెప్పాడు. దేవుని శక్తికి సంబంధించి మన జ్ఞానం ఎంతో పరిమితమైనది!

అయితే, దేవుని శక్తి (ఆయన ఇతర లక్షణాల) గురించి పూర్తి జ్ఞానం లేకపోవడం మనల్ని నిరుత్సాహపరచకూడదు. దేవుడు మనకు సహాయం చేసినంత వరకు మనం ఈ జ్ఞానంలో ఎదగాలని కోరుకుంటూ ఉండాలి. దేవుని శక్తి గురించి ఈ జ్ఞానం కనీసం మూడు నిర్దిష్ట అంశాలలో ఆచరణాత్మకంగా అనుసరించేలా చేస్తుంది.

## మనం ఆయనకు భయపడాలి

కీర్తనలు 33:6-7లో *"యెహోవా వాక్కు చేత ఆకాశములు కలిగెను ఆయన నోటి ఊపిరిచేత వాటి సర్వసమూహము కలిగెను. సముద్రజలములను రాశిగా కూర్చువాడు ఆయనే. అగాధ జలములను కొట్లలో కూర్చువాడు ఆయనే"* అని చదువుతాము. సర్వశక్తిమంతుడు సృష్టికర్తయైన దేవుని పట్ల మన ప్రవర్తన ఎలా ఉండాలో తర్వాతి వచనాలు వివరిస్తాయి: *"లోకులందరు యెహోవాయందు భయభక్తులు నిలుపవలెను. భూలోక నివాసులందరు ఆయనకు వెరవవలెను. ఆయన మాట సెలవియ్యగా దాని ప్రకారమాయెను ఆయన ఆజ్ఞాపింపగానే కార్యము స్థిరపరచబడెను"* (కీర్తన 33:8-9). భయభక్తులు కలిగి ఉండడం సరైనది. కొంచెం కాదు దేవునికి పూర్తిగా భయపడాలి ఆరాధించాలి! సణుగుడు లేకుండా ప్రశ్నించకుండా ఆయన *ఆజ్ఞలలో ప్రతిదానిని పాటించాలి.*

చాలామంది అవిశ్వాసులు దేవుని ఉనికిని తిరస్కరించడానికి కారణం ఏమిటంటే, దేవుని ఉనికిని తిరస్కరించడం వల్ల వారు ఎవరికీ ముఖ్యంగా వారి సృష్టికర్తకు జవాబు చెప్పవలసిన అవసరం ఉండదు. జవాబు చెప్పవలసిన అవసరం లేకపోతే తీర్పు భయం ఉండదు. దాని ఫలితంగా వారు తమకు నచ్చినట్లు జీవించవచ్చని వారు అనుకుంటారు! దేవుణ్ణి సృష్టికర్తగా తిరస్కరించినప్పుడు, దేవుడు న్యాయమూర్తి విమోచకుడు అనే వాటన్నింటికి అర్థం ఉండదు. అందుకే దేవుడు న్యాయమూర్తి, ప్రేమస్వరూపి, విమోచకుడు అని కాకుండా ఆయనే సృష్టికర్త (ఆది 1:1) అని చెప్తూ మన సువార్త పరిచర్యను ప్రారంభించడం చాలా అవసరం. మన సృష్టికర్తకు జవాబు చెప్పలేకపోతే సువార్తను నిర్మించడానికి బలమైన పునాది కూడా ఉండదు.

## మనం ఆయనను స్తుతించాలి

మన పక్షాన దేవుడు ఉన్నట్లయితే (మనం ఆయన బిడ్డలమైనట్లయితే మన పక్షాన ఉంటారు), ఆయన శక్తిని బట్టి నిత్యం ఆయనను స్తుతించాలి. ఆయన శక్తివంతమైన హస్తం మనల్ని శాశ్వతమైన మరణం నుండి విడిపించి నిత్యజీవాన్ని ఇచ్చింది. రాబోయే తన గొప్ప ఉగ్రత నుండి ఆయన మనల్ని కాపాడారు. ఆయన మనల్ని సురక్షితంగా ఇంటికి తీసుకువెళతారు. అటువంటి సత్యాన్ని బట్టి నిత్యం ఆయనను ఆరాధించి స్తుతించాలి. మోషే ఈ పాటను పాడడంలో ఆశ్చర్యం లేదు, ఇది బైబిల్లో ఉన్న మొదటి పాట:

> ***నిర్గమ 15:11-13*** *– "యెహోవా, వేల్పులలో నీవంటివాడెవడు పరిశుద్ధతనుబట్టి నీవు మహానీయుడవు స్తుతి కీర్తనలనుబట్టి పూజ్యుడవు; అద్భుతములు చేయువాడవు నీవంటివాడెవడు? నీ దక్షిణహస్తమును చాపితివి భూమి వారిని మ్రింగివేసెను. నీవు విమోచించిన యీ ప్రజలను నీ కృపచేత తోడుకొనిపోతివి; నీ బలముచేత వారిని నీ పరిశుద్ధాలయమునకు నడిపించితివి."*

## మనం ఆయనను నమ్మాలి

లూకా 1:37లో, కన్య మరియ మెస్సీయకు జన్మనిస్తుందని గాబ్రియేలు దూత ద్వారా వచ్చిన దర్శనాన్ని మనం చదువుతాము; *"దేవుడు చెప్పిన యేమాటయైనను నిరర్థకము కానేరదని ఆమెతో చెప్పెను."* కొన్ని అనువాదాలలో ఈ వచనం "దేవునికి, ఏదీ అసాధ్యం కాదు" అని ఉంది. దీని భావం ఏమిటంటే, దేవుని నుండి వచ్చిన ఏ మాట ఏ వాగ్దానము నెరవేరకుండా విఫలం కాదు, ఎందుకంటే సర్వశక్తిమంతుడైన దేవుణ్ణి ఆయన ఉద్దేశాలన్నింటినీ నెరవేర్చకుండా ఏదీ ఆపలేదు, ఎవరూ ఆపలేరు. దేవుని గురించిన ఈ సత్యాలను మరియ విశ్వసించింది. అందుకే ఆమె *"ఇదిగో ప్రభువు దాసురాలను; నీ మాటచొప్పున నాకు జరుగును గాక"* (లూకా 1:38) అని చెప్పింది. ఆమె ఈ లోకంలో ఎలాంటి పర్యవసానాలను ఎదుర్కొన్నప్పటికీ, దేవుని వాగ్దానాన్ని నెరవేర్చగల ఆయన శక్తిని ఆమె పూర్తిగా విశ్వసించింది.  మరియ అనేక సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ వాటిలో మొదటిది యోసేపు నిశ్చితార్థాన్ని రద్దు చేసుకోవాలని అనుకోవడం, కాని దేవుడు తన మాటను నెరవేర్చారు.

మరియకున్న విశ్వాసపు వైఖరితో మనం కూడా దేవుని శక్తి జీవితంలో ఎదురయ్యే సవాళ్లలో మనల్ని కాపాడుతుందని నమ్మాలి.  ఆ నమ్మకంతోనే పరిస్థితులతో సంబంధం లేకుండా ఆయన ఆజ్ఞలను పాటించాలి. ఈ సర్వశక్తిమంతుడైన దేవుడు తన పిల్లలను ఎప్పటికీ విడిచిపెట్టని త్రోసివేయని (హెబ్రీ 13:5) ప్రేమాస్వరూపి అని మనం గుర్తుంచుకోవాలి.

మరలా 62వ కీర్తనలోనికి వెళ్లి 11, 12 వచనాలను చూద్దాం*: "బలము తనదని ఒక మారు దేవుడు సెలవిచ్చెను; రెండు మారులు ఆ మాట నాకు వినబడెను. ప్రభువా, మనుష్యులకందరికి వారి వారి క్రియల చొప్పున నీవే ప్రతిఫలమిచ్చుచున్నావు. కాగా కృపచూపుటయు నీదే."* బలంతో పాటు కృప కూడా ఉందని గమనించండి. మనలాంటి పాపుల పట్ల ప్రేమ లేకుండా దేవుని శక్తి మాత్రమే ఉంటే మనం ఎక్కడ ఉంటాము? లేదా ప్రేమ కార్యాలను సాధించే శక్తి లేకుండా దేవుని ప్రేమ మాత్రమే ఉంటే మనం ఎక్కడ ఉంటాము? అయితే ఈ రెండు లక్షణాలు దేవునిలో పరిపూర్ణంగా ఉన్నాయి. అందుకే ఏ సందేహం లేకుండా మనం ఆయనను *విశ్వసించాలి.* మనకు తోడుగా ఉంటానని, క్షేమంగా ఇంటికి చేరుస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఏమి జరిగినా సరే, మనల్ని సృష్టించి, తన చేతులతో కాపాడుతున్న ఆయనకు మనం మన ఆత్మలను అప్పగించాలి.  *"నేను దేవునియందు నమ్మికయుంచియున్నాను నేను భయపడను నరులు నన్నేమి చేయగలరు?"* (కీర్తన 56:11) అని దావీదుతో కలిసి చెబుదాం.

ప్రతి పాపాన్ని, శోధనని, భయాన్ని, వ్యసనాన్ని అధిగమించి దైవభక్తిగల జీవితాన్ని గడపడానికి మనకు అధికారమిచ్చారని ఆయన చెప్పినప్పుడు ఆయనను విశ్వసిద్దాం (రోమా 6:18; 2 పేతురు 1:3). ఈ నమ్మకాన్ని స్తుతిగా ప్రార్థనగా మార్చి, మనం పరిశుద్ధమైన జీవితాన్ని జీవించడానికి పరిశుద్ధాత్మ ద్వారా ఈ శక్తి మన జీవితంలో పని చేసేలా మన గొప్ప దేవుడిని నిరంతరం అడుగుద్దాం.

ఒకవేళ మీరు క్రైస్తవులు కాకపోతే, ఈ దేవుని శక్తి మీకు వ్యతిరేకంగా పనిచేస్తుందని ఊహించుకోండి. మీరు ఈ దేవుడిని ఎదిరించి గెలవగలరని అనుకోవడం ఎంత తెలివితక్కువతనమో కదా! దయచేసి ఈ హెచ్చరికను తీసుకోండి. తీర్పు దినం రాబోతోంది. అప్పుడు ఈ సర్వశక్తిమంతుడైన దేవుని నుండి మీరెలా తప్పించుకోగలరు? నోవహు కాలంలో దేవుణ్ణి ఎగతాళి చేసిన వారెవరూ జలప్రళయం నుండి బయటపడనట్లే, ఇప్పుడు దేవుణ్ణి ఎగతాళి చేసే వారెవరూ ఆయన తీర్పు అగ్ని నుండి తప్పించుకోలేరు.

యేసు లూకా 12:4-5లో  *"నా స్నేహితులైన మీతో నేను చెప్పునదేమనగా దేహమును చంపిన తరువాత మరేమియు చేయనేరని వారికి భయపడకుడి. ఎవనికి మీరు భయపడవలెనో మీకు తెలియజేయుదును; చంపిన*

*తరువాత నరకములో పడద్రోయ శక్తిగలవానికి భయపడుడి, ఆయనకే భయపడుడని మీతో చెప్పుచున్నాను"* అని హెచ్చరించారు. మీరు యేసును విశ్వసించడం ద్వారా మాత్రమే దేవుని తీర్పు నుండి తప్పించుకోగలరు. రాబోవు ఉగ్రత నుండి ఆయన మాత్రమే మిమ్మల్ని విడిపించగలడు (1 థెస్సలో 1:10). కీర్తన 2:12లో *"ఆయన కోపము త్వరగా రగులుకొనును; కుమారుని ముద్దుపెట్టుకొనుడి; లేనియెడల ఆయన కోపించును అప్పుడు మీరు త్రోవ తప్పి నశించెదరు. ఆయనను ఆశ్రయించువారందరు ధన్యులు"* అని ఉన్న తీవ్రమైన హెచ్చరికను హృదయపూర్వకంగా తీసుకోండి.

## చర్చా ప్రశ్నలు

1. ఈ అధ్యాయం దేవుని శక్తిని గురించి మీ దృక్కోణాన్ని ఎలా ప్రభావితం చేసింది?
2. దేవుని ఈ లక్షణాన్ని బట్టి మీరు జీవితంలో ఎలాంటి మార్పులు చేసుకుంటారు?
3. దేవుని ఈ లక్షణం మీ ప్రార్థనలను ఎలా ప్రభావితం చేస్తుంది?
4. దేవుని ఈ లక్షణం మీ సువార్త ప్రచారాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

## ధ్యానించవలసిన /కంఠత చేయవలసిన వాక్యం

> ***1 దిన 29:11 -*** *నా కుమారులారా, తనకు పరిచారకులైయుండి ధూపము వేయుచుండుటకును, తన సన్నిధిని నిలుచుటకును, తనకు పరిచర్య చేయుటకును యెహోవా మిమ్మును ఏర్పరచుకొనెను గనుక మీరు అశ్రద్ధచేయకుడి.*

## ప్రార్థన

తండ్రీ, నీవు సర్వశక్తిమంతుడవు, సమస్త బలాన్ని కలిగిన దేవుడవు. మీరు నాతో సహా సమస్తాన్ని పాలిస్తారు. మార్గం లేనప్పుడు కూడా విడుదల చేయగల నీ శక్తిని విశ్వసించడానికి, నెమ్మదిగా ఉండడానికి నాకు సహాయం చేయండి. ప్రజల భయం నుండి నన్ను రక్షించండి. దయచేసి మీపట్ల మరి ఎక్కువగా భయభక్తులు కలిగి ఉండేలా, నాకు కావాల్సినవన్నీ మీరు అందిస్తారనే సత్యాన్ని బట్టి విశ్రాంతి పొందేలా నాకు సహాయం చేయండి. ఆమెన్!

# లక్షణం 3: దేవుని సన్నిధి

*దేవుడు తన సంపూర్ణ వ్యక్తిత్వంతో ప్రతిచోటా ఎల్లప్పుడూ ఉండగల సామర్ధ్యం దేవుని సన్నిధి సూచిస్తుంది.*

దేవశాస్త్రవేత్తలు దేవుని ఈ లక్షణాన్ని దేవుడు సర్వత్రా ఉంటారని వర్ణిస్తారు. దేవుడు లేని ప్రదేశం ఈ విశ్వంలోనే లేదని మనకు గుర్తు చేసే లక్షణాలలో ఇది ఒకటి. మనం ఎక్కడికి వెళ్లినా ఆయన అక్కడ ఉంటారు. ఆయన నుండి మనం దాగలేము. అలాగే ఆయన నుండి పారిపోలేము.

దేవుని నుండి పారిపోవడం గురించి మాట్లాడడానికి ముందు, యునైటెడ్ స్టేట్స్‌లో ఉష్ణోగ్రతలు పది కంటే తక్కువకు పడిపోయినప్పుడు హైవేపై నిలిచిపోయిన వాహనాన్ని తనిఖీ చేయడానికి ఒక విధానం ఉందని మీకు తెలుసా? ఈ తనిఖీ విధానం గురించి ఒక కథ ఉంది.

> *చాలా సంవత్సరాల క్రితం ఒక చల్లని ఉదయాన సుమారు 3:00 గంటల సమయంలో మోంటానాలోని గ్రేట్ ఫాల్స్ వెలుపల రోడ్డు ప్రక్కన ఉన్న ఒక కారు గురించి మోంటానా స్టేట్ పోలీసు అలన్ నిక్సన్ కు ఫోన్ కాల్ వచ్చింది. లోతైన మంచులో కూరుకుపోయి ఇంజిన్ ఇంకా పనిచేస్తునే ఉన్న కారును అతడు గుర్తించాడు.*
>
> *ఆ పోలీసు డ్రైవర్ తలుపు దగ్గరకు వెళ్ళినప్పుడు  పెద్ద వయస్సున్న ఒక వ్యక్తి స్పృహలేకుండా డ్రైవింగ్ వీల్ పై పడివుండడం, పక్కన సీటులో ఖాళీ వోడ్కా సీసా ఉండడం చూశాడు. పోలీసు కిటికీని తట్టడంతో డ్రైవర్‌కి మెలకువ వచ్చింది. ఆ వ్యక్తి తన రియర్‌వ్యూ మిర్రర్‌లో వెలుగుతున్న లైట్లను తన కారు పక్కన నిలబడి ఉన్న పోలీసుని చూసి కంగారుపడి వెంటనే గేర్ మార్చి కారును పోనిచ్చాడు.*
>
> *ఆ కారు స్పీడోమీటర్ గంటకు 20, 30, 40, ఆపై 50 మైళ్ల వేగాన్ని  చూపిస్తున్నా చక్రాలు తిరుగుతూ కారు అక్కడే మంచులో కూరుకుపోయి ఉంది. తమాషాగా ఉండే ఆ పోలీసు వేగంగా వెళ్తున్న (కదలకుండా అక్కడే ఉన్న) కారు పక్కనే పరుగెత్తడం మొదలుపెట్టాడు. పోలీసు తనతో పాటే వస్తున్నాడని భావించిన డ్రైవర్‌కు మతిపోయింది. అలా 30  సెకన్ల పాటు అలా చేసిన తర్వాత "ఇక ఆపు" అని ఆ పోలీసు అరవడంతో ఆ వ్యక్తి తల వూపి చక్రం తిప్పి కారు ఇంజన్‌ను ఆపాడు.*
>
> *నార్త్ డకోటాకు చెందిన ఆ వ్యక్తి అరెస్టు అయ్యి జైలులో కూర్చుని గంటకు 50 మైళ్ల వేగంతో వెళ్తున్న తనను పోలీసు ఎలా పట్టుకున్నాడని ఆలోచిస్తూ ఉంటాడని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.*

ఈ కథ మనకు కీర్తన 139:7-12లోని దావీదు మాటలను గుర్తుచేస్తుంది *"నీ ఆత్మయొద్దనుండి నేనెక్కడికి పోవుదును? నీ సన్నిధినుండి నేనెక్కడికి పారిపోవుదును? నేను ఆకాశమునకెక్కినను నీవు అక్కడను ఉన్నావు. నేను పాతాళమందు పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు. నేను వేకువ రెక్కలు కట్టుకొని సముద్ర దిగంతములలో నివసించినను అక్కడను నీ చేయి నన్ను నడిపించును నీ కుడిచేయి నన్ను పట్టుకొనును. అంధకారము నన్ను మరుగుచేయును. నాకు కలుగు వెలుగు రాత్రివలె ఉండును అని నేనను కొనినయెడల చీకటియైనను నీకు చీకటి కాకపోవును. రాత్రి పగటివలె నీకు వెలుగుగా ఉండును చీకటియు వెలుగును నీకు ఏకరీతిగా ఉన్నవి."* దేవుని సన్నిధి నుండి తప్పించుకోగలిగే ప్రదేశం విశ్వమంతటిలో ఎక్కడా లేదని దావీదు నొక్కి చెప్పాడు.

కొత్త నిబంధన కూడా అదే సత్యాన్ని తెలియజేస్తుంది. పౌలు ఏథెన్సులో దైవభక్తి లేని తత్వవేత్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, దేవుణ్ణి వెతకమని వారిని ప్రోత్సహిస్తూ ఇలా అన్నాడు, "దేవుడు మనలో ఎవనికిని దూరముగా ఉండువాడు కాడు. మనమాయనయందు బ్రదుకుచున్నాము, చలించుచున్నాము, ఉనికి కలిగివున్నాము (అపో. కా 17: 27-28).

కాబట్టి, దేవుడు ఎల్లప్పుడూ ప్రతిచోటా ఉంటారని బైబిలు నుండి స్పష్టంగా తెలుస్తుంది. సర్వోన్నతమైన దేవుడు (అనగా సృష్టి కంటే ఉన్నతమైనవాడు) అంతర్లీనంగా కూడా ఉంటారు (అంటే తన సృష్టిలో ఉంటారు). యెషయా 57:17లో ఈ రెండు ఆలోచనలు (సర్వోన్నతం మరియు అంతర్లీనత) కలిసి ఉన్నాయి: *"మహా ఘనుడును మహోన్నతుడును పరిశుద్ధుడును నిత్యనివాసియునైనవాడు ఈలాగు సెలవిచ్చుచున్నాడు –నేను మహోన్నతమైన పరిశుద్ధస్థలములో నివసించువాడను అయినను వినయముగలవారి ప్రాణమును ఉజ్జీవింప జేయుటకును నలిగినవారి ప్రాణమును ఉజ్జీవింపజేయుటకును వినయముగలవారియొద్దను దీనమనస్సుగలవారియొద్దను నివసించుచున్నాను".* ఆయన పరలోకంలో నివసించే దేవుడు అయినప్పటికీ తన సృష్టి మధ్యన కూడా ఆయన ఉన్నారు. మరి ముఖ్యంగా ఆయన తన పిల్లలలో పరిశుద్ధాత్మ రూపంలో ఉంటారు. ఇది ఆశ్చర్యకరమైన సత్యం!

దేవుడు సర్వత్రా ఉండడం అనేది మనల్ని ఆచరణాత్మకంగా ఎలా ప్రభావితం చేస్తుందో చూసే ముందు దేవుడు సర్వత్రా ఉండడం గురించిన మూడు తప్పు ఆలోచనలను క్లుప్తంగా ప్రస్తావించడం మంచిది.

***1. సర్వత్రా ఉండడం అంటే దేవుడు ఒకే సమయంలో వివిధ ప్రదేశాలలో పాక్షికంగా మాత్రమే ఉంటారని అర్థం కాదు.*** దేవుడు ఆత్మ మరియు ఆయనను భాగాలుగా విడగొట్టలేము, ఒక భాగం ఒక చోట ఉండగా, ఇతర భాగాలు ఇతర చోట్ల ఉండలేవు. దేవుడు ప్రతిచోటా పూర్తిగా ఉంటారు. ఆయన అవిభాజ్యుడు. విశ్వం ఎంత విశాలంగా ఉన్నా దేవుడు అంతరిక్షంలో ఇమడరు. "ఆకాశ మహాకాశములు సహితము నిన్ను పట్టజాలవు" అని సొలొమోను 1 రాజులు 8:27లో జ్ఞానయుక్తంగా చెప్పాడు.

సిస్టమాటిక్ థియాలజీ అనే పుస్తకంలో వేన్ గ్రుడెమ్ రాసిన అంశాలు:

> *దేవుడు అనంతమైన, అంతులేని విశ్వంలో ఉండేలా అన్ని దిశలలో అనంతంగా విస్తరించి ఉన్నాడని భావించకుండా మనం జాగ్రత్తగా ఉండాలి. దేవుడు అంటే మనకు తెలిసిన విశ్వమంతటిని చుట్టి ఉండే పెద్ద స్థలం అని పెద్ద ప్రాంతం అని మనం అనుకోకూడదు. ఈ ఆలోచనలన్నీ దేవుడు పెద్దగా ఉంటారనే ప్రాదేశిక భావనను కొనసాగిస్తాయి. పరిమాణపరంగా లేదా ప్రాదేశిక పరిమాణాత్మకంగా దేవుని గురించి ఆలోచించకుండా ఉండటానికి మనం ప్రయత్నించాలి. దేవుడు పరిమాణం కొలతలు లేనివాడు. నిజానికి, దేవుడు విశ్వాన్ని సృష్టించడానికి ముందు ఏ పదార్థం ఏ వస్తువు లేదు కాబట్టి స్థలం కూడా లేదు. అయినా దేవుడు ఉన్నారు. దేవుడు ఎక్కడ ఉన్నారు? ఎక్కడ అని అడిగడానికి ఆయన ఒక ప్రదేశంలో లేరు ఎందుకంటే అక్కడ ఏ స్థలం గాని ఖాళీ గాని లేదు. కానీ దేవుడు ఉన్నారు! మనం గాని సృష్టి గాని ఏదైనా కొంత స్థలం ఆక్రమిస్తుందనే వాస్తవానికి దేవునికి చాలా భేదం ఉందనే గ్రహింపును ఈ సత్యం మనకు అందిస్తుంది. మనం ఊహించిన దానికంటే చాలా భిన్నంగా చాలా గొప్పగా ఆయన ఉనికి ఉంటుంది.*

***2. సర్వత్రా ఉండడం అంటే దేవుడే సర్వం సమస్తం అని అర్థం కాదు.*** దేవుడు ప్రతి చోటా ఉన్నప్పటికి, ప్రతి చిన్న వస్తువులో దేవుని ఉనికి ఉందని దీని అర్థం కాదు. పాంథిజం వెనుక ఉన్న ఆలోచన అదే. పాంథీయిస్టులు ప్రతిదీ దేవుడేనని లేదా ఉన్న ప్రతిదానిలో దేవుడు ఉన్నాడని నమ్ముతారు. అయితే దేవుడు తన సృష్టిలో ప్రతిచోటా ఉన్నారు కానీ ఆయన సృష్టికి భిన్నంగా ఉంటారని బైబిలు చెబుతుంది.

***3. సర్వత్రా ఉండడం అంటే దేవుడు అన్ని చోట్లా ఒకే విధంగా ఉంటారని అర్థం కాదు.*** ఉదాహరణకు, సామెతలు 15:29లో *"భక్తిహీనులకు యెహోవా దూరస్థుడు నీతిమంతుల ప్రార్థన ఆయన అంగీకరించును"* అని ఉంటుంది. "భక్తిహీనులకు యెహోవా దూరస్థుడు" అనే మాటకు వారిని ఆశీర్వదించడానికి ఆయన వారి దగ్గర ఉండరని అర్థం. వారి పాపాలు దేవుణ్ణి వారి నుండి వేరు చేశాయి (యెషయా 59:2). "నీతిమంతుల ప్రార్థన ఆయన అంగీకరించును" అనే మాటకు వారిని ఆశీర్వదించడానికి ఆయన వారికీ సమీపంలో ఉన్నారని అర్థం.

మరొక ఉదాహరణ, నరకంలో దేవుని ఉనికి పరలోకంలో దేవుని ఉనికి కన్నా భిన్నంగా ఉంటుంది. నరకంలో అవిశ్వాసిని శిక్షించడానికి దేవుడు ఉంటారు (2 థెస్సలొ 1:9). అలాగే పరలోకంలో విశ్వాసులను ఆశీర్వదించడానికి ఆయన ఉంటారు (ప్రకటన 21:1-3). కాబట్టి, దేవుడు ఒక చోట కంటే మరొక చోట ఎక్కువగా ఉంటారని చెప్పడం తప్పే కానీ ఆయన నరకంలో ఉన్నట్లు కాకుండా పరలోకంలో ఒక ప్రత్యేకమైన రీతిలో అనగా ఆశీర్వదించడానికి, తన మహిమను చూపించడానికి ఉంటారని చెప్పడం తప్పు కాదు. మరోమాటలో చెప్పాలంటే, దేవుని ఉనికి ఇతర చోట్ల కంటే పరలోకంలో పూర్తిగా వ్యక్తమవుతుంది.

దేవుడు సర్వత్రా ఉండడం గురించిన మూడు సాధారణ తప్పు ఆలోచనల గురించి స్పష్టం అయింది కాబట్టి ఇప్పుడు దేవుని ఈ లక్షణం ఆచరణాత్మకంగా ఉపయోగపడే నాలుగు విధాలను చూద్దాం.

## 1. గొప్ప ఆనందాన్ని తెస్తుంది

దేవుని సన్నిధి తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని దావీదు కీర్తన 16:11లో చెప్తాడు: *"జీవమార్గమును నీవు నాకు తెలియజేసెదవు. నీ సన్నిధిని సంపూర్ణసంతోషము కలదు నీ కుడిచేతిలో నిత్యము సుఖములుకలవు."* రాబోయే సంపూర్ణ ఆనందం కోసం మనం నిరీక్షణ కలిగి జీవించేటప్పుడు మన ప్రస్తుత జీవితంలో కూడా ఆనందాన్ని అనుభవించగలము కానీ భవిష్యత్తులో మనం పరలోకంలో ఉన్నప్పుడు మాత్రమే సంపూర్ణ ఆనందాన్ని అనుభవిస్తాము. మనం ఎప్పుడూ ఒంటరివారం కాము విశ్వానికి రాజైన మన దేవుడు ఇప్పుడు ఎప్పుడు నిరంతరం మనతోనే ఉంటారనే సత్యంతో మన మనస్సులు నిండి ఉన్నప్పుడు కఠినమైన శ్రమల మధ్యలో కూడా మనం గొప్ప ఆనందాన్ని *అనుభవిస్తాము. ఈ* ప్రాథమిక సత్యాన్ని మరచిపోవడం వల్ల జీవితంలో సంతోషం ఉండదు, నిరుత్సాహానికి మరియు ఆందోళనకు గురవుతాము. కాబట్టి మన పరలోకపు తండ్రి తన పిల్లలైన మనతో ఎప్పటికీ ఉంటారని మనం గుర్తుచేసుకోవడాన్ని అలవాటు చేసుకుందాం.

## 2. గొప్ప ఆదరణ కలిగిస్తుంది

బాధలలో ఉన్న మనస్సుకు దేవుడు ఎప్పుడూ మనతోనే ఉంటారనే మాట కన్నా మరి ఏది ఆదరణ కలిగించదు. గతంలోని విశ్వాసులకు సహాయం చేసినట్లే కఠినమైన సమయాలలో ఉన్నప్పుడు కూడా దేవునికి లోబడడానికి మనకు కూడా ఆ సత్యం సహాయం చేస్తుంది. ఈ సత్యాన్ని తెలియజేసే కొన్ని లేఖనభాగాలు:

***కీర్తన 23:4*** *- గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను. నీవు నాకు తోడై యుందువు నీ దుడ్డుకఱ్ఱయు నీ దండమును నన్ను ఆదరించును.*

***మత్తయి 28:20*** *- ఇదిగో నేను యుగసమాప్తివరకు సదాకాలము మీతోకూడ ఉన్నానని వారితో చెప్పెను.*

***అపో.కా 18:9-10*** *- రాత్రివేళ దర్శనమందు ప్రభువు–నీవు భయపడక మాటలాడుము, మౌనముగా ఉండకుము. నేను నీకు తోడైయున్నాను, నీకు హాని చేయుటకు నీమీదికి ఎవడును రాడు; ఈ పట్టణములో నాకు బహుజనమున్నది.*

***హెబ్రీ 13:5*** *- నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను.*

"నీవు గాఢాంధకారపు లోయలో నడిచినప్పుడు కూడా నేను నీ తోడు ఉంటాను కాబట్టి భయపడవద్దు" అని ఆదికాండము నుండి ప్రకటన గ్రంథం వరకు దేవుడు తన పిల్లలకు నిత్యం జ్ఞాపకం చేస్తున్నారు. తీవ్రమైన పరీక్షలను ఎదుర్కొన్న సందర్భాలలో, అంతా చీకటిమయంగా ఉన్న సమయాలలో కూడా మనం మన హృదయాలలో గొప్ప శాంతిని అనుభవించామని మనం జ్ఞాపకం చేసుకోవచ్చు. దానికి కారణం ఏమిటి? "నేను నీకు తోడైయున్నాను. నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను" అనే దేవుని వాగ్దానాన్ని విశ్వాసం ద్వారా మనం కలిగి ఉంటాము. తీవ్రమైన పరీక్షలను ఎదుర్కొన్నప్పుడు మనం కలవరానికి గురైన సందర్భాలు కూడా మనకు ఉండడం బాధాకరం. నిద్ర ఉండదు, ఎప్పుడూ భయమే ఉంటుంది. దానికి కారణం ఏమిటి? నిన్ను ఎప్పటికీ విడిచిపెట్టను ఎడబాయను అనే దేవుని వాగ్దానాన్ని మనం విశ్వసించలేకపోవడమే. అది దేవుని తప్పు కాదు, మనదే!

*దేవుని చిత్తం మనల్ని ఎక్కడికి నడిపించినా, ఆయన సన్నిధి మనతో పాటు ఉంటుందనే సత్యాన్ని ఎన్నడూ మర్చిపోకూడదు.* ఆయన సన్నిధి లేకుండా రాజభవనంలో ఉండడం కన్నా అడవి మధ్యలో ఆయన ఉనికిని అనుభవించడం ఎంతో మేలు! కాబట్టి కష్టమయంలో మనం ఆదరణ పొందాలనుకుంటే మనం ఎన్నడూ ఒంటరివారం కాదని ఒక్క సెకను కూడా ఆయన మనల్ని విడిచిపెట్టరని మనం ఖచ్చితంగా జ్ఞాపకం ఉంచుకోవాలి.

## 3. నమ్మకంగా ప్రార్థించడానికి ఇది మనకు సహాయం చేస్తుంది

దేవుని సన్నిధి ఎల్లప్పుడూ మనతో ఉంటుందని తెలుసుకోవడం అనేది ప్రార్థనలో ఆయనను సమీపించడానికి మనకు బలమైన కారణాన్ని ఇస్తుంది. ఆయన ఎల్లప్పుడూ మన దగ్గర ఉంటారు కాబట్టి ఆయన మన ప్రార్థన వింటారు. కీర్తనలు 145:18లో, "తనకు మొరపెట్టువారికందరికి తనకు నిజముగా మొరపెట్టువారికందరికి యెహోవా సమీపముగా ఉన్నాడు" అని ఉంది. ఈ సత్యాన్ని బట్టి మనం "నేను ఆయనను చూడలేకపోయిన ఆయన నాకు సమీపంగా ఉన్నారని నా మొర వింటున్నారని నాకు తెలుసు కాబట్టి నేను ప్రార్థిస్తూనే ఉంటాను" అని చెప్పగలుగుతాము.

## 4. ఇది పాపం చేయాలనే శోధనను ఎదుర్కోవడంలో మనకు సహాయపడుతుంది

దేవుడు ఎల్లప్పుడూ మనతో ఉన్నారని తెలుసుకోవడం అనేది శోధనను ఎదుర్కోవడంలో శక్తివంతమైన ప్రేరణ ఇస్తుంది. మనం చేసే ప్రతి పని, ప్రతి ఆలోచన, మనకు కలిగే ప్రతి ప్రేరణ దేవుని సన్నిధిలో జరుగుతుందనే గ్రహింపు మనకు కలుగుతుంది. సామెతలు 15:3లో, "యెహోవా కన్నులు ప్రతి స్థలముమీదనుండును చెడ్డవారిని మంచివారిని అవి చూచుచుండును" అని ఉంది. సామెతలు 16:2లో "ఒకని నడతలన్నియు వాని దృష్టికి నిర్దోషములుగా కనబడును యెహోవా ఆత్మలను పరిశోధించును" అని ఉంది.

సాధారణంగా మనల్ని ఎవరూ చూడడం లేదని భావించినప్పుడు మనం పాపం చేస్తాము. ఉదా. తల్లిదండ్రులు చూడడం లేదు, టీచరు చూడటం లేదు, జీవిత భాగస్వామి చూడటం లేదు, స్నేహితులు చూడటం లేదు, బాసు చూడటం లేదు మొదలైనవి. మనం తప్పు చేస్తున్నామని ఎవరికైనా తెలిస్తే మనం కంగారు పడతాము. ఏది ఏమైనప్పటికీ, మనం చేసే ప్రతి పాపం, మనకు వచ్చే ప్రతి ఆలోచన పరిశుద్ధ దేవుని సన్నిధిలోనే చేస్తామని మీరు నేను అర్థం చేసుకుని నిరంతరం గుర్తుంచుకుంటే, పాపానికి విరోధంగా నిలబడటానికి మరి ఎక్కువగా ప్రయాసపడతాము. యోబు పరిశుద్ధ జీవిత రహస్యాలలో ఒకటి యోబు 31:4లో ఉంది, "ఆయన నా ప్రవర్తన నెరుగును గదా నా అడుగుజాడలన్నిటిని లెక్కించును గదా." దేవుని సన్నిధి గురించి అతనికి ఎప్పుడూ తెలుసు. అదే అతని చిత్తశుద్ధికి కారణం. మన ప్రతి పనిలో ఆలోచనలో దేవుడు ఎల్లప్పుడూ ఉంటారని గ్రహించినప్పుడు యోబులాగే మనం కూడా పాపాన్ని ఎదిరించడానికి మెరుగ్గా సన్నద్ధమవుతాము.

కాబట్టి, దేవుడు ఎల్లప్పుడూ మనతో ఉంటారని తెలుసుకోవడం వల్ల నాలుగు ప్రయోజనాలు ఉన్నాయి: ఇది ఆనందాన్ని ఇస్తుంది, ఆదరణ కలిగిస్తుంది, నమ్మకంగా ప్రార్థించడానికి సహాయపడుతుంది, పాపం చేయాలనే శోధనను ఎదుర్కోవడంలో సహాయపడుతుంది. ఎల్లప్పుడూ మనతో ఉండి, మనకు సహాయం చేస్తానని వాగ్దానం చేసిన దేవునిపై నమ్మకం ఉంచడం ద్వారా మనం నెమ్మది పొందుదాం. యెషయా 41:10 వంటి వచనాలను నిరంతరం ధ్యానిద్దాం, "నేను నీతో చెప్పియున్నాను నీకు తోడైయున్నాను. భయపడకుము నేను నీ దేవుడనై యున్నాను దిగులుపడకుము. నేను నిన్ను బలపరతును నీకు సహాయము చేయువాడను నేనే నీతియను నా దక్షిణహస్తముతో నిన్ను ఆదుకొందును."

మీరు క్రైస్తవులు కాకపోతే, ఈ జ్ఞానం మీకు ఎలా ఉపయోగపడుతుందని మీరు ఆశ్చర్యపోవచ్చు. ఇది ఒక హెచ్చరిక. మీ పాపపు మార్గాలను విడిచిపెట్టి ఆయనకు లోబడమని దేవుడు దయతో మిమ్మల్ని హెచ్చరిస్తున్నారు. న్యాయాధిపతిగా రానున్న ఈ దేవుని నుండి మీరు తప్పించుకోలేరు. మీ స్వార్థపూరిత మార్గాలను విడిచిపెట్టకపోతే శాశ్వతమైన బాధను మీరు అనుభవించవలసి ఉంటుంది. కాబట్టి, దయచేసి మీ పాపాలను విడిచిపెట్టి క్రీస్తు వైపు తిరగండి. ఆయన ఒక్కడే పాపాలకు వెల చెల్లించి సజీవంగా లేచారు. మిమ్మల్ని రక్షించమని ఆయనకు మొరపెట్టండి. విశ్వాసం కలిగి మీ ప్రభువుగా రక్షకునిగా ఆయనను అంగీకరించి లోబడండి. ఇంతకు ముందు ప్రస్తావించిన విశ్వాసికి కలిగే అన్ని ప్రయోజనాలను అప్పుడే మాత్రమే మీరు పొందగలరు.

## చర్చా ప్రశ్నలు

1. ఈ అధ్యాయం దేవుని సన్నిధి గురించి మీ దృక్కోణాన్ని ఎలా ప్రభావితం చేసింది?
2. దేవుని ఈ లక్షణాన్ని బట్టి మీరు జీవితంలో ఎలాంటి మార్పులు చేసుకుంటారు?
3. దేవుని ఈ లక్షణం మీ ప్రార్థనలను ఎలా ప్రభావితం చేస్తుంది?
4. దేవుని ఈ లక్షణం మీ సువార్త ప్రచారాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

## ధ్యానించవలసిన /కంఠత చేయవలసిన వాక్యం

***యెషయా 41:10 -*** *నేను నీతో చెప్పియున్నాను నీకు తోడైయున్నాను. భయపడకుము నేను నీ దేవుడనై యున్నాను దిగులుపడకుము. నేను నిన్ను బలపరతును నీకు సహాయము చేయువాడను నేనే నీతియను నా దక్షిణహస్తముతో నిన్ను ఆదుకొందును.*

## ప్రార్థన

*యెహోవా దేవా, నీవు సృష్టికర్తవు, ఆదరణ కర్తవు, సమస్తం నీవే, నీ సన్నిధి నుండి అధికారం నుండి నేను తప్పించుకోలేను, అలా తప్పించుకోవాలని నేను కోరుకోను...*

*అది నన్ను లోక వ్యామోహానికి గురిచేయకుండా కాపాడుతుంది, కష్టాలలో హృదయాన్ని మనస్సును బలపరుస్తుంది, మృత్యువు లోయలో నాకు జీవాన్ని ఇస్తుంది, నాలో పరలోకపు ప్రతిరూపం కలిగేలా చేసి ఆత్మీయ మొదటి ఫలాలను ఆస్వాదించడానికి నాకు ప్రసాదించును.*

*దేవదూతలకు వెళ్లిన పరిశుద్ధులకు ఇది తెలుసు.*

*ఆమెన్!*

# లక్షణం 4: దేవుని జ్ఞానం

*ఒక శాశ్వతమైన చర్యలో వాస్తవమైన, సాధ్యమైన భూత వర్తమాన భవిష్యత్తులోని సమస్తాన్ని తెలుసుకునే ఆయన సామర్థ్యాన్ని దేవుని జ్ఞానం సూచిస్తుంది.*

దేవుని సమస్తజ్ఞానం అని కూడా పిలిచే దేవుని జ్ఞానం, సమస్తాన్ని యెరిగిన దేవుని లక్షణాన్ని తెలియజేస్తుంది. లాటిన్‌లో, “ఓమ్ని” అంటే “సమస్త,” అని, “సైన్స్” అంటే “జ్ఞానం” లేదా “తెలుసుకోవడం” అని అర్థం. ఆర్థర్ పింక్ ఇలా రాసాడు:

> *దేవునికి అన్నీ తెలుసు: సాధ్యమయ్యే ప్రతిదీ, వాస్తవమైన ప్రతిదీ; అన్ని సంఘటనలు, సమస్త జీవులు, గతం, వర్తమానం, భవిష్యత్తు ఆయనకు తెలుసు.*

మరో మాటలో చెప్పాలంటే, దేవుడు ఏమీ నేర్చుకోవలసిన అవసరం లేదు, ఆయన క్రమంగా సర్వజ్ఞుడిగా మారలేదు. ప్రతిదానిని గురించి ఆయనకు జ్ఞానం ఉంది, ఉంటుంది, ఆయన ఎప్పుడూ పరిపూర్ణజ్ఞానం కలిగి ఉంటారు (యోబు 37:16). ఏదీ ఆయనను ఆశ్చర్యానికి గురిచేయదు, అవి అత్యంత చెడ్డ పనులైనా సరే; ఏ ఒక్కటీ ఆయన దృష్టి నుండి తప్పిపోదు.

## వాస్తవమైన సాధ్యమయ్యే సంఘటనల వరకు విస్తరించి ఉన్న దేవుని జ్ఞానము

ఏమి జరిగిందో, ఏమి జరుగుతుందో, ఏమి జరిగి ఉండవచ్చో, ఏమి జరుగబోతుందో అన్నీ దేవునికి తెలుసు. మత్తయి 11:21లో, *“అయ్యో కొరాజీనా, అయ్యో బేత్సయిదా, మీమధ్యను చేయబడిన అద్భుతములు తూరు సీదోను పట్టణములలో చేయబడినయెడల ఆ పట్టణములవారు పూర్వమే గోనెపట్ట కట్టుకొని బూడిదె వేసికొని మారుమనస్సు పొంది యుందురు”* అని యేసు అన్నారు. కొరాజీను మరియు బేత్సయిదాలోని ప్రజలు చూసిన యేసు చేసిన అద్భుతాలను తూరు, సీదోనులోని వారు చూసి ఉంటే పశ్చాత్తాపపడేవారని యేసు నొక్కి చెప్పారు. ఏమి జరిగి ఉండేదో తెలుసుకోవడం ఏమి *జరిగిందో* తెలుసుకోవడం వంటిది *కాదు*. అది దేవుని సమస్తజ్ఞాన పరిధి.

బహుశా దేవుని సర్వజ్ఞానాన్ని వివరించే లేఖనాలలో అత్యంత సుపరిచితమైన భాగం కీర్తన 139:1-6, 15-16. అక్కడ ఇలా ఉంది, *“యెహోవా, నీవు నన్ను పరిశోధించి తెలిసికొని యున్నావు; నేను కూర్చుండుట నేను లేచుట నీకు తెలియును; నాకు తలంపు పుట్టకమునుపే నీవు నా మనస్సు గ్రహించుచున్నావు. నా నడకను నా పడకను నీవు పరిశీలన చేసియున్నావు, నా చర్యలన్నిటిని నీవు బాగుగా తెలిసికొనియున్నావు. యెహోవా, మాట నా నాలుకకు రాకమునుపే అది నీకు పూర్తిగా తెలిసియున్నది. వెనుకను ముందును నీవు నన్ను ఆవరించియున్నావు; నీ చేయి నామీద ఉంచియున్నావు. ఇట్టి తెలివి నాకు మించినది అది అగోచరము అది నాకందదు. ... నేను రహస్యమందు పుట్టిననాడు భూమియొక్క అగాధస్థలములలో విచిత్రముగా నిర్మింపబడిననాడు నాకు కలిగిన యెముకలును నీకు మరుగై యుండలేదు. నేను పిండమునై యుండగా నీ కన్నులు నన్ను చూచెను. నియమింపబడిన దినములలో ఒకటైన రాకమునుపే నా దినములన్నియు నీ గ్రంథములో లిఖితము లాయెను.”* మన గురించి క్షుణ్ణంగా తెలిసిన దేవుణ్ణి అర్థం చేసుకోవడం నిజంగా మన పరిమిత అవగాహనకు మించిన పని!

అంతే కాదు, దేవునికి తాను సృష్టించి వాటన్నింటి గురించి అనగా పక్షులు నక్షత్రాల గురించి కూడా తెలుసు. కీర్తన 147:4-5లో ఇలా ఉంది, *“నక్షత్రముల సంఖ్యను ఆయన నియమించియున్నాడు, వాటికన్నిటికి పేరులు*

*పెట్టుచున్నాడు. మన ప్రభువు గొప్పవాడు ఆయన అధిక శక్తిగలవాడు ఆయన జ్ఞానమునకు మితిలేదు.”* కీర్తన 50:11లో దేవుడు *“కొండలలోని పక్షులన్నిటిని నేనెరుగుదును”* అని ఉంది.

భవిష్యత్తులో జరగబోయే సంఘటనలు కూడా దేవునికి తెలుసు. ప్రవక్తలు చెప్పిన ప్రకారం చాలా ప్రవచనాలు నెరవేరాయనే వాస్తవం మనకు ఈ సత్యాన్ని బోధిస్తుంది (ఉదా, కన్యక బిడ్డకు జన్మనిస్తుందని యెషయా 7:14లో ముందే చెప్పినట్లుగా మత్తయి 1:18-25లో అది నెరవేరింది, యేసు బెత్లెహేములో పుడతారని ముందే చెప్పినట్లుగా లూకా 2:4-7లో అది నెరవేరింది). *“త్వరలో సంభవిస్తాయి”* (ప్రకటన 1:1) అని భవిష్యత్తు సంఘటనల గురించి చెప్పిన ప్రకటన గ్రంథంతో సహా బైబిలులో అనేక భాగాలలో దేవుడు వెల్లడించిన వాటిని ఆయన నెరవేరుస్తారనే విశ్వాసాన్ని ఇవి మనకు ఇస్తాయి.

## యేసుని సర్వజ్ఞానము

యేసు కూడా తన భూసంబంధమైన పరిచర్యలో ఈ లక్షణాన్ని కలిగి, తన దైవిక స్వభావాన్ని ప్రదర్శించారు. పక్షవాతం ఉన్న ఒకని పాపాలను క్షమించినందుకు దేవదూషణ చేస్తున్నాడని తనను దూషించిన పరిసయ్యులను ఆయన మందలిస్తున్నప్పుడు అక్కడ మనం ఈ మాటలను చదువుతాము, *“యేసు వారి తలంపులు గ్రహించి–మీరెందుకు మీ హృదయములలో దురాలోచనలు చేయుచున్నారు?”* (మత్తయి 9:4). సర్వజ్ఞానం దేవునికి మాత్రమే ఉంది; యేసు వారి ఆలోచనలను తెలుసుకున్నారు కాబట్టి ఆయన కూడా దేవుడే!

అయితే *“యేసు జ్ఞానమందును, వయస్సునందును, దేవుని దయయందును, మనుష్యుల దయయందును వర్ధిల్లుచుండెను”* అని లూకా 2:52లో ఉన్న దాని అర్థం ఏమిటి? యేసు సర్వజ్ఞాని అయితే ఆయన జ్ఞానంలో ఎందుకు వృద్ధి చెందాలి? ఇక్కడ జ్ఞానంలో వృద్ధి చెందడం అనేది యేసు మానవరూపాన్ని సూచిస్తుంది; ఆయన చిన్నవానిగా ఉన్నప్పుడు ఇంకా పరిపూర్ణ జ్ఞానం రాలేదు.

యేసు పూర్తిగా దేవుడు అయినప్పటికీ (యోహాను 1:1, 14), ఆయన మానవ రూపాన్ని ధరించినప్పుడు (ఫిలిప్పీ 2:6-8), ఆయన అన్ని విషయాలలో సాధారణ మానవ పెరుగుదలకు తనను తాను మానవునిగా అప్పగించుకున్నారు. తరువాత, తాను ప్రజల మధ్యలో చేసిన పరిచర్యలో కూడా, మానవరూపంలో ఉన్న దేవునిగా, యేసు ఎల్లప్పుడూ తండ్రి చిత్తానికి అనుగుణంగా తన దైవిక లక్షణాలను ఉపయోగించారు (యోహాను 6:38). ఉదాహరణకు, కొన్ని సందర్భాలలో ఆయన సర్వజ్ఞానాన్ని చూపించారు (మత్తయి 9:4; యోహాను 2:23-25), మరికొన్ని సందర్భాల్లో, దానిని ఉపయోగించలేదు (మార్కు 13:32) ఎందుకంటే అది తండ్రి చిత్తం.

## పరిశుద్ధాత్ముని సర్వజ్ఞానము

పరిశుద్ధాత్ముడు కూడా సర్వజ్ఞాని. పౌలు 1 కొరింథీ 2:11లో ఇలా రాసాడు, *“ఒక మనుష్యుని సంగతులు అతనిలోనున్న మనుష్యాత్మకే గాని మనుష్యులలో మరి ఎవనికి తెలియును? ఆలాగే దేవుని సంగతులు దేవుని ఆత్మకే గాని మరి ఎవనికిని తెలియవు.”* దేవుని ఆలోచనలన్నీ తెలిసిన పరిశుద్ధాత్మ కూడా దైవమేనని ఈ వచనం స్పష్టం చేస్తుంది!

కాబట్టి, త్రిత్వంలోని **ముగ్గురూ సర్వజ్ఞానులే.** వారికి సమస్తం తెలుసు, వారి నుండి ఏది దాగి ఉండలేదు. అయితే, ఈ సత్యాల వల్ల విశ్వాసులకు కలిగే ప్రయోజనం ఏమిటి? నాలుగు ప్రయోజనాలను చూద్దాం.

## 1. ఇది దేవుణ్ణి మరి ఎక్కువగా స్తుతించేలా చేస్తుంది

దేవుడు సర్వజ్ఞాని అనే విషయం అవిశ్వాసులకు నచ్చనప్పటికీ, ఈ లక్షణాన్ని బట్టి విశ్వాసులు భయభక్తులు కలిగి దేవుణ్ణి స్తుతించాలి. దేవునికి గర్భంలో ఉన్నప్పటి నుండే మన గురించి తెలుసు, మన తల వెంట్రుకలు ఎన్నో తెలుసు, మనం ఏమి ఆలోచిస్తున్నామో తెలుసు, మన నోటి నుండి మాటలు బయటకు రాకముందే మనం ఏమి మాట్లాడతామో తెలుసు, నక్షత్రాల సంఖ్య తెలుసు, జంతువుల సంఖ్య, ఇలాంటివి ఇంకెన్నో తెలుసు అనే సత్యాలు మనం దావీదులా, *“ఇట్టి తెలివి నాకు మించినది అది అగోచరము అది నాకందదు”* (కీర్తన 139:6) అని స్తుతించేలా చేస్తాయి. ఈ అద్భుతమైన దేవుణ్ణి తెలుసుకునేలా మన కళ్ళు తెరచుకున్నందుకు ఆయనకున్న సమస్త జ్ఞానాన్ని బట్టి మనం నిరంతరం ఆయనను స్తుతించాలి.

## 2. ఇది బాధలో ఉన్న ఆత్మకు గొప్ప ఆదరణ అందిస్తుంది

***పరీక్షలలో:*** లూకా 12:7లో *“మీ తలవెంట్రుకలన్నియు లెక్కింపబడియున్నవి. భయపడకుడి; మీరు అనేకమైన పిచ్చుకలకంటె శ్రేష్ఠులు కారా?”* అని యేసు అన్నారు. ఎంతో ఓదార్పునిచ్చే ఆలోచన! దేవుడు మన కన్నీళ్లను

కూడా లెక్కిస్తారని కీర్తన 56:8 మనకు గుర్తుచేస్తుంది. కాబట్టి, గొప్ప పరీక్షలు ఎదురైన సమయంలో కూడా, మనం చింతించకూడదు, ఎందుకంటే మనం దేని గుండా వెళ్తున్నామో ఆయనకు తెలుసు.

***వైఫల్యాలలో:*** దేవుని సర్వజ్ఞానం గూర్చిన జ్ఞానం కేవలం మనకు పరీక్షలలో ఓదార్పును ఇవ్వడమమే కాకుండా పాపం చేసి గందరగోళంలో ఉన్నప్పుడు కూడా మనల్ని ఓదార్పునిస్తుంది. అది ఎలా? మనల్ని సృష్టించక ముందే దేవునికి మొదటి నుండి అంతం వరకు ప్రతిదీ తెలుసునని, మనం చేసిన ఏ పాపమైనా మనకి ఆశ్చర్యం కలిగించవచ్చు కాని దేవుకిని ఆశ్చర్యం కలిగించదని గుర్తుంచుకోండి.

*"మనము మంటివారమని"* దేవునికి తెలుసు అని కీర్తన 103:14 చెబుతోంది. కొన్ని సమయాల్లో మనం ఆయనను విఫలమం చేస్తామని *ఆయనకు* తెలుసు. మనం పదే పదే విఫలమవుతామని తెలిసినప్పటికీ, మనలను రక్షించి సంరక్షించడానికి దేవుడు అంతం వరకు మనపై తన కృపను ఉంచారు. అది చాలా ఓదార్పునిస్తుంది! అందుకే మనం చేసిన పాపాలను, మన వైఫల్యాలను అన్నింటినీ దేవుని ముందు నిరభ్యంతరంగా సిగ్గుపడకుండా ఒప్పుకోవచ్చు. ఆయనకు మన వైఫల్యాలు తెలుసు. మన ఒప్పుకోలులో మనం స్వచ్ఛంగా ఉండాలని ఆయన కోరుకుంటారు, అప్పుడే మనం ఆయన ఓదార్పును సంపూర్ణంగా అనుభవించగలం (1 యోహాను 1:9). అంతే కాకుండా, దేవుడు మన పాపాలన్నిటిని కనిపెట్టి చూడడు. *"యెహోవా, నీవు దోషములను కని పెట్టి చూచినయెడల ప్రభువా, ఎవడు నిలువగలడు? అయినను జనులు నీయందు భయభక్తులు నిలుపునట్లు నీయొద్ద క్షమాపణ దొరుకును"* అని కీర్తన 130: 3-4లో ఉంది. దేవుడు మన పాపాలను కనిపెట్టి చూడకపోవడమే కాకుండా, మనం ఆయన పిల్లలుగా మారినప్పుడు "ఇకపై (మన) పాపాలను జ్ఞాపకం చేసుకోను" (హెబ్రీ 8:12; యెషయా 43:25) అని కూడా వాగ్దానం *చేశారు.* మతిమరుపు వల్ల దేవుడు మన పాపాలను మరచిపోతాని అపార్థం చేసుకోకండి. తీర్పు రోజున దేవుడు వాటిని తిరిగి మన మీద వేయరని దీని అర్థం.

పేతురు మూడుసార్లు యేసు ఎవరో తెలియదని చెప్పి పాపం చేశాడు, అయితే పునరుత్థానుడైన ప్రభువు మూడవసారి "నీవు నన్ను ప్రేమిస్తున్నావా?" అని అతనిని అడిగినప్పుడు పేతురు ప్రతిస్పందన ఏమిటి? *"ప్రభువా, నీవు సమస్తము ఎరిగినవాడవు, నిన్ను ప్రేమించుచున్నానని నీవే యెరుగుదువని ఆయనతో చెప్పెను"* (యోహాను 21:17, నాది నొక్కి చెప్పారు). పేతురు విన్నపానికి ఆధారం ఏమిటి? యేసుకున్న సర్వజ్ఞానమే! మరో మాటలో చెప్పాలంటే, పేతురు, "ప్రభువా, నీకు నా మనస్సు తెలుసు. నేను నిన్ను తిరస్కరించినప్పటికీ, నేను భయపడి అలా చేశానని మీకు తెలుసు. నా అంతరంగంలో నేను నిన్ను ప్రేమిస్తున్నానని మీకు తెలుసు. అదే అతడు చెప్తున్నాడు. ప్రేమగల యేసు అతన్ని క్షమించి పరిచర్య చేయడానికి నియమించారు. ఇప్పుడు, *అది* ఓదార్పునిస్తుంది!

కొన్నిసార్లు, మన పాపాలకు క్షమాపణ కోరిన తర్వాత కూడా మన హృదయం మనల్ని గద్దిస్తుంది. మనలో మనమే కొట్టుమిట్టాడుతాం. మనం అలా చేయడం మానుకోవాలి! *"దేవుడు మన హృదయముకంటె అధికుడై, సమస్తమును ఎరిగి యున్నాడు గనుక మన హృదయము ఏ యే విషయములలో మనయందు దోషారోపణ చేయునో ఆయా విషయములలో ఆయన యెదుట మన హృదయములను సమ్మతి పరచుకొందము"* అని యోహాను ఇచ్చిన హామీని గుర్తుంచుకోండి (1 యోహాను 3:20). అన్ని విషయాల గురించి దేవుని జ్ఞానంతో ఓదార్పు పొందండి.

## 3. విశ్వాసంతో ప్రార్థించేలా ఇది మనల్ని ప్రోత్సహిస్తుంది

మత్తయి 6:8లో, *మీరు మీ తండ్రిని అడుగకమునుపే మీకు అక్కరగా నున్న వేవో ఆయనకు తెలియును* అని ఉన్నట్లు దేవుని సర్వజ్ఞానాన్ని మనకు గుర్తు చేస్తూ మన ప్రభువు తానే స్వయంగా మనల్ని ప్రార్థించమని ప్రోత్సహిస్తున్నారు. అయితే ఈ మాటలను బట్టి, మనకు ఇప్పటికే ఏమి అవసరమో దేవునికి తెలిస్తే, మనం ఎందుకు ప్రార్థించాలి? అని కొందరు ప్రార్థన విషయంలో సందేహపడుతున్నారు అన్నీ తెలిసిన దేవుడు అన్ని విషయాలకు ముగింపుని నియమించినప్పుడు, ఆయన వాటికి సాధనాలను కూడా నియమిస్తారు. మరో మాటలో చెప్పాలంటే, దేవుడు తాను ఇప్పటికే నిర్ణయించిన దానిని నెరవేర్చే మార్గాలలో ప్రార్థన ఒకటి. అలాగే, ప్రార్థన అనేది మనం ఆయనపై ఆధారపడ్డామని తెలిపే మార్గం. అందుకే, మన అవసరాలన్నీ ఆయనకు పూర్తిగా తెలుసునని దేవుని కృపా సింహాసనాన్ని సమీపించినప్పుడు మనం గొప్ప విశ్వాసాన్ని కలిగి ఉంటాము!

## 4. ఇది గొప్ప జవాబుదారీతనాన్ని కలిగిస్తుంది

*"నరుని మార్గములను యెహోవా యెరుగును; వాని నడతలన్నిటిని ఆయన గుర్తించును"* అని సామెతలు 5:21లో ఉంది. "యెహోవా కన్నులు ప్రతి స్థలము మీదనుండును; చెడ్డవారిని మంచివారిని అవి

చూచుచుండును" అని సామెతలు 15:3లో ఉంది. ఈ వచనాలు గొప్ప జవాబుదారీతనాన్ని తెస్తాయి. మన *ఆలోచనలు మన పనులు వేటిని దేవుని నుండి దాచలేము.*

బైబిలు మరిన్ని విషయాలు చెప్తుంది. దేవునికి మన మార్గాలు మాత్రమే కాదు, మన *ఉద్దేశాలన్నీ కూడా తెలుసు.* కాబట్టి, మనం ఏమి చేస్తున్నామనేది మాత్రమే కాదు, మనం *ఎందుకు* చేస్తున్నామనే ఉద్దేశ్యాలు కూడా ముఖ్యమైనవే! *"కాబట్టి సమయము రాకమునుపు, అనగా ప్రభువు వచ్చు వరకు, దేనిని గూర్చియు తీర్పు తీర్చకుడి. ఆయన అంధకారమందలి రహస్యములను వెలుగులోనికి తెచ్చి హృదయములలోని ఆలోచనలను బయలుపరచునప్పుడు, ప్రతి వానికిని తగిన మెప్పు దేవునివలన కలుగును"* అని 1 కొరింథీ 4:5లో పౌలు ఈ విషయాన్ని స్పష్టం చేశాడు. ఈ వచనం అన్ని రకాల తీర్పులను నిషేధించలేదు కానీ ఇతరుల హృదయ ఉద్ధేశాలను తీర్పు తీర్చడాన్ని నిషేధిస్తుంది. ప్రతివాని హృదయ ఉద్దేశ్యాలు మనకు తెలియవు. అవి దేవునికి మాత్రమే తెలుస్తాయి, భవిష్యత్తులో వారి ఉద్దేశాలను ఆయనే తీర్పు తీరుస్తారు.

ఉదాహరణకు, మనం ఇలా ఉండవచ్చు:

- బయటకు వినయంగా ఉన్నా అంతరంగంలో గర్వం ఉంటుంది.
- బయటకు ఉదారంగా ఉన్నా అంతరంగంలో అత్యాశ ఉంటుంది.
- బయటకు నిస్వార్థంగా సేవ చేసినా, అంతర్గతంగా మన స్వార్థాన్ని నెరవేర్చుకోడానికి ప్రయత్నిస్తాము.
- బయటకు ప్రేమ చూపించినా లోలోపల అసూయ, ద్వేషం ఉంటాయి.

ఈ జాబితా అలా కొనసాగుతూనే ఉంటుంది. చివరికి తేలేదేమిటంటే: కేవలం బయటకు కనిపించాలని చేసేవి *దేవుని మోసం చేయలేవు. ఆయన హృదయాన్ని చూస్తారు, ఉద్దేశ్యాలను పరిశీలిస్తారు.* మనం బాహ్యంగా క్రైస్తవ్యాన్ని పాటించవచ్చు. అది చూసి ఇతరులు కూడా మనల్ని మెచ్చుకోవచ్చు. అయితే మన అసలైన ఉద్దేశాలు దేవునికి తెలుసు! అందుకే ముసుగు వేసుకోవడం వ్యర్థం- ఉద్దేశపూర్వకంగా కపటంగా నడుచుకోవడం వ్యర్థం. మీ నా నిజస్వరూపాలు దేవునికి తెలుసు! ఏదైనా ఒక దాని గురించి ఇతరులు మనల్ని విమర్శించినప్పటికీ, మన ఉద్దేశాలు నిజంగా దైవికమైనవైతే, ప్రజలకు వాటి గురించి తెలియకపోయినా మన అసలైన ఉద్దేశ్యాలు దేవునికి తెలుసుననే ఓదార్పు మనకు కలుగుతుంది. దేవుని పరిపూర్ణ జ్ఞానం వల్ల గొప్ప జవాబుదారీతనం వస్తుంది.

కాబట్టి, దేవుని సర్వజ్ఞానాన్ని తెలుసుకోవడం వల్ల విశ్వాసికి కలిగే నాలుగు ప్రయోజనాలు:

1. అది దేవుణ్ణి మరి ఎక్కువగా స్తుతించేలా చేస్తుంది.
2. ఇది బాధలో ఉన్న ఆత్మలకు గొప్ప ఆదరణ ఇస్తుంది.
3. విశ్వాసంతో ప్రార్థించేలా ఇది మనల్ని ప్రోత్సహిస్తుంది.
4. ఇది గొప్ప జవాబుదారీతనాన్ని కలిగిస్తుంది.

అయితే, క్రైస్తవేతరులకు, దేవుని సార్వభౌమాధికారంతో పాటు (అంటే, దేవుడు తాను చేయాలనుకున్నది చేస్తారు) వారిని ఎక్కువగా ఇబ్బంది పెట్టే లక్షణాలలో ఇది ఒకటి. ఎందుకంటే, స్వతహాగా మనం మన గురించి మనకన్నా ఎవ్వరూ ఎక్కువగా తెలుసుకోవాలని కోరుకోము, పాపరహితమైన విషయాల గురించి కూడా. ఘోరమైన చెడు పనుల విషయానికి వస్తే, ఈ వ్యతిరేకత మరింత ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు, నేడు వ్యభిచారాన్ని ఆ పేరుతో పిలవకుండా వ్యక్తిగతమైన విషయమని అంటున్నారు, అంటే ఇది మీకు సంబంధించిన విషయం కాదని అర్థం. ఇలాంటి ఆలోచనలో దేవుడిని కూడా చేర్చుతున్నారు: దేవా, నా జీవితంలోకి చొరబడకు. నేను చేసేది నా వ్యక్తిగతం అంటున్నారు.

యోహాను 3:19లో, *"ఆ తీర్పు ఇదే: వెలుగు లోకములోనికి వచ్చెను గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి"* అని యేసు ఈ వైఖరి గురించి స్పష్టంగా చెప్పారు. పాపులైన మనుషులకు తమ పనులు బయటపడడం ఇష్టం లేదు: ఇది నా వ్యక్తిగత జీవితం. నన్ను ఇబ్బంది పెట్టవద్దు లేదా నా పనుల గురించి నాకు బాధ కలిగించవద్దు. నన్ను ఒంటరిగా వదిలేయండి. సమస్తాన్ని ఎరిగిన దేవుని జ్ఞానం గురించి ఒక రోజు ఆయనకు ఇవ్వవలసిన సమాధానం గురించి ఎవరైనా చెప్పినప్పుడు విపరీతమైన వ్యతిరేకత ఎదురవుతుంది.

ఈ తరహా వైఖరి కొత్తదేమీ కాదు. పాపాల గురించి దుర్మార్గులను ఎదుర్కొన్న నీతిమంతులు యెషయా కాలంలో కూడా ఉన్నారు: *"వారు తిరుగబడు జనులు; అబద్ధమాడు పిల్లలు యెహోవా ధర్మశాస్త్రము విననొల్లని పిల్లలు.*

*దర్శనము చూడవద్దని దర్శనము చూచువారితో చెప్పువారును, యుక్త వాక్యములను మాతో ప్రవచింపకుడి మృదువైన మాటలనే మాతో పలుకుడి. మాయాదర్శనములను కనుడి అడ్డము రాకుండుడి, త్రోవనుండి తొలగుడి. ఇశ్రాయేలు పరిశుద్ధదేవుని సంగతి మా యెదుట ఎత్తకుడి అని భవిష్యద్ జ్ఞానులతో పలుకువారునై యున్నారు"* (యెషయా 30:9-11). మాకు దేవుణ్ణి గుర్తు చేయకండి. మమ్మల్ని ఒంటరిగా వదిలేయండి. మనం చేసేది మా వ్యక్తిగతం. అదే వారి వైఖరి.

పోలీస్ బ్యాండ్ యొక్క పాత ప్రసిద్ధ పాటను చాలా మంది ఇష్టపడతారు, దాని లిరిక్స్ ఇలా ఉంటాయి: "నువ్వు తీసుకునే ప్రతి ఊపిరి, నీ ప్రతి కదలిక, తప్పిన ప్రతి నియమం, వేసే ప్రతి అడుగు, నేను చూస్తూనే ఉంటాను". కాని, దేవుడు మన ప్రతి ఆలోచనను, ప్రతి కదలికను గమనిస్తున్నారనే విషయానికి వస్తే మాత్రం ఒప్పుకోరు! ఇది తిరుగుబాటు ఆలోచన. పాపులు దేవుణ్ణి ఆయన దేవుడిగా ఉన్నందుకు ద్వేషిస్తారు! అయితే ఇది సర్వజ్ఞానియైన దేవుణ్ణి ఆయనలా ఉండకుండా ఆపలేదు. ఆయన మన ఇష్టానికి తలవంచరు, మనకు అనుకూలంగా ఉండాలని తన మార్గాలను మార్చుకోరు. ఆయనకు మన గురించి ప్రతిదీ తెలుసు, ప్రతిదానికి మనల్ని సమాధానం అడుగుతారు. మనం ఆయనను తప్పించుకోలేము. హెబ్రీ 4:13లో *"మరియు ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియు లేదు. మనమెవనికి లెక్క యొప్పచెప్పవలసియున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తమును మరుగులేక తేటగా ఉన్నది"* అని ఉంది. సమస్తాన్ని ఎరిగిన సమస్తాన్ని చూడగల దేవుని *"కన్నులకు సమస్తమును మరుగులేక తేటగా ఉన్నది"* అనే మాటను గమనించండి.

చీకటిలో మనం ఏమి చేస్తామో ఆయనకు తెలుసు. కీర్తన 139:11-12లో *"అంధకారము నన్ను మరుగుచేయును; నాకు కలుగు వెలుగు రాత్రివలె ఉండును అని నేనను కొనినయెడల, చీకటియైనను నీకు చీకటి కాకపోవును రాత్రి పగటివలె నీకు వెలుగుగా ఉండును చీకటియు వెలుగును నీకు ఏకరీతిగా ఉన్నవి"* అని ఉంది. దానియేలు 2:22లో *"ఆయన మరుగుమాటలను మర్మములను బయలుపరచును, అంధకారములోని సంగతులు ఆయనకు తెలియును; వెలుగుయొక్క నివాసస్థలము ఆయనయొద్దనున్నది"* అని ఉంది. దుష్ట నాయకులను వారి దురాలోచనల (యెహెజ్కేలు 11:2) గురించి మందలించినప్పుడు, *"మీ మనస్సున పుట్టిన అభిప్రాయములు నాకు తెలిసేయున్నవి"* (11:5) అని చెప్పిన దేవుడు ఆయనకున్న సర్వజ్ఞానాన్ని వారికి జ్ఞాపకం చేస్తున్నారు.

దానికి విరుద్ధంగా, కీర్తన 10:11,13 ప్రకారం, *"దేవుడు మరచిపోయెను ఆయన విముఖుడై యెప్పుడును చూడకుండును ... విచారణ చేయరని"* దుష్టులు ఆలోచిస్తారు. కానీ దేవుడు చూస్తున్నారని వారు మర్చిపోతారు. యోబు 34:21 *"ఆయన దృష్టి నరుల మార్గములమీద నుంచబడియున్నది; ఆయన వారి నడకలన్నియు కనిపెట్టి చూచుచున్నాడు"* అని ఉంది. దేవుడు తమ పాపాలను చూడడని భావిస్తూ జీవించే వారి గురించి దేవుడు ఏమి చెప్తున్నారో గమనించండి:

> ***సంఖ్యా 32:23 -*** *మీ పాపము మిమ్మును పట్టుకొనును.*
>
> ***యిర్మీయా 16:17 –*** *వారు పోయిన త్రోవలన్నిటి మీద దృష్టి యుంచితిని, ఏదియు నా కన్నులకు మరుగు కాలేదు, వారి దోషమును నాకు మరుగైయుండదు."*
>
> ***హోషేయ 7:2 –*** *తమ క్రియల చేత వారు చిక్కుపడి యున్నను అవి నా సముఖముననే జరిగినను–మన చెడుతనము ఆయన జ్ఞాపకము చేసికొనడని తమలో తాము అనుకొందురు.*

తమ పాపాలను విడిచిపెట్టి ఆయన వైపుకు తిరగని వారందరికి సమస్తాన్ని చూసే దేవుడు ఒక రోజు తీర్పు తీరుస్తారు. "ఒకని ప్రవర్తనను బట్టి వాని క్రియల ఫలముచొప్పున ప్రతి కారము చేయుటకు యెహోవా అను నేను హృదయమును పరిశోధించువాడను, అంతరింద్రియములను పరీక్షించువాడను" అని ఆయన తీవ్రంగా హెచ్చరించారు (యిర్మీయా 17:10; ప్రకటన 2:23).

పాపాలకు శిక్ష అనుభవించిన తన కుమారుడైన యేసుపై విశ్వాసం ఉంచిన వారి పాపాలను మరచిపోతానని వాగ్దానం చేసిన అదే దేవుడు మరొక విషయం కూడా వాగ్దానం చేస్తున్నారు: తన కుమారుడైన యేసు రక్తంతో తమ పాపాలు కడగబడకుండానే చనిపోయిన వారి పాపాలను ఆయన గుర్తుంచుకుంటారు. అంతిమ తీర్పును ఇచ్చేటప్పుడు ఆయన వాటిని జ్ఞాపకం చేసుకొని వారిని నిత్య నరకాగ్నిలోనికి పడవేస్తారు.

యేసును ఎన్నడూ విశ్వసించని వారికి ఎదురయ్యే వాస్తవ పరిస్థితి అదే. దేవుని సర్వజ్ఞానం మీ పాపాలన్నింటినీ వెలుగులోకి తెస్తుంది. అటువంటి ముగింపు నుండి తప్పించుకోవడానికి ఉన్న ఏకైక మార్గం మీ పాపాలను విడిచిపెట్టి యేసుపై విశ్వసించడమే. ఈరోజు అది చేస్తారా?

## చర్చా ప్రశ్నలు

1. ఈ అధ్యాయం దేవుని జ్ఞానం గురించి మీ దృక్కోణాన్ని ఎలా ప్రభావితం చేసింది?
2. దేవుని ఈ లక్షణాన్ని బట్టి మీరు జీవితంలో ఎలాంటి మార్పులు చేసుకుంటారు?
3. దేవుని ఈ లక్షణం మీ ప్రార్థనలను ఎలా ప్రభావితం చేస్తుంది?
4. దేవుని ఈ లక్షణం మీ సువార్త ప్రచారాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

## ధ్యానించవలసిన /కంఠత చేయవలసిన వాక్యం

***సామెతలు 5:21 –*** *నరుని మార్గములను యెహోవా యెరుగును; వాని నడతలన్నిటిని ఆయన గుర్తించును.*

## ప్రార్థన

ప్రభువా, మీకు అన్నీ తెలుసు. మీ నుండి ఏదీ దాగి ఉండదు. దయచేసి దానిలో ఓదార్పుని పొందడంలో నాకు సహాయం చేయండి, అదే సమయంలో, నాకు పరీక్షలు ఎదురైనప్పుడు ఈ సత్యాన్ని గుర్తుంచుకునేలా చేయండి. నా ఉద్దేశాలు, నేను ఏమి చేస్తున్నానో ఎందుకు చేస్తున్నానో మీకు తెలుసు. ఇలా చేస్తున్నప్పుడు ఇతరులను మోసగించేలా ముసుగు వేసుకోకుండా, నన్ను నేను మోసం చేసుకోకుండా నన్ను రక్షించండి. లోపల, బయట పరిశుద్ధమైన జీవితాన్ని గడపడానికి దయచేసి నాకు సహాయం చెయ్యండి. ఆమెన్!

# లక్షణం 5: దేవుని పితృత్వం

*తన కుమారుడైన యేసుక్రీస్తుపై విశ్వాసం ఉంచి తన దగ్గరకు వచ్చే ప్రతి ఒక్కరికి తండ్రిగా ఉండడమే దేవుని పితృత్వము.*

JI ప్యాకర్ రాసిన నోయింగ్ గాడ్ అనే పుస్తకంలో, దేవుని పితృత్వం గురించి అతడు ఈ క్రింది విధంగా రాసాడు:

> *ఎవరైనా క్రైస్తవ్యాన్ని ఎంత బాగా అర్థం చేసుకున్నారో మీరు అంచనా వేయాలనుకుంటే, దేవుని బిడ్డగా ఉండడం గురించి, దేవుణ్ణి తన తండ్రిగా కలిగి ఉండడం గురించి వారి ఆలోచన ఎలాంటిదో తెలుసుకోండి. ఇది వారి ఆరాధనను, ప్రార్థనలను, జీవితంపై వారి దృక్పథానంతటిని ప్రేరేపించి నియంత్రించే ఆలోచన కాకపోతే, వారు క్రైస్తవ్యాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదని అర్థం. క్రీస్తు బోధించిన ప్రతి విషయం, క్రొత్త నిబంధనను క్రొత్తగా చేసే ప్రతి ఒక్కటి, క్రొత్త నిబంధనను పాత నిబంధన కంటే మెరుగైనదిగా చేసే ప్రతి ఒక్కటి, కేవలం యూదత్వానికి సంబంధించినది కాకుండా క్రైస్తవ్యంలో విలక్షణంగా ఉండే ప్రతిదీ దేవుని పితృత్వజ్ఞానంలో సంపూర్ణంగా ఉంది. దేవుని క్రైస్తవ నామమే తండ్రి.*

దేవుని లక్షణాల గురించి అధ్యయనం చేయడంలో ఉన్న ఉద్దేశ్యం ఆయనను గూర్చిన మన జ్ఞానాన్ని పెంపొందించుకోవడమే - ఎందుకంటే దేవుణ్ణి ఆయన లక్షణాల ద్వారా మాత్రమే తెలుసుకోగలం - దేవుణ్ణి బాగా అర్థం చేసుకోవడానికి దేవుడు విశ్వాసుల తండ్రి అనే ఈ జ్ఞానం చాలా అవసరం. అందుకే ఈ అధ్యాయంలో దేవుణ్ణి మన తండ్రిగా చూస్తాం.

యోహాను యేసు ఎవరో (యోహాను 1:1-5) వివరిస్తూ, బాప్తిస్మమిచ్చు యోహాను ఆయనను పరిచయం చేసినప్పుడు యూదా ప్రజల నుండి ఆయనకు లభించిన ఆదరణతో (యోహాను 1:6-13) తన సువార్తను ప్రారంభించాడు. చాలామంది ఆయనను తిరస్కరించినప్పటికీ, కొందరు మాత్రం ఆయనపై విశ్వాసముంచారు. యేసును అంగీకరించిన ఆ కొద్దిమందితో యోహాను “తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచినవారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను” అని చెప్పాడు (యోహాను 1:12). యేసుపై మనకున్న విశ్వాసం వల్ల మనం దేవుని పిల్లలం అయ్యాము, –అదే వాగ్దానం, అది దేవుణ్ణి తండ్రి అని పిలిచే హక్కును మనకు ఇస్తుంది. ఈ ప్రక్రియలో దేవుడు మనల్ని తన పిల్లలుగా చేసుకుని, ఆయనను “తండ్రి” అని పిలవడానికి వీలు కల్పించారు, దీనినే బైబిలు దత్తత అని పిలుస్తుంది. విమోచన కన్నా అత్యున్నతంగా మనం పొందేదే దత్తత. అది వివరిస్తాను.

మనం పాప క్షమాపణ పొందిన క్షణంలోనే మనకు విమోచన కలుగుతుంది. మరణశిక్ష పొందిన ఒక పాపి పరిశుద్ధ దేవుని ముందు నిలబడి తన పాపాల గురించి పశ్చాత్తాపం చెంది యేసుక్రీస్తుపై విశ్వాసం ఉంచడం వల్ల అతడు ఆ పాపాల నుండి అపరాధం నుండి విముక్తి పొందాడు. *విమోచన ప్రతి ఆశీర్వాదానికి పునాది ఎందుకంటే అది మన ప్రధాన ఆధ్యాత్మిక అవసరాన్ని తీరుస్తుంది.* అయినా సరే, ఇది అత్యున్నత వరం కాదు. ఎందుకంటే, విమోచన అనేది దేవుణ్ణి న్యాయమూర్తిగా చూసే చట్టపరమైన పదం. ఇది దేవుని పరిశుద్ధ ధర్మశాస్త్రం ముందు మనం నిలబడటానికి సంబంధించినది. మరోవైపు దత్తత అనేది కుటుంబానికి సంబంధించిన విషయం. దత్తత తీసుకుని దేవుడు మనల్ని తన కుటుంబంలో సభ్యులుగా చేసుకుంటారు. దత్తత దేవుడిని తండ్రిగా చూస్తుంది, దానిలో సాన్నిహిత్యం, ఆప్యాయత, ఔదార్యం ఉన్నాయి. "న్యాయమూర్తి అయిన దేవునితో సరిచేసుకోవడం గొప్ప విషయమే, కానీ తండ్రియైన దేవుని ప్రేమను, సంరక్షణను పొందడం ఇంకా గొప్ప విషయం”. బహుశా ఈ భావనను బాగా అర్థం చేసుకోడానికి ఈ క్రింది ఉదాహరణ మనకు సహాయపడవచ్చు:

మీ కొడుకుని చంపిన వ్యక్తి మరణశిక్షను పొంది జైలులో ఉన్నాడని అనుకుందాం. మీరు ఆ వ్యక్తిని క్షమించి విడుదల చేశారు. అదే గొప్ప విషయం అవుతుంది. కానీ మీరు అక్కడితో ఆగలేదు. హంతకుడు జైలు నుండి విడుదలైన తర్వాత, మీరు అతన్ని దత్తత తీసుకుని సొంత కొడుకుగా చేసుకుని మీ కొడుక్కి ఉండే అన్ని అధికారాలను అతనికి ఇచ్చారని అనుకోండి! అది ఎలా ఉంటుంది? ప్రజలు మిమ్మల్ని పిచ్చివారని కూడా అంటారు! కానీ అది మీ ప్రేమలోని ఔన్నత్యాన్ని, మీ అమూల్యమైన కొడుకును చంపిన వ్యక్తి అనుభవించిన ఆశీర్వాదాన్ని తెలియజేస్తుంది.

విమోచన గురించి, దత్తత గురించి బైబిలు వివరణ ఇదే కదా? దేవుడు విమోచన ఇవ్వడంతో ఆగిపోవచ్చు. కానీ ఆయన అలా చేయలేదు. విమోచనా ఆశీర్వాదమే కాకుండా ఆయన మాకు మరింత మెరుగైన దత్తతావరాన్ని కూడా ఇచ్చారు, తద్వారా ఆయన మనల్ని తన కుమారులుగా కుమార్తెలుగా చేసుకుంటారు! అందుకే విమోచన కంటే దత్తత తీసుకోవడం అపురూపమైన వరం. దత్తత తీసుకోవడం ద్వారానే మనం దేవుని పితృత్వాన్ని స్పష్టంగా చూడగలము.

తండ్రియైన దేవుడు అనే భావన పాత నిబంధనలో కూడా ఉంది (నిర్గమ 4:22; కీర్తన 103:13; యెషయా 64:8). అయినప్పటికీ, క్రొత్త నిబంధనలో దత్తత భావన మనకు మరింత స్పష్టంగా వెల్లడి చేశారని మనం తెలుసుకొని దేవుని పితృత్వాన్ని పరిపూర్ణంగా చూడగలుగుతాము. దత్తత అనే పదం 5 సార్లు పౌలు రాసిన పత్రికలలో కనిపిస్తుంది (రోమ 8:15, 23, 9:4; గలతీ 4:5; ఎఫెసీ 1:5). పౌలు పత్రికలను చదివినవారు ఈ భావనను స్పష్టంగా అర్థం చేసుకున్నారని మనం చెప్పవచ్చు, ఎందుకంటే కొత్త నిబంధన కాలంలో దత్తత పద్ధతి పాత నిబంధన కాలంతో పోలిస్తే ఎక్కువగా ఉండేది (ఫరో కుమార్తె మోషేను దత్తత తీసుకున్నప్పటికీ). రోమన్ల కాలంలో, సంపన్నవర్గాలలో తమ కుటుంబం పేరును కొనసాగించగలరని భావించిన యువకులను దత్తత తీసుకోవడం చాలా సాధారణంగా ఉండేది. చాలామంది కైసరులు కూడా ఈ పద్ధతిని అనుసరించారు.

అయితే, దేవుడు మనల్ని దత్తత తీసుకోవడం మనుషుల దత్తత కంటే భిన్నమైనది, ఉన్నతమైనది. "దేవుడు మనల్ని దత్తత చేసుకున్నది ఆయనకు మనతో ఏ అవసరం ఉన్నందుకు కాదు లేదా ఆయనకు ప్రయోజనం చేకూర్చే విధంగా మనలో ఏదో మంచి చూసినందుకు కాదు". ఆయన మనలో చూసినదంతా ఆయనకు వెన్నుపోటు పొడిచిన తిరుగుబాటుతనమే. అయినా సరే, ఆయన ముందుగానే నిర్ణయించున్న ప్రకారం పరిపూర్ణమైన ప్రేమతో మనలను దత్తత తీసుకున్నారు (ఎఫెసీ 1:4-5). అలాంటి ప్రేమ మనసును కదిలిస్తుంది! యోహాను 17:26లో, తండ్రికి తన కుమారునిపై ఉన్న ప్రేమతోనే యేసును అనుసరించే వారిని కూడా తండ్రి ప్రేమించాలని యేసు కోరిక: *"నీవు నాయందు ఉంచిన ప్రేమ వారియందు ఉండునట్లును, నేను వారియందు ఉండునట్లును, వారికి నీ నామమును తెలియజేసితిని, ఇంకను తెలియజేసెదనని చెప్పెను".* దేవుని కుటుంబంలో భేదాలు ఉండవు. యేసును ప్రేమించినట్లే ఆయన మనల్ని కూడా ప్రేమిస్తారు! *"మనము దేవుని పిల్లలమని పిలువబడునట్లు తండ్రి మనకెట్టి ప్రేమ ననుగ్రహించెనో చూడుడి; మనము దేవుని పిల్లలమే"* అని అపొస్తలుడైన యోహాను ప్రశంసించడంలో ఏ ఆశ్చర్యం లేదు (1 యోహాను 3:1).

మనల్ని దత్తత తీసుకున్న అలాంటి ప్రేమ ఫలితంగా కలిగే ప్రయోజనాలలో నాలుగు ప్రయోజనాలు.

## 1. దత్తత వల్ల దేవుణ్ణి మా తండ్రి అని పిలువగలుగుతాము

దేవుణ్ణి తన తండ్రిగా సంబోధించేటప్పుడు "*అబ్బా, తండ్రి*" అనే పదాన్ని యేసు ఉపయోగించారు (మార్కు 14:36). తమలో ఉన్న పరిశుద్ధాత్మ కారణంగా విశ్వాసులు కూడా ఆయనను "*అబ్బా, తండ్రీ" (గలతీయులు 4:6)* అని పిలవచ్చు. ఎప్పటికీ నిలిచిపోయే అద్భుతమైన కొత్త సంబంధం ఏర్పడింది. మనం ప్రేమించబడ్డాము, బాగా సంరక్షించబడ్డాము మరియు మన అద్భుతమైన పరలోకపు తండ్రి నుండి మనం ఎప్పటికీ విడిపోము!

## 2. దత్తత వల్ల మన ప్రార్థన జీవితం సుసంపన్నం అవుతుంది

మనం ప్రార్థించేటప్పుడు దేవుణ్ణి "పరలోకమందున్న మా తండ్రి" అని సంబోధించమని యేసు మనకు బోధించారు (మత్తయి 6:9). ఈ సాన్నిహిత్యం వల్ల మన తండ్రియైన దేవుని దగ్గరకు మన విన్నపాలతో వెళ్లగలుగుతాము, ఎందుకంటే ఆయన మనపట్ల శ్రద్ధ వహిస్తారు. మనం ఆందోళనల నుండి విముక్తి పొందవచ్చు, అపరాధాల నుండి విముక్తి పొందవచ్చు. మనం మన పాపాలను ఒప్పుకున్నప్పుడు ఆయన వాటన్నింటిని క్షమిస్తారు. ప్రేమగల మన తండ్రి ఎప్పుడూ తన పిల్లల ప్రార్థనలను వింటారు, అలాగే తన దయాసంకల్పాన్ని బట్టి తన చిత్తప్రకారం వాటికి సమాధానమిస్తారు.

## 3. దత్తత వల్ల భవిష్యత్తుకై మన నిరీక్షణ బలపడుతుంది

రోమ 8:23లో *"ఆత్మయొక్క ప్రథమ ఫలముల నొందిన మనము కూడ దత్త పుత్రత్వముకొరకు, అనగా మన దేహముయొక్క విమోచనముకొరకు కనిపెట్టుచు మనలో మనము మూలుగుచున్నాము".* అని పౌలు చెప్పాడు అంతే కాకుండా *"ఏలయనగా మనము నిరీక్షణ కలిగిన వారమై రక్షింపబడితిమి. నిరీక్షింపబడునది కనబడునప్పుడు, నిరీక్షణతో పనియుండదు; తాను చూచుచున్న దానికొరకు ఎవడు నిరీక్షించును? మనము చూడనిదాని కొరకు నిరీక్షించినయెడల ఓపికతో దానికొరకు కనిపెట్టుదుము"* అని కూడా చెప్పాడు (రోమ 8:24-25). ముఖ్యంగా, మనం మహిమాన్వితమైన శరీరాలను ధరించినప్పుడు దత్తతలోని పూర్తి అనుభవాన్ని పొందుతామని పౌలు చెబుతున్నాడు. ఈ ప్రస్తుత జీవితంలోని పరీక్షలను తట్టుకునే స్థిరమైన నిరీక్షణ ఈ సత్యం వల్ల మనకు లభిస్తుంది. 2 కొరింథీ 1:22 ప్రకారం, దేవుడు *"మనకు ముద్రవేసి, మన హృదయములలో మనకు ఆత్మ అను సంచకరువును అనుగ్రహించియున్నాడు." "సంచకరువు"* అనే పదం భవిష్యత్తులో, మనం నిత్యత్వంలో మన మహిమ శరీరాలను ధరించి ప్రభువుతో ఉంటామనే వాస్తవాన్ని సూచిస్తుంది. ఈ సత్యం మన నిరీక్షణను కూడా బలపరుస్తుంది.

## 4. దత్తత వల్ల మనం దేవుడు ఇచ్చే శిక్షణ పొందుతాము

హెబ్రీ 12:5-6లో, *"నా కుమారుడా, ప్రభువుచేయు శిక్షను తృణీకరించకుము; ఆయన నిన్ను గద్దించినప్పుడు విసుకకుము. ప్రభువు తాను ప్రేమించువానిని శిక్షించి తాను స్వీకరించు ప్రతి కుమారుని దండించును అని కుమారులతో సంభాషించినట్లు మీతో సంభాషించు ఆయన హెచ్చరికను మరచితిరి"* అని ఉంది. తర్వాతి వచనంలో రచయిత *"శిక్షాఫలము పొందుటకై మీరు సహించుచున్నారు; దేవుడు కుమారులనుగా మిమ్మును చూచుచున్నాడు. తండ్రి శిక్షింపని కుమారుడెవడు?"* (హెబ్రీ 12:7) అని అన్నాడు. మనం దేవుని పిల్లలు *కాబట్టి, దేవుడు మనల్ని క్రమశిక్షణలో ఉంచుతారని* హెబ్రీ పత్రిక రచయిత ఉద్దేశం. అది చాలా మంచి విషయం! మనం ఆయన బిడ్డలమని అది తెలియజేస్తుంది! ఈ క్రమశిక్షణ ప్రక్రియకు అంతిమ లక్ష్యం *"మనము తన పరిశుద్ధతలో పాలుపొందవలెనని మన మేలుకొరకే ఆయన శిక్షించుచున్నాడు"* అని హెబ్రీ 12:10లో ఉంది.

దత్తత వల్ల కలిగే ఈ నాలుగు ప్రయోజనాలను బట్టి (మరిన్ని జోడించవచ్చు), మన ప్రతిస్పందన ఎలా ఉండాలి? చాలా సులభం. మనం "తండ్రియైన దేవునిని పోలి నడుచుకోవాలి." మనం ఆయన కుమారులం, కుమార్తెలం అయితే మనం కుటుంబాన్ని పోలి ఉండాలి! దేవుడు పరిశుద్ధుడు కాబట్టి మనం పరిశుద్ధతను వెంబడించాలని దీని అర్థం (1 పేతురు 1:15-16). దేవుడు ప్రేమించే విధంగా మనం కూడా ప్రేమించాలి (ఎఫెసీ 5:1-2), మన శత్రువుల పట్ల కూడా అదే ప్రేమతో ఉండాలి (మత్తయి 5:44-45). మనమంతా ఒకే కుటుంబమని దేవుని పిల్లలు ఎన్నటికీ మరచిపోకూడదు. అందుకే అక్కడ ద్వేషం, అసూయ, గొడవలకు తావు లేదు. సుఖదుఃఖాలను ఒకరికొకరు పంచుకుంటాం. ఎంతో ప్రేమగల తండ్రి దేవునిలో మనకు ఉన్నారు. మనకు ఎంతో అద్భుతమైన భవిష్యత్తు ఉంది! మన తండ్రిని అనుకరించాలనే మన పవిత్ర సంకల్పాన్ని ఈ సత్యాలు బలపరుస్తాయని నేను నమ్ముతున్నాను!

ఇప్పటి వరకు మీరు దేవుని బిడ్డ కాకపోతే, ఆయనను మీ తండ్రిగా పిలవలేకపోతే, ఆ సమస్యను పరిష్కరించడానికి ఈ రోజే మంచి రోజు. మీరు మీ పాపాలను విడిచిపెట్టి, క్రీస్తును మీ ప్రభువుగా రక్షకునిగా అంగీకరించడం ద్వారా ఆయన కుటుంబంలోకి మీరు దత్తత రావచ్చు. మరోసారి యోహాను 1:12ని మీకు గుర్తు చేస్తాను, *"తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచినవారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను".* మీరు యేసుపై విశ్వాసం ఉంచినప్పుడు, మీరు దేవుని కుటుంబంలోకి ఆయన కుమారునిగా కుమార్తెగా స్వాగతించబడతారు. ఆపై మీరు కూడా దత్తత వల్ల కలిగే ఈ ప్రయోజనాలన్నింటినీ ఆస్వాదించవచ్చు! సంకోచించకండి. దయచేసి రండి. దేవుని కుటుంబంలో చాలామంది పిల్లల కోసం *ఎల్లప్పుడూ స్థానం ఉంటుంది!* మానవ తండ్రులకు బలహీనతలు ఉంటాయి, కొన్నిసార్లు వారు ఓడిపోతూ ఉంటారు. అయితే, ఒకే ఒక్క పరలోకపు తండ్రి—ప్రభువైన యేసుక్రీస్తు తండ్రికి మాత్రమే ఎలాంటి బలహీనతలూ లేవు. ఆయన మిమ్మల్ని ఎప్పటికీ మరచిపోరు విడిచిపోరు. ఆయన శాశ్వతమైన ప్రేమతో మిమ్మల్ని ప్రేమిస్తారు!

## చర్చా ప్రశ్నలు

1. ఈ అధ్యాయం దేవుని పితృత్వం గురించి మీ దృక్కోణాన్ని ఎలా ప్రభావితం చేసింది?
2. దేవుని ఈ లక్షణాన్ని బట్టి మీరు జీవితంలో ఎలాంటి మార్పులు చేసుకుంటారు?
3. దేవుని ఈ లక్షణం మీ ప్రార్థనలను ఎలా ప్రభావితం చేస్తుంది?

4. దేవుని ఈ లక్షణం మీ సువార్త ప్రచారాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

## ధ్యానించవలసిన /కంఠత చేయవలసిన వాక్యం

***రోమ 8:15 –*** *ఏలయనగా మరల భయపడుటకు మీరు దాస్యపు ఆత్మను పొందలేదుగాని దత్తపుత్రాత్మను పొందితిరి. ఆ ఆత్మ కలిగినవారమై మనము–అబ్బా తండ్రీ అని మొరపెట్టుచున్నాము.*

## ప్రార్థన

తండ్రీ, మిమ్మల్ని పరలోకమందున్న మా తండ్రి అని పిలవడానికి మీరు మాకు ఎంత గొప్ప అధికారాన్ని ఇచ్చారు. ఈ ఆత్మీయతకు కృతజ్ఞతలు. మా ప్రభువూ రక్షకుడైన యేసు జీవించినట్లే నీ పిల్లలుగా మేము జీవించడానికి మాకు సహాయం చేయండి. మీరు మమ్మల్ని క్రమశిక్షణలో పెట్టినప్పుడు దానిని అంగీకరించడానికి వినయమనస్సును మాకు దయచేయండి. మీరు ప్రేమించే వారందరినీ క్రమశిక్షణలో ఉంచుతారని, అది మా మంచి కోసం మీకు కీర్తి కలగడానికే అని గుర్తుంచుకోవడానికి మాకు సహాయం చేయండి. ఆమెన్!

# లక్షణం 6: దేవుని ప్రేమ

*యోగ్యతతో ప్రతిస్పందనతో సంబంధం లేకుండా ఒకరి మంచి కోసం స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా, న్యాయంగా, శాశ్వతంగా తనను తాను, తన ఆశీర్వాదాలను ఇవ్వడమే దేవుని ప్రేమ.*

దేవుని ప్రేమ అనేది దేవుని లక్షణాలలో అత్యంత పరిచయమైన, తరచూ చర్చించే అంశము. 1 యోహాను 4:8లో "దేవుడు ప్రేమాస్వరూపి" అని చదువుతాము. 1 యోహాను 4:16లో కూడా అదే ఉంది. దేవునికి ప్రేమ ఉందని కాదు కానీ దేవుడు ప్రేమాస్వరూపి అని ఉందని జాగ్రత్తగా గమనించండి. ప్రేమ అనేది కేవలం దేవుని లక్షణాలలో ఒకటి కాదు. ప్రేమ దేవుని స్వభావం. దయ, మంచితనం, సహనం, కృప అనే దేవుని ఇతర లక్షణాలు దేవుని ప్రేమ నుండి వచ్చినవే కాబట్టి అవి ప్రేమతో దగ్గరి సంబంధం కలిగి ఉంటాయి. ఆయన ప్రేమను మనం ఎంత ఎక్కువగా అర్థం చేసుకుంటే, కలత చెందిన మన హృదయాలకు అంత నెమ్మది కలుగుతుంది; అలాగే ఆయన పట్ల ఇతరుల పట్ల మన ప్రేమ అంతగా అధికమవుతుంది. ఆ లక్ష్యాన్ని సాధించడానికి మనం ఈ అధ్యాయంలో దేవుని ప్రేమకున్న నాలుగు ముఖ్య లక్షణాలను పరిశీలించి వాటిని మన జీవితాలలో ఆచరిద్దాము.

## లక్షణం #1: దేవుని ప్రేమ స్వచ్ఛంద ప్రేమ

దేవుడు మనల్ని ప్రేమించవలసిన అవసరం లేదు, బలవంతం లేదు. మనం ప్రేమించబడటానికి అర్హులం కాబట్టి ఆయన తన ప్రేమను మనపై చూపించలేదు. వాస్తవం దీనికి వ్యతిరేకంగా ఉంది. ఆయనకు వ్యతిరేకంగా ఘోరపాపం చేసిన మనం దానికి అనర్హులము. అయినా సరే దేవుడు తనంతట తానే ఏ బలవంతం లేకుండా తన ప్రేమను మనపై చూపించారు. మనం 1 యోహాను 4:10లో, *"మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమయున్నది"* అని చదువుతాము. తర్వాత, 1 యోహాను 4:19లో *"ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము"* అని చదువుతాము.

దేవుని స్వచ్ఛంద ప్రేమ కేవలం కొత్త నిబంధనకు సంబంధించింది మాత్రమే కాదు. పాత నిబంధనలో కూడా ఈ సత్యాన్ని చెప్పడం మనం చూస్తాము. ద్వితీయో 7:7-8లో, *"మీరు సర్వజనముల కంటె విస్తారజనమని యెహోవా మిమ్మును ప్రేమించి మిమ్మును ఏర్పరచుకొనలేదు. సమస్త జనములకంటె మీరు లెక్కకు తక్కువేగదా. అయితే యెహోవా మిమ్మును ప్రేమించువాడు గనుకను, తాను మీ తండ్రులకు చేసిన ప్రమాణమును నెరవేర్చువాడు గనుకను, యెహోవా బాహుబలముచేత మిమ్మును రప్పించి దాసుల గృహములోనుండియు ఐగుప్తురాజైన ఫరో చేతిలోనుండియు మిమ్మును విడిపించెను"* అని ఉంది. ఇశ్రాయేలీయులు యోగ్యులని *కాదుగాని, తాను వారిని ప్రేమించిన కారణంగానే* దేవుడు వారితో ప్రేమ నిబంధన చేశారని ఇక్కడ వివరించారు. మరొక మాటలో చెప్పాలంటే, దేవుడు ప్రేమించాలని అనుకున్నారు కాబట్టి ఆయన ఇశ్రాయేలీయులను ప్రేమించారు.

## లక్షణం #2: దేవుని ప్రేమ పరిశుద్ధమైన ప్రేమ

దేవుని ప్రేమ ఆయన పరిశుద్ధతను పోగొట్టదు. దేవుడు ప్రేమాస్వరూపి అనే లక్షణం (1 యోహాను 4:8) దేవుడు వెలుగు (1 యోహాను 1:5) లేదా దేవుడు నీతిమంతుడైన న్యాయాధిపతి (కీర్తన 7:11) వంటి దేవుని ఇతర లక్షణాలను తగ్గించదు లేదా త్రోసివేయదు. యోహాను 3:16లో కూడా, *"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక*

*నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను"* అని ఉన్నట్లుగా పాపానికి ప్రాయశ్చిత్తం చేయడానికి తన కుమారున్నే పంపేంతగా దేవుడు ఈ లోకాన్ని ప్రేమించారు. దేవుని ప్రేమ పవిత్రమైనది, అంటే ఆయన పాపాన్ని తేలికగా తీసుకోలేరు – అది తన పిల్లల జీవితంలో అయినా సరే. అందుకే హెబ్రీ 12:6లో *"ఆయన నిన్ను గద్దించినప్పుడు విసుకకుము; ప్రభువు తాను ప్రేమించువానిని శిక్షించి తాను స్వీకరించు ప్రతి కుమారుని దండించును"* అని ఉంది. ఆ విధమైన క్రమశిక్షణలో కొన్నిసార్లు అనారోగ్యం, మరణం కూడా ఉండవచ్చు (1 కొరింథీ 11:30)! పరిశుద్ధమైన ప్రేమ పాపాన్ని చూసి చూడనట్లుగా ఉండదు.

ఒకసారి వార్తాపత్రికలు ఒక తండ్రి మరియు తల్లి కథను ప్రచురించాయి, వారు తమ చిన్న అమ్మాయి అల్మారా నుండి ఏదో తీసుకుని తినడం చూసి ఆ అమ్మాయిని కుదుపుతూ చెంపదెబ్బలు కొట్టడం ప్రారంభించారు. ఆ పాప మగతలోనికి వెళ్లిపోయినా సరే ఆపకుండా నాలుగు గంటలపాటు ఆమెను కుదుపుతూ చెంపదెబ్బలు కొడుతూనే ఉన్నారు. అంత చిన్న నేరానికి అది క్రూరమైన శిక్షలా అనిపించినప్పటికి వాస్తవానికి అది ప్రేమతో చేశారు. ఆ చిన్నారి పది స్లీపింగ్ ట్యాబ్లెట్లు మింగిందని, నిద్రపోకుండా ఉంచడమే ఆ చిన్నారి ప్రాణాలను కాపాడుతుందని డాక్టర్ చెప్పారు.

అదేవిధంగా, దేవుడు మనలను నడిపించే మార్గాన్ని మనం ఎల్లప్పుడూ అర్థం చేసుకోలేము, కానీ ఆయన శిక్ష ఎల్లప్పుడూ ప్రేమ నుండే పుడుతుందని మనం ఖచ్చితంగా భావించవచ్చు. తీవ్రమైన గాలులను ఆపడానికి బదులుగా దేవుడు వాటి ద్వారా మనల్ని నడిపించి తీసుకువెళ్తారు.

## లక్షణం #3: దేవుని ప్రేమ త్యాగపూరిత ప్రేమ

అధిక వెల చెల్లించవలసినప్పుడు కూడా దేవుని ప్రేమ వెనుకాడదు. మానవ ప్రేమను గంభీరమైన పదాలతో వర్ణిస్తారు కాని అది ఆచరణశూన్యంగా ఉంటుంది, పెళ్లి రోజున చేసిన గొప్ప గొప్ప వాగ్దానాలు కొన్ని నెలలు సంవత్సరాల తర్వాత బాధాకరమైన విడాకులుగా మారిపోవడం విచారకరం. త్యాగం చేయవలసి వచ్చినప్పుడు, మానవ ప్రేమ చాలా వరకు కుప్పకూలిపోతుంది.

అయితే దేవుని ప్రేమ అలా కాదు. ఇది త్యాగపూరితమైనది. దేవుని త్యాగపూరిత ప్రేమకు అత్యున్నత ఉదాహరణ సిలువ మీద ఉన్నంత స్పష్టంగా మరి ఎక్కడా కనిపించదు. దేవుడు తన ఏకైక కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువును మీ వంటి నా వంటి పాపుల కోసం అర్పించారు. రోమ 5:6-8లో *"ఏలయనగా మనమింక బలహీనులమై యుండగా, క్రీస్తు యుక్తకాలమున భక్తిహీనులకొరకు చనిపోయెను. నీతిమంతునికొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు; మంచివానికొరకు ఎవడైన ఒకవేళ చనిపోవ తెగింపవచ్చును. అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను"* అని ఉంది. యోహాను 3:16లోని ఉన్న సుపరిచితమైన మాటలను మనం ఎలా మరచిపోగలము, *"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను".*

ఫ్రాన్స్‌లో ఒక కథ ఉంది, ఒక యువకుడు ఉండేవాడు. అతని తల్లి అతన్ని ఎంతో ప్రేమించేది. అయినా సరే అతని జీవితం చాలా పాపంతో నిండిపోయింది. అతడు ఒక చెడ్డ స్త్రీ పట్ల చాలా ఆకర్షితుడయ్యాడు; ఆమె అతన్ని మరింతగా పాపంలోకి నెట్టివేసింది. ప్రేమించే తల్లి అతనిని పాపం నుండి వెనక్కి తీసుకురావడానికి ప్రయత్నించడంతో ఆ స్త్రీ తల్లిని ఎంతో ద్వేషించింది. ఒక రాత్రి ఆ స్త్రీ ఆయువకుడిని బాగా తాగించి, తనను నిజంగా ప్రేమించడం లేదని వాదించడం మొదలుపెట్టడంతో అతడు నిన్ను ప్రేమిస్తున్నానని వాగ్దానం చేశాడు. తనను నిజంగా ప్రేమిస్తే తమను విడదీయాలని ప్రయత్నిస్తున్న అతని తల్లిని చంపమని ఆమె అడిగింది.

ఆ స్త్రీ ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆ యువకుడు పరుగెత్తుకుంటూ తన తల్లి నిద్రిస్తున్న తన ఇంటికి వెళ్లాడు. చాలా క్రూరంగా అతడు తన తల్లిని కొట్టి చంపి, ఆపై ఆమె గుండెలు చీల్చి హృదయాన్ని తీసి తన ప్రేయసి దగ్గరకు బయలుదేరాడు. అతడు రక్తమోడుతున్న తన తల్లి హృదయంతో తన ప్రేయసి ఇంటికి పరిగెత్తుకుంటూ వెళ్తుండగా అతడు ఒక రాయిని తన్నుకుని జారి పడిపోయాడు. వెంటనే రక్తమోడుతున్న తల్లి హృదయం, "బిడ్డా, నీకు బాధగా ఉందా?" అని ఏడ్చింది.

మీ వంటి నా వంటి భయంకరమైన పాపుల పట్ల దేవుడు చూపించే త్యాగపూరిత ప్రేమ అలాంటిదే. దేవుని ప్రేమను అనుమానించేలా మనకు శోధన ఎదురైనప్పుడు, మనం సిలువను చూడాలి, దేవుడు మనల్ని ఎంతగా ప్రేమిస్తున్నారో పదే పదే గుర్తుచేసుకోవాలి. మన కోసం తన కుమారుని ఇవ్వడానికి వెనుకాడని ఆయన మనల్ని మరచిపోతారా (రోమా 8:32)? ఆయన మనలను విడిచిపెడతారా? అలా ఎప్పుడూ చేయరు!

## లక్షణం #4: దేవుని ప్రేమ నిత్య ప్రేమ

మనుషుల ప్రేమ తరచూ ఊగిసలాడే భావోద్వేగాలపై ఆధారపడి ఉంటుంది. నా భావోద్వేగాలు ఎక్కువగా ఉన్నప్పుడు నేను నిన్ను ప్రేమిస్తాను. నేను బాధపడినప్పుడు నేను నీ నుండి దూరంగా ఉంటాను. నీవు నన్ను ప్రేమిస్తే నన్ను ఎప్పుడూ నిరాశపరచకుండా ఉంటే నేను నిన్ను ప్రేమిస్తాను. లేదంటే, నేను నిన్ను ప్రేమించలేను.

అయితే దేవుని ప్రేమ అలాంటిది కాదు. ఆయన తన మనసు మార్చుకోరు. ఆయన ప్రేమ శాశ్వతంగా ఉంటుంది. ఆకాశాలను సృష్టించక ముందే ఆయన మనల్ని ప్రేమించారు (ఎఫెసీ 1:4-5). కొత్త ఆకాశం, కొత్త భూమి సృష్టించిన తర్వాత కూడా ఆయన ప్రేమ శాశ్వతంగా ఉంటుంది. యిర్మీయా ద్వారా దేవుడే స్వయంగా ప్రకటించిన విధంగా ఇది శాశ్వతమైన ప్రేమ, *"శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను గనుక విడువక నీయెడల కృప చూపుచున్నాను"* (యిర్మీయా 31:3). ఈ వచనం ప్రాథమికంగా ఇశ్రాయేలీయుల పట్ల దేవుని శాశ్వతమైన, నిబంధన ప్రేమను సూచిస్తున్నప్పటికీ, దానిని అన్ని కాలాల విశ్వాసులందరికీ అన్వయించవచ్చు. రోమ 8:38-39లో, *"మరణమైనను జీవమైనను దేవదూతలైనను ప్రధానులైనను ఉన్నవియైనను రాబోవునవియైనను అధికారులైనను ఎత్తయినను లోతైనను సృష్టింపబడిన మరి ఏదైనను, మన ప్రభువైన క్రీస్తుయేసునందలి దేవుని ప్రేమనుండి మనలను ఎడబాపనేరవని రూఢిగా నమ్ముచున్నాను"* అని పౌలు అన్నాడు. భూమిపై ఉన్న ఏదైనా దేవుని ప్రేమ నుండి మనల్ని వేరు చేయగలదా అని పౌలు ప్రశ్నించాడు (రోమ 8:35), దానికి సృష్టిలో ఏదీ వేరు చేయలేదని అతడు సమాధానమిచ్చాడు. (రోమ 8:35-39).

నిజానికి, ఆయన ప్రేమ శాశ్వతమైనది. అది ఎంతో ఆదరణనిచ్చే ఆలోచన! మనకు అత్యంత సన్నిహితులు ప్రియమైన వారితో సహా లోకమంతా మనల్ని ద్వేషించి తిరస్కరించినప్పటికీ మనం ఆదరణ పొందగలము. మనల్ని సృష్టించి మన కోసం చనిపోవడానికి తన కుమారుడిని పంపిన విశ్వమంతటికి రాజు మనల్ని ప్రేమించడం ఎప్పటికీ ఆపరు. మనం ఘోరంగా విఫలమైనప్పుడు కూడా ఆయన మనల్ని ద్వేషించరు, తిరస్కరించరు. యేసును మూడుసార్లు తిరస్కరించి పేతురు ఘోరంగా విఫలమయ్యాడు. అయినా సరే యేసు అతని దగ్గరకు స్వయంగా వచ్చి ఆయన ప్రేమ గురించి అతనికి హామీ ఇచ్చారు (యోహాను 21:15-17). మనకు కఠిన పరీక్షలు ఎదురైనప్పుడు, దేవుడు మనకు దూరంగా ఉన్నాడని, మనల్ని మరచిపోయాడని అనిపించినప్పుడు కూడా మనం ధైర్యం కోల్పోవలసిన అవసరం లేదు. దేవుడు మనలను శాశ్వతమైన ప్రేమతో ప్రేమించారు.

దేవుని ప్రేమకున్న నాలుగు అందమైన లక్షణాలను మనం చూశాము: ఇది స్వచ్ఛందమైనది, పరిశుద్ధమైనది, త్యాగపూరితమైనది, నిత్యమైనది. ఈ జ్ఞానాన్ని పొందడం వల్ల కలిగే ప్రేరణ ఏమిటి? ముఖ్యంగా రెండు ఉన్నాయి: *దేవుని పట్ల మనకున్న ప్రేమ, పొరుగువారి పట్ల మనకున్న ప్రేమ పెరగాలి.*

మత్తయి 22:37-39లో, యేసు మనకు రెండు ముఖ్యమైన ఆజ్ఞలను బోధించారు: *"అందుకాయన – నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణమనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునదియే. ఇది ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ. నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దానివంటిదే."* అది ఎలా ఆచరించాలో క్లుప్తంగా చూద్దాం.

## 1. దేవునిపట్ల మన ప్రేమ అధికమవ్వాలి

దేవుని పట్ల మన ప్రేమ క్రింది ఆచరణాత్మక రంగాలలో పెరగాలి:

***స్తుతి:*** దేవుని ప్రేమను తెలియజేస్తున్నప్పుడు యోహాను ఎలా స్తుతించాడో గమనించండి: *"మనము దేవుని పిల్లలమని పిలువబడునట్లు తండ్రి మనకెట్టి ప్రేమ ననుగ్రహించెనో చూడుడి; మనము దేవుని పిల్లలమే"* (1 యోహాను 3:1). ఆయన పరిశుద్ధ స్వభావానికి భంగం కలగకుండా మనల్ని ప్రేమిస్తున్నందుకు మనం నిత్యం ఆయనను స్తుతిస్తూ ఉండాలి. ఆయన మనల్ని క్రమశిక్షణలో పెట్టినప్పుడు మనం ఆయనపై సణగకూడదు, కోపడకూడదు. అది మన మంచి కోసమే. ఆయన పరిశుద్ధమైన ప్రేమ మనం ఆలోచించే, చేసే ప్రతిదానిలో పరిశుద్ధతను కొనసాగించాలని బోధిస్తుంది.

***పవిత్రత:*** యోహాను కూడా మనల్ని పవిత్రతను కొనసాగించమని చెప్తున్నాడని గమనించండి: *"ఆయనయందు ఈ నిరీక్షణ పెట్టుకొనిన ప్రతివాడును ఆయన పవిత్రుడై యున్నట్టుగా తన్ను పవిత్రునిగా చేసికొనును"* (1 యోహాను 3:3). మనం దౌర్భాగ్యులుగా ఉన్నప్పటికీ మనల్ని ప్రేమించిన ఆయనను మనం ఎలా బాధించగలం?

***లేఖనాలు, ప్రార్థన:*** మనం బైబిలు చదవడంలో (ఆయన మాటలు వినడం), ప్రార్థించడంలో (ఆయనతో మాట్లాడటం) సమయాన్ని గడిపి దేవుని పట్ల మనకున్న ప్రేమను తెలియజేస్తాము.

***త్యాగపూరితంగా ఇవ్వడం:*** తనకున్న అమూల్యమైన దానిని మనకు ఇచ్చిన దేవుని త్యాగపూరిత ప్రేమ, దేవుని ప్రయోజనాల కోసం ఏదైనా చేయడానికి మనం వెనుకాడకూడదని కోరుతుంది. మన డబ్బు, మన సమయం, మన ఆస్తులు అన్నీ దేవునివే. దేవుని ప్రయోజనాల కోసం నా సమయాన్ని డబ్బును ఇవ్వడంలో *త్యాగం చేసే* అంశం ఏదైనా ఉందా? అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. లేకపోతే, మనం పశ్చాత్తాపం చెంది సరిగ్గా స్పందించాలి. 2 సమూయేలు 24:24లో దావీదు, "వెల యియ్యక నేను తీసికొనిన దానిని నా దేవుడైన యెహోవాకు దహనబలిగా అర్పించను" అని చెప్పాడు. మనం ఒకరిని ప్రేమించినప్పుడు ఎలాంటి ఖర్చుకు వెనుకాడము. మరియ ఖరీదైన పరిమళాన్ని యేసుపై పోసినప్పుడు దాని ధర గురించి ఆలోచించలేదు (యోహాను 12:3). ఎందుకు? యేసుకు తనపట్ల ఉన్న ప్రేమ ఆమెను కదిలించింది, దానికి స్పందనగా ఆయన పట్ల తనకున్న ప్రేమను ఆమె త్యాగపూరితంగా వ్యక్తం చేసింది.

**విశ్వాసాన్ని కొనసాగించాలి:** అన్నీ శూన్యంగా అనిపించినప్పుడు కూడా మనం ఆయనను విశ్వసిస్తూనే ఉండాలి. మనపట్ల తనకున్న ప్రేమను విడిచిపెట్టకుండా ఉన్నవానికి మన నుండి కూడా అదే ఇవ్వాలి.

## 2. మన పొరుగువారి పట్ల మన ప్రేమ అధికమవ్వాలి

ఎఫెసీ 5:1-2లో *"కావున మీరు ప్రియులైన పిల్లలవలె దేవునిపోలి నడుచుకొనుడి. క్రీస్తు మిమ్మును ప్రేమించి, పరిమళ వాసనగా ఉండుటకు మనకొరకు తన్ను తాను దేవునికి అర్పణముగాను బలిగాను అప్పగించుకొనెను; ఆలాగుననే మీరును ప్రేమగలిగి నడుచుకొనుడి"* అని ఉంది. ఆపై 1 యోహాను 4:11-12లో, *"ప్రియులారా, దేవుడు మనలను ఈలాగు ప్రేమింపగా మనమొకనినొకడు ప్రేమింప బద్ధులమై యున్నాము. ఏ మానవుడును దేవుని ఎప్పుడును చూచియుండలేదు; మనమొకనినొకడు ప్రేమించినయెడల దేవుడు మనయందు నిలిచియుండును; ఆయన ప్రేమ మనయందు సంపూర్ణమగును"* అని ఉంది.

మన పొరుగువారి పట్ల మనకున్న ప్రేమ ద్వారా దేవుని ప్రేమను అనుకరించడానికి కొన్ని మార్గాలు:

***స్వేచ్ఛంద ప్రేమ.*** మన పట్ల దేవునికున్న ప్రేమ మన యోగ్యతపై ఆధారపడి లేనట్లే, ఇతరుల పట్ల మనకున్న ప్రేమ కూడా అలాగే ఉండాలి. ఎదుటివారు ఏ రంగులో ఉన్నా, ఏ భాష మాట్లాడినా, ఎంత విద్యావంతులైనా, ఎంత సంపద ఉన్నా, ఎంత చెడ్డవారైనా సరే వారిని ప్రేమించేందుకు మనం సిద్ధంగా ఉండాలి.

***పరిశుద్ధ ప్రేమ.*** మనం 1 కొరింథీ 13:6లో *"దుర్నీతివిషయమై సంతోషపడక సత్యమునందు సంతోషించును"* అని చదువుతాము. మనం ఈ ప్రత్యేక పద్ధతిలో దేవుని ప్రేమను అనుకరించాలంటే, ఇతరుల పట్ల మనకున్న ప్రేమ కారణంగా వారి పాపాల గురించి మనం ఉదాసీనంగా గాని మౌనంగా గాని ఉండకూడదు. మనం ప్రేమతో వారిని హెచ్చరించాలి. అలాగే, వారికి హాని కలిగించే ఏ పనీ చేయకూడదు. ఇతరులతో మాట్లాడేటప్పుడు ప్రేమగా దయగా మాట్లాడాలి. మనం ఎప్పుడూ ఇతరులను బలపరిచేలా మాట్లాడాలి కాని వారిని గాయపరిచేలా కాదు; అంటే మన మాటల్లో అబద్ధాలు, పుకారులు, అపనిందులు, పాపపు మాటలు ఉండకూడదు (ఎఫెసీ 4:29). మన పనులు వారికి అడ్డంకిగా ఉండకూడదని కూడా దీని అర్థం (1 కొరింథీ 10:31-33).

***త్యాగపూరిత ప్రేమ.*** 1 యోహాను 3:16లో అటువంటి త్యాగపూరిత ప్రేమలో మనం ఎలా స్పందించాలో యోహాను స్పష్టంగా చెప్పాడు: *"ఆయన మన నిమిత్తము తన ప్రాణము పెట్టెను గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలిసికొనుచున్నాము. మనము కూడ సహోదరుల నిమిత్తము మన ప్రాణములను పెట్టబద్ధులమై యున్నాము."* 17,18 వచనాలలో యోహాను ఈ త్యాగపూరిత ప్రేమను ఆచరణలో ఎలా చూపించాలో ఒక ఉదాహరణను ఇస్తున్నాడు: *"ఈ లోకపు జీవనోపాధిగలవాడైయుండి, తన సహోదరునికి లేమి కలుగుట చూచియు, అతనియెడల ఎంతమాత్రమును కనికరము చూపనివానియందు దేవుని ప్రేమ యేలాగు నిలుచును? చిన్న పిల్లలారా, మాటతోను నాలుకతోను కాక క్రియతోను సత్యముతోను ప్రేమింతము".*

***నిత్య ప్రేమ.*** మనం ఆయనను బాధించినా దేవుడు మనల్ని ప్రేమించడం ఆపరు కాబట్టి, మనం కూడా ప్రజలు మనల్ని బాధపెట్టినా వారిని ప్రేమించడం ఆపకూడదు. 1 కొరింథీ 13:4, 7లో *"ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును. ప్రేమ మత్సరపడదు; ప్రేమ డంబముగా ప్రవర్తింపదు; అది ఉప్పొంగదు; ... అన్నిటికి తాళుకొనును, అన్నిటిని నమ్మును; అన్నిటిని నిరీక్షించును; అన్నిటిని ఓర్చును"* అని మనకు గుర్తుచేస్తున్నారు. మన ప్రేమ అలాంటిదేనా? ఎవరిపట్ల అయినా మన ప్రేమ చల్లారిపోయి ఉందా? అయితే దానిని మనం సరి చేసుకోవాలి. మనం శాశ్వతమైన ప్రేమతో ప్రేమించబడ్డామనే గ్రహింపు ఇతరులను కూడా అలాగే ప్రేమించేలా మనల్ని ప్రేరేపించాలి.

దేవుని ప్రేమ గురించి మనకు కలిగిన గొప్ప గ్రహింపు వల్ల మనం ఎప్పుడూ మన పొరుగువారిని గొప్పగా ప్రేమించగలుగుతాము, క్రీస్తు ద్వారా మనకు ఇచ్చిన దేవుని ప్రేమ గురించి మన చుట్టూ ఉన్న తప్పిపోయిన

ప్రజలకు చెప్పగలుగుతాము. దేవుణ్ణి ప్రేమించడం, ఇతరులను ప్రేమించడం అనేది నిజంగా మారిన హృదయానికి గొప్ప సాక్ష్యం. వారిలో ప్రేమలేనప్పుడు, పరిశుద్ధాత్మ కార్యాలు లేనప్పుడు వారు రక్షణ పొందలేదని అర్థం. 1 యోహాను 4:20లో దేవుని వాక్యం అదే ప్రకటిస్తుంది, *"ఎవడైనను–నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి, తన సహోదరుని ద్వేషించిన యెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన తన సహోదరుని ప్రేమింపని వాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు".*

మన శత్రువులతో సహా ఇతరులను ప్రేమించే ఈ అతీంద్రియ శక్తి పరిశుద్ధాత్మ మనలో ఉందనడానికి ఒక ప్రామాణికమైన రుజువు, అది మనం దేవుని పిల్లలమని తెలియజేస్తుంది (యోహాను 13:34-35). ప్రేమాస్వరూపియైన దేవుని పోలి ఉండేందుకు మనల్ని పిలిచారు. కాబట్టి, మనపట్ల ఆయనకున్న ప్రేమతో సమానమైన ప్రేమతో ఆయనను ఇతరులను ప్రేమించేలా పరిశుద్ధాత్మ ద్వారా మనకు బోధించమని, శక్తినివ్వమని మనం ఆయనను అడగాలి.

మీరు ఇంకా క్రైస్తవులు కాకపోతే, మీ పాపాల కొరకు సిలువ వేయబడిన, మీ పాపాల క్షమాపణ కోసం సజీవంగా తిరిగి లేచిన తన కుమారుడైన యేసుక్రీస్తును అంగీకరించడానికి దేవుడు మీకు ఇచ్చే ప్రేమపూర్వక అవకాశాన్ని అంగీకరించమని మిమ్మల్ని కోరుతున్నాను. యేసుక్రీస్తు ద్వారా అందించిన దేవుని ప్రేమను మీరు రుచి చూసే వరకు నిజమైన ప్రేమ అంటే ఏమిటో మీకు తెలియదు. ఈ మాటల ద్వారా యేసే స్వయంగా మిమ్మల్ని ప్రేమతో ఆహ్వానిస్తున్నారు:

> ***మత్తయి 11:28-30 -*** *ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను దీనమనస్సు గలవాడను గనుక మీమీద నా కాడి ఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును. ఏలయనగా నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నవి.*

ఒకవేళ మీరు ఘోర పాపం చేసామని భావిస్తూ, యేసు మిమ్మల్ని ఎప్పటికైనా అంగీకరిస్తారా అనే సందేహంతో ఆయన దగ్గరకు రమ్మని పిలిచిన ఆయన ఆహ్వానాన్ని అంగీకరించడానికి మీరు సంకోచించినట్లయితే, *"నాయొద్దకు వచ్చువానిని నేనెంతమాత్రమును బయటికి త్రోసివేయను"* అని యేసు చెప్పిన మాటలు మీకు గుర్తు చేస్తున్నాను (యోహాను 6:37). కాబట్టి, ఆలస్యం చేయకుండా ఆయన దగ్గరకు వచ్చి ఆయన శాశ్వతమైన ప్రేమను రుచి చూడండి. కీర్తన 34:8లో దావీదు, *"యెహోవా ఉత్తముడని రుచి చూచి తెలిసికొనుడి ఆయనను ఆశ్రయించు నరుడు ధన్యుడు" అని* చెప్పాడు. మీరు దేవుని ప్రేమపూర్వక ఆహ్వానాన్ని తిరస్కరిస్తే, శాశ్వతమైన ప్రేమంటే ఏమిటో మీరు ఎప్పటికీ తెలుసుకోలేని ఒక సమయం వస్తుంది! అప్పుడు మీరు శాశ్వతంగా దేవుని ఉగ్రతను మాత్రమే అనుభవించడానికి విడిచిపెట్టబడతారు.

## చర్చా ప్రశ్నలు

1. ఈ అధ్యాయం దేవుని ప్రేమ గురించి మీ దృక్కోణాన్ని ఎలా ప్రభావితం చేసింది?
2. దేవుని ఈ లక్షణాన్ని బట్టి మీరు జీవితంలో ఎలాంటి మార్పులు చేసుకుంటారు?
3. దేవుని ఈ లక్షణం మీ ప్రార్థనలను ఎలా ప్రభావితం చేస్తుంది?
4. దేవుని ఈ లక్షణం మీ సువార్త ప్రచారాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

## ధ్యానించవలసిన /కంఠత చేయవలసిన వాక్యం

> ***యిర్మీయా 31:3 –*** *శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను గనుక విడువక నీయెడల కృప చూపుచున్నాను.*

## ప్రార్థన

*దయగల ప్రభువా,*
*మీరు ప్రేమాస్వరూపి,*
*ప్రేమతో నా ప్రార్థన అంగీకరించండి.*
*సముద్రపు ఇసుకరేణువుల కంటే నా పాపాలు ఎక్కువగా ఉన్నాయి,*
*కానీ ఎక్కడ పాపం అధికంగా ఉంటుందో*
*అక్కడ కృప కూడా అధికంగానే ఉంటుంది.*

*సిలువపై ఉన్న నీ ప్రియ కుమారుని చూడండి*
*ఆయన ప్రాయశ్చిత్త రక్తం ఎంతో అమూల్యమైనది;*
*విడువక చేసే ఆయన విజ్ఞాపన*
*నా హృదయానికి మెల్లగా వినిపిస్తుంది,*

*'నీ పాపాలు క్షమించబడ్డాయి,*
*సంతోషించి నెమ్మదిగా ఉండు'.*

*నేను అడగకుండానే నాకు గొప్ప బహుమానాన్ని ఇచ్చారు.*

*ఆ బహుమానమే మీ ప్రియ కుమారుడు,*

*ఆయనలో మీరు నాకు సమస్తాన్ని ఇస్తున్నారు.*

*ఆమెన్!*

# లక్షణం 7: దేవుని వివేకం

*.సమస్తం ఎరిగిన దేవుడు తనకు అధిక మహిమ కలిగేలా అత్యుత్తమ లక్ష్యాలను ఎంచుకుని ఆ లక్ష్యాలను సాధించడానికి ఉత్తమ మార్గాలను సూచించే ఆయన సామర్థ్యమే దేవుని వివేకము.*

దేవుని వివేకాన్ని దేవుని *సర్వజ్ఞత అని కూడా అంటారు* (లాటిన్లో *ఓమ్నిసపియంట్ అంటారు, ఓమ్ని* అంటే "సమస్తం", సపియంట్ అంటే "వివేకం"). రోమన్లకు రాసిన పత్రిక ముగింపులో అపొస్తలుడైన పౌలు, *"శక్తిమంతుడును అద్వితీయ జ్ఞానవంతుడునైన దేవునికి, యేసుక్రీస్తుద్వారా, నిరంతరము మహిమ కలుగునుగాక,"* (రోమా 16:27) అని రాసాడు. అతడు దేవుణ్ణి అద్వితీయ జ్ఞానవంతుడని వర్ణించడం మీరు గమనించారా? అంతకుముందు రోమా 11:33లో పౌలు దేవునికున్న బుద్ధి జ్ఞానాలను బట్టి ఆయనను స్తుతించాడు. *"ఆహా, దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము; ఆయన తీర్పులు శోధింపనెంతో అశక్యములు; ఆయన మార్గములెంతో అగమ్యములు".*

దేవుని మరే ఇతర లక్షణాన్ని మనం పూర్తిగా గ్రహించలేనట్లే దేవుని ఈ లక్షణాన్ని కూడా మనం ఎప్పటికీ పూర్తిగా అర్థం చేసుకోలేము. నాలుగు ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం ద్వారా మనం దానిని బాగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం:

1. దేవుని వివేకం అంటే ఏమిటి?
2. దేవుడు తన వివేకాన్ని ఎలా ప్రదర్శిస్తారు?
3. దేవుడు తన వివేకాన్ని మనకు ఎలా తెలియజేస్తారు?
4. మనం దేవుని వివేకంలో ఎదుగుతున్నామో లేదో ఎలా తెలుసుకోవచ్చు?

## 1. దేవుని వివేకం అంటే ఏమిటి?

ఒకరికి ఏమి తెలుసో దానిని జ్ఞానం అంటారు. ఆ జ్ఞానాన్ని ఉపయోగించడాన్ని వివేకం అంటారు. బైబిలులో వివేకానికి మేధోపరమైన నైతికమైన గుణాలు ఉన్నాయి. కాబట్టి, బైబిలు దేవుణ్ణి జ్ఞాని అని వర్ణించినప్పుడు, ఇది ఇలా చెబుతోంది: తనకు అధిక మహిమ కలిగేలా సమస్తం ఎరిగిన దేవుడు (మేధోపరమైన) అత్యున్నతమైన లక్ష్యాలను ఎంపిక చేసి (నైతికమైన), ఆ లక్ష్యాలను సాధించడానికి ఉత్తమ మార్గాలను (నైతిక వైపు) ఎంచుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటారు.

మరో మాటలో చెప్పాలంటే, దేవుని జ్ఞానం ఉపయోగించడమే దేవుని వివేకము, దానిని ఉపయోగించినప్పుడు ఆయనకు అధిక మహిమ కలిగేలా అది ఆయన ఉద్దేశాలను సాధిస్తుంది. దేవుడు తన వివేకంతో ఏదైతే సాధించాలని ఎంచుకున్నారో దానిని సాధిస్తారు. ఎందుకంటే అలా చేయగల శక్తి ఆయనకు ఉంది. దేవుడు సర్వశక్తిమంతుడని గుర్తుంచుకోండి. దేవుని శక్తి అనే అధ్యాయంలో మనం చూసినట్లుగా ఆయనకు సమస్తశక్తి ఉంది. అందుకే లేఖనాలలో దేవుని వివేకం ఎప్పుడు దేవుని శక్తితో జతచేసి ఉంటుంది. దానికి కొన్ని ఉదాహరణలు:

> ***యోబు 9:4*** *- ఆయన మహా వివేకి, అధిక బలసంపన్నుడు ఆయనతో పోరాడ తెగించి హాని నొందనివాడెవడు?*

*__దానియేలు 2:20 –__ దేవుడు జ్ఞానబలములు కలవాడు, యుగములన్నిటను దేవుని నామము స్తుతినొందునుగాక.*

*__రోమా 16:25, 27 –__ "... అనాదినుండి రహస్యముగా ఉంచబడి యిప్పుడు ప్రత్యక్షపరచబడిన మర్మము, నిత్యదేవుని ఆజ్ఞ ప్రకారము ప్రవక్తల లేఖనముల ద్వారా వారికి తెలుపబడియున్నది. ఈ మర్మమును అనుసరించియున్న నా సువార్త ప్రకారము గాను, యేసుక్రీస్తునుగూర్చిన ప్రకటన ప్రకారముగాను, మిమ్మును స్థిరపరచుటకు శక్తిమంతుడును అద్వితీయ జ్ఞానవంతుడునైన దేవునికి, యేసుక్రీస్తుద్వారా, నిరంతరము మహిమ కలుగునుగాక. ఆమేన్".*

సర్వజ్ఞుడైన దేవుడు తనకు అధిక మహిమ కలిగేలా అత్యుత్తమ లక్ష్యాలను ఎంచుకుని ఆ లక్ష్యాలను సాధించడానికి ఉత్తమ మార్గాలను సూచించే ఆయన సామర్థ్యమే (శక్తి) దేవుని వివేకము.

## 2. దేవుడు తన వివేకాన్ని ఎలా ప్రదర్శిస్తారు?

దేవుని వివేకాన్ని కింది నాలుగు అంశాలలో మనం చూడవచ్చు.

***సృష్టిలో:*** కీర్తన 104:*24లో "యెహోవా, నీ కార్యములు ఎన్నెన్ని విధములుగా నున్నవి! జ్ఞానముచేత నీవు వాటన్నిటిని నిర్మించితివి. నీవు కలుగజేసినవాటితో భూమి నిండియున్నది"* అని మనం చదువుతాము. విశ్వమంతటి అమరిక, మన శరీరాలను సృష్టించిన ప్రత్యేకమైన విధానం దేవుని వివేకాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి.

***రక్షణలో:*** మనం 1 కొరింథీ 1:18, 25వ వచనాలలో *"సిలువనుగూర్చిన వార్త, నశించుచున్న వారికి వెర్రితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి... దేవుని వెర్రితనము మనుష్యజ్ఞానముకంటె జ్ఞానముగలది, దేవుని బలహీనత మనుష్యుల బలముకంటె బలమైనది"* అని చదువుతాము. నమ్మని వారికి (అంటే, ఈ లోకజ్ఞానులు) సిలువ సందేశం మూర్ఖత్వంగా ఉంటుందని ఈ వచనాలలో పౌలు చెప్పాడు. ప్రజలను రక్షించడానికి అలాంటి మార్గం గురించి ఎవరు ఆలోచిస్తారు? అయినప్పటికీ, విశ్వసించే వారు ఈ సందేశం ద్వారా దేవుని వివేకాన్ని అర్థం చేసుకుంటారు. *"ఏ శరీరియు దేవుని యెదుట అతిశయింపకుండునట్లు"* (1 కొరింథీ 1:29) దేవుడు తన రక్షణ కార్యాన్ని ఈ విధంగా (అంటే, సిలువ గురించి బోధించడం ద్వారా) నెరవేర్చారు.

***సంఘంలో:*** పౌలు విశ్వాసం గురించి యూదులకు, యూదులు కానివారికి సువార్తను బోధించినప్పుడు, శతాబ్దాలుగా వేరువేరు జాతులుగా విడిపోయిన ఉన్న ఈ రెండు సమూహాలు క్రీస్తులో ఏక శరీరంగా అయ్యాయి. ఎఫెసీ 3:6లో *"అన్యజనులు, సువార్తవలన క్రీస్తుయేసునందు, యూదులతోపాటు సమాన వారసులును, ఒక శరీరమందలి సాటి అవయవములును, వాగ్దానములో పాలివారలునై యున్నారనునదియే"* అని ఉంది. ఈ రెండు సమూహాలను ఒక్కటిగా చేసి దేవుడు తన ఉద్దేశ్యాన్ని నెరవేర్చారు: *"దేవుడు మన ప్రభువైన క్రీస్తు యేసునందు చేసిన నిత్యసంకల్పము చొప్పున, పరలోకములో ప్రధానులకును అధికారులకును, సంఘముద్వారా తనయొక్క నానావిధమైన జ్ఞానము ఇప్పుడు తెలియబడవలెనని ఉద్దేశించి, శోధింపశక్యము కాని క్రీస్తు ఐశ్వర్యమును అన్యజనులలో ప్రకటించుటకును, సమస్తమును సృష్టించిన దేవునియందు పూర్వకాలమునుండి మరుగై యున్న ఆ మర్మమును గూర్చిన యేర్పాటు ఎట్టిదో అందరికిని తేటపరచుటకును, పరిశుద్ధులందరిలో అత్యల్పుడనైన నాకు ఈ కృప అనుగ్రహించెను"* (ఎఫెసీ 3:8-11). ఉదాహరణకు, వేరువేరు జాతులు, సంస్కృతులు, ఆర్థిక నేపథ్యాల నుండి వచ్చిన ప్రజలు క్రీస్తులో ఒకే శరీరంగా కలిసి వచ్చినప్పుడు వారి శక్తిని దేవదూతలు దయ్యాలు చూస్తారు. అది దేవుని వివేకాన్ని స్పష్టంగా వెల్లడించి అంతిమంగా ఆయనకు మహిమ కలిగిస్తుంది.

***విశ్వాసుల జీవితాల్లో:*** దేవుడు మనుషులతో సహా సమస్త విశ్వాన్ని సృష్టించినప్పుడు, ఆయన వారి ద్వారా మహిమను ఘనతను పొందాలని కోరుకున్నారు. ప్రకటన 4:11లో, *"ప్రభువా, మా దేవా, నీవు సమస్తమును సృష్టించితివి; నీ చిత్తమునుబట్టి అవి యుండెను; దానిని బట్టియే సృష్టింపబడెను గనుక నీవే మహిమ ఘనత ప్రభావములు పొందనర్హుడవు"* అని ఉంది. మరో విధంగా చెప్పాలంటే, మన ఏకైక నిధిగా, మన ప్రేమను పొందేవానిగా దేవుడే ఉండేలా మనల్ని సృష్టించారు. మన హృదయమంతటితో, మనసంతటితో, బలమంతటితో ఆయనను ప్రేమించడమే మన జీవిత ఉద్దేశ్యము.

అయితే పాపం ప్రవేశించడం, దాని వినాశకరమైన ప్రభావాల కారణంగా ఈ ఉద్దేశ్యం కొంత కాలం పాటు నెరవేరలేదు! ఏది ఏమైనప్పటికీ, సమస్త సృష్టి ఆయనకు తగిన మహిమ ఘనతలను చెల్లించాలనే అసలైన లక్ష్యాన్ని సాధించడానికి సువార్త ద్వారా దేవుడు సమస్తాన్ని తన దగ్గరకు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. అన్నింటి కంటే ఆయనను ప్రేమించి, ఆరాధించి, ఘనపరచే ప్రజల గురించి ఆ లక్ష్యంలో ఉన్నదేమిటంటే, ఆ

ప్రజలను ఆయన బిడ్డలని పిలుస్తారు, అందులో మీరు నేను కూడా ఉంటాము! మనమందరం యేసుక్రీస్తులా తయారైనప్పుడు ఆ లక్ష్యం పూర్తిగా నెరవేరుతుంది. విశ్వాసిపట్ల ఆయన లక్ష్యం అదే. ఈ అద్భుతమైన సత్యాన్ని స్పష్టంచేసే చేసే కొన్ని లేఖనభాగాలు.

***రోమ 8:28-29 -*** *దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి, మేలుకలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము. ఎందుకనగా తన కుమారుడు అనేక సహోదరులలో జ్యేష్ఠుడగునట్లు, దేవుడెవరిని ముందు ఎరిగెనో, వారు తన కుమారునితో సారూప్యము గలవారవుటకు వారిని ముందుగా నిర్ణయించెను.*

***1 కొరింథీ 15:49 -*** *మరియు మనము మంటి నుండి పుట్టినవాని పోలికను ధరించిన ప్రకారము పరలోకసంబంధి పోలికయు ధరింతుము.*

***ఫిలిప్పీ 3:20-21 -*** *మన పౌరస్థితి పరలోకమునందున్నది; అక్కడనుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కని పెట్టుకొనియున్నాము. సమస్తమును తనకు లోపరచుకొనజాలిన శక్తినిబట్టి ఆయన మన దీనశరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపము గలదానిగా మార్చును.*

కాబట్టి, ఆయన కుమారుని పోలి ఉండాలనే అంతిమ వాస్తవం నెరవేర్పుకు మనల్ని తీసుకురావడానికి దేవుడు మన జీవితాలలో కష్టసుఖాలు రెండింటినీ అనుమతిస్తున్నారు! కానీ మనం ఈ సత్యాన్ని అర్థం చేసుకోవడంలో విఫలమైతే మనకు పరీక్షలు ఎదురైనప్పుడు ఆయన చిత్తాన్ని మనం సంతోషంగా స్వీకరించలేము. యేసు కూడా శ్రమలను అనుభవించారని మనం గుర్తుంచుకోవాలి (హెబ్రీ 2:10). ఆయన అడుగుజాడల్లో నడవడానికే మనల్ని పిలిచారు (1 యోహాను 2:6)! అందుకే బాధలు వచ్చినప్పుడు ఏకాగ్రత కోల్పోకూడదు. భయంకరమైన శ్రమలు ఎదురైనా సరే దేవుని కృప ఉంటే చాలని భావించిన పౌలులా మనం కూడా ఉండాలి (2 కొరింథీ 12:7-10). మన జీవిత పరిస్థితులన్నిటిలో మనం దేవుని మార్గాలను విశ్వసించి అంగీకరించాలి ఎందుకంటే సర్వజ్ఞానవంతుడైన దేవుడు మనలను క్రీస్తు స్వరూపంలోకి మార్చి తనను తాను మహిమపరచుకుంటారు.

## 3. దేవుడు తన వివేకాన్ని మనకు ఎలా తెలియజేస్తారు?

దేవుని లక్షణాలలో కొన్ని అవ్యక్తమైనవి (ఉదా, సర్వశక్తి, సర్వజ్ఞత, నిత్యత్వం మొదలైనవి). అయితే వివేకం అనేది వ్యక్తపరచగల లక్షణం. ఇది మనకు ఎలా తెలుస్తుంది? ఎందుకంటే బైబిలులో అదే ఉంది! బైబిలులోని అనేక ఆజ్ఞలు మనల్ని వివేకం పెంచుకోవాలని చెప్తున్నాయి. సామెతల గ్రంథంలో ఎక్కువ భాగం ఈ సత్యాన్నే తెలియజేస్తుంది.

***సామెతలు 1:1-2 –*** *దావీదు కుమారుడును ఇశ్రాయేలురాజునైన సొలొమోను సామెతలు. జ్ఞానమును ఉపదేశమును అభ్యసించుటకును వివేక సల్లాపములను గ్రహించుటకును...*

***సామెతలు 4:5 –*** *జ్ఞానము సంపాదించుకొనుము బుద్ధి సంపాదించుకొనుము. నా నోటిమాటలను మరువకుము. వాటినుండి తొలగిపోకుము.*

***సామెతలు 5:1 -*** *నా కుమారుడా, నా జ్ఞానోపదేశము ఆలకింపుము; వివేకముగల నా బోధకు చెవి యొగ్గుము.*

సామెతలు మాత్రమే కాదు, బైబిలులోని ఇతర గ్రంథాలు కూడా ఇదే చెప్తున్నాయి.

***మత్తయి 10:16 -*** *పాములవలె వివేకులును పావురములవలె నిష్కపటులునై యుండుడి.*

***ఎఫెసీ 5:15 -*** *అజ్ఞానులవలె కాక, జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి.*

దేవుడు మనకు వివేకాన్ని అందించాలని కోరుకుంటున్నట్లు ఈ లేఖనాల ద్వారా స్పష్టమవుతుంది. కాబట్టి, మనం దానిని ఎలా స్వీకరిస్తాము?

*ముందుగా వివేకం యొక్క అవసరాన్ని మనం గ్రహించాలి.* మనం జ్ఞానమని గొప్పగా చెప్పుకునేది (అంటే, మానవ జ్ఞానం) దేవుని ముందు మూర్ఖత్వమే అవుతుంది. బైబిలులో నిజమైన వివేకమని చెప్పిన వివేకం మనకు లేదని మనం వినయంగా అంగీకరించాలి. *"నిశ్చయముగా మనుష్యులలో నావంటి పశుప్రాయుడు లేడు నరులకున్న వివేచన నాకు లేదు. నేను జ్ఞానాభ్యాసము చేసికొన్నవాడను కాను పరిశుద్ధ దేవునిగూర్చిన జ్ఞానము పొందలేదు"* (సామెతలు 30:2-3) అని ఆగూరు అంగీకరించినట్లు మనం కూడా దేవుని ముందు అంగీకరించాలి.

*రెండవది, దేవుడు తనను అడిగేవారికి వివేకాన్ని ఇస్తారని మనం గ్రహించాలి.* సామెతలు 2:6లో *"యెహోవాయే జ్ఞానమిచ్చువాడు తెలివియు వివేచనయు ఆయన నోటనుండి వచ్చును"* అని మనకు చెప్తుంది. పౌలు తన

పత్రికలలో ఇతర విశ్వాసుల జీవితాల్లో వివేకం దయచేయమని తరచూ ప్రార్థించడంలో ఆశ్చర్యం లేదు (ఫిలిప్పీ 1:9-11; కొలొస్సీ 1:9). అయితే మనం వివేకాన్ని అడిగినప్పుడు మనలో కనిపించవలసిన నాలుగు వైఖరులు:

1. ప్రభువు పట్ల భయము (కీర్తన 111:10; సామెతలు 1:7, 9:10).
2. పట్టుదల (సామెతలు 2:1-6).
3. వినయం (సామెతలు 11:2).
4. విశ్వాసం (యోహాను 1:5, ముఖ్యంగా శ్రమలలో).

*మూడవదిగా, దేవుడు తన వాక్యం ద్వారా దానిని ఇస్తున్నారని మనం గ్రహించాలి.* మనం ఎలా రక్షణ పొందగలమో (2 తిమోతి 3:15) మనం ఎలా పరిశుద్ధత పొందగలమో (అంటే, పరిశుద్ధతలో ఎదుగుదల) లేఖనాలు మాత్రమే తెలియజేస్తున్నాయి (2 తిమోతి 3:16; యోహాను 17:17; అపో. కా 20:32; ద్వితీయ 4:5- 8; కీర్తన 19:7, 119:11). అందుకే మనకు *"మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోటనుండి వచ్చు ప్రతిమాటవలనను జీవించును"* అని యేసు చెప్పారు (మత్తయి 4:4). దురదృష్టవశాత్తు నేడు, విశ్వాసులని చెప్పుకునే చాలామంది నేరుగా లేఖనాల నుండి గ్రహించడానికి బదులు సోషల్ మీడియా, టీవీ లేదా ఇతర మార్గాలలో జీవిస్తున్నారు. లేఖనాలను విడిచిపెట్టి ఎవరూ నిజమైన వివేకంలో ఎదగలేరు! మనం బుద్ధి జ్ఞానాలలో ఎదగడానికి మనకు సహాయం చేయడానికి దేవుడు పరిశుద్ధాత్మ ద్వారా అందించిన వాక్యాన్ని ఉపయోగిస్తారు. అయితే, నామమాత్రపు జ్ఞానం వల్ల ఏ ప్రయోజనం ఉండదు. దేవుడు మనకు బోధించినవాటికి మనం లోబడాలి. లేకపోతే, మనల్ని మనం మోసం చేసుకుంటాన్నాము (యాకోబు 1:22)!

మనం అడుగుతున్నప్పుడు పైన చెప్పిన ఈ మూడు వైఖరులు మనలో ఉన్నప్పుడు, దేవుడు మనకు వివేకాన్ని ఇస్తారని మనం *నిశ్చయంగా ఉండవచ్చు*. ఎందుకంటే, మనల్ని మనం కాకుండా దేవుణ్ణి మహిమపరచడానికే ఆ వివేకాన్ని ఉపయోగించాలని మనం ఆశిస్తున్నామని అలాంటి కోరిక సూచిస్తోంది! అలాంటి దృక్పథం దేవుణ్ణి సంతోషపరుస్తుందని, అలాంటి హృదయాలలో దేవుడు తన వివేకాన్ని కుమ్మరిస్తారని *మనం నమ్మకంగా ఉండవచ్చు*.

## 4. మనం దేవుని వివేకంలో ఎదుగుతున్నామో లేదో ఎలా తెలుసుకోవచ్చు?

యాకోబు 3:13-18 ఒక మంచి పరీక్ష:

> *మీలో జ్ఞాన వివేకములుగలవాడెవడు? వాడు జ్ఞానముతోకూడిన సాత్వికముగలవాడై, తన యోగ్య ప్రవర్తన వలన తన క్రియలను కనుపరచవలెను. అయితే మీ హృదయములలో సహింపనలవికాని మత్సరమును వివాదమును ఉంచుకొనినవారైతే అతిశయపడవద్దు, సత్యమునకు విరోధముగా అబద్ధమాడవద్దు. ఈ జ్ఞానము పైనుండి దిగివచ్చునదికాక భూసంబంధమైనదియు ప్రకృతి సంబంధమైనదియు దయ్యముల జ్ఞానము వంటిదియునై యున్నది. ఏలయనగా, మత్సరమును వివాదమును ఎక్కడ ఉండునో అక్కడ అల్లరియు ప్రతి నీచకార్యమును ఉండును. అయితే పైనుండివచ్చు జ్ఞానము మొట్టమొదట పవిత్రమైనది, తరువాత సమాధానకరమైనది, మృదువైనది, సులభముగా లోబడునది, కనికరముతోను మంచి ఫలములతోను నిండుకొనినది, పక్షపాతమైనను వేషధారణయైనను లేనిదియునై యున్నది. నీతిఫలము సమాధానము చేయువారికి సమాధానమందు విత్తబడును.*

యాకోబు చెప్పిన దానితో మన జీవితం ఎలా సరిపోతుంది? మనం వివేకంలో ఎదుగుతున్నామా లేదా అనేది దానికి ఇదే మనకు సమాధానం చెబుతుంది.

వివేకానికి సంబంధించిన ఈ నాలుగు ప్రశ్నలకు సమాధానాలను చూసాము:

1. దేవుని వివేకం ఏమిటి?
2. దేవుడు తన వివేకాన్ని ఎలా ప్రదర్శిస్తారు?
3. దేవుడు తన వివేకాన్ని మనకు ఎలా తెలియజేస్తారు?
4. మనం దేవుని వివేకంలో ఎదుగుతున్నామో లేదో ఎలా తెలుసుకోవచ్చు?

దేవుని మార్గాలను మనం ఎప్పటికీ పూర్తిగా అర్థం చేసుకోలేమని పౌలు మనకు చెప్పాడని నేను ఇంతకు ముందు చెప్పాను. అవి మన అవగాహనకు మించినవి (రోమా 11:33). పాత నిబంధనలో కూడా, దేవుడు యెషయా ద్వారా మనకు స్పష్టం చేశారు: *"నా తలంపులు మీ తలంపులవంటివి కావు మీ త్రోవలు నా త్రోవలవంటివి కావు ఇదే యెహోవా వాక్కు; ఆకాశములు భూమికిపైన ఎంత యెత్తుగా ఉన్నవో మీ మార్గములకంటె నా మార్గములు*

*మీ తలంపులకంటె నా తలంపులు అంత యెత్తుగా ఉన్నవి"* (యెషయా 55:8-9). అవును నిజమే కొన్ని సంఘటనలు మనకు ఎందుకు జరిగాయి లేదా ఎందుకు జరగలేదో అర్థం చేసుకోలేని సందర్భాలు చాలా ఉంటాయి. అలాంటి సందర్భాలలో దేవుని ఆజ్ఞలను అర్థం చేసుకోవడం, వాటిని పాటించడం కష్టంగా అనిపిస్తుంది. అలాంటప్పుడు మన స్పందన ఎలా ఉండాలి? దానికి లేఖనాల నుండి కొన్ని సమాధానాలు:

> ***సామెతలు 3:5-6 –*** *నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణహృదయముతో యెహోవాయందు నమ్మకముంచుము. నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము అప్పుడు ఆయన నీ త్రోవలను సరాళము చేయును.*

> ***1 పేతురు 4:19 –*** *కాబట్టి దేవుని చిత్తప్రకారము బాధపడువారు సత్ప్రవర్తన గలవారై, నమ్మకమైన సృష్టికర్తకు తమ ఆత్మలను అప్పగించుకొనవలెను.*

క్రీస్తులో ప్రియ సోదరీ సోదరులారా, తనను సంతోషపరచేలా మిమ్మల్ని నన్ను తన కుమారుని పోలికగా మార్చడమే దేవుని అంతిమ లక్ష్యమని గుర్తుంచుకోండి. మనం ఈ సత్యాన్ని మరచిపోయినప్పుడు ఆయన చిత్తానికి లోబడడం కష్టంగా ఉంటుంది. అయితే, దానిని హృదయపూర్వకంగా అంగీకరిస్తే సంతోషకరమైన జీవితం మాత్రమే కాకుండా నిరంతరం దేవునికి అధిక మహిమ కలుగుతుంది.

ప్రియమైన క్రైస్తవేతర మిత్రమా, మీరు విశ్వాసి కాకపోయినా లేదా నామమాత్రపు క్రైస్తవులుగా ఉన్నా సరే దయచేసి మీ వివేకం దేవుని ముందు మూర్ఖత్వమేనని గుర్తుంచుకోండి (రోమా 1:21). సిలువపై ప్రదర్శించబడిన దేవుని వివేకం వైపు మీరు తిరగాలి. మీరు దేవుణ్ణి సంతోషపెట్టడానికి ప్రయత్నించే మీ సొంత మార్గాలను విడిచిపెట్టి, ఆయన మార్గం వైపు తిరగాలి. పరిపూర్ణ జీవితాన్ని గడిపి (మీరు ఒక్క సెకను కూడా అలా జీవించలేరు), సిలువపై మరణించి సజీవంగా తిరిగి లేచిన ఆయన కుమారుడైన యేసు వైపు చూడడమే ఆయన మార్గం. *"బుద్ధి జ్ఞాన సర్వసంపదలు గుప్తమైయున్న "* యేసు దగ్గరకు రండి (కొలొస్సీ 2:3). ఆయనపై విశ్వాసం ఉంచి ఆయనను వెంబడించండి. మీరు చేయగల తెలివైన పని అదే!

## చర్చా ప్రశ్నలు

1. ఈ అధ్యాయం దేవుని వివేకం గురించి మీ దృక్కోణాన్ని ఎలా ప్రభావితం చేసింది?
2. దేవుని ఈ లక్షణాన్ని బట్టి మీరు జీవితంలో ఎలాంటి మార్పులు చేసుకుంటారు?
3. దేవుని ఈ లక్షణం మీ ప్రార్థనలను ఎలా ప్రభావితం చేస్తుంది?
4. దేవుని ఈ లక్షణం మీ సువార్త ప్రచారాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

## ధ్యానించవలసిన /కంఠత చేయవలసిన వాక్యం

> ***రోమా 11:33 -*** *ఆహా, దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము; ఆయన తీర్పులు శోధింప నెంతో అశక్యములు; ఆయన మార్గములెంతో అగమ్యములు!*

## ప్రార్థన

తండ్రీ, మీరు మహా వివేకి. వివేకంతోనే మీరు సమస్తాన్ని సృష్టించారు. మీరు నా జీవితంలోని మొదటి నుండి చివరి వరకు ప్రతి అడుగును నిర్ణయించారు. నీ మార్గం కంటే నా మార్గాలు మంచివని నేను ఆలోచించడం, అలా ప్రవర్తించడం ఎంత మూర్ఖత్వం. తండ్రీ, నా సొంత మార్గాలను అనుసరించకుండా నన్ను రక్షించండి. సవాలుకరమైన మార్గాలలో నడవవలసి వచ్చినా సరే లేఖనాల ద్వారా మీరు వెల్లడించిన విధంగా మీ వివేకంపై, మార్గాలపై నమ్మకం ఉంచేలా నాకు సహాయం చేయండి. నా మార్గాలన్నింటిలో మిమ్మల్ని సంతోషపెట్టడానికి దయచేసి నాకు మార్గం చూపించి సహాయం చేయండి.

ఆమెన్!

# లక్షణం 8: దేవుని ఉగ్రత

*దేవుని ఉగ్రత అనేది పాపాలన్నిటి పట్ల దేవునికున్న శాశ్వతమైన మరియు పరిశుద్ధమైన ద్వేషాన్ని తెలియజేస్తుంది,*
*దాని ఫలితంగా ఆయన పాపాన్ని శిక్షిస్తారు.*

సంఘం, క్రైస్తవులమని చెప్పుకునే చాలామంది అత్యధికంగా నిర్లక్ష్యం చేసే బోధనలలో ఒకటి దేవుని ఉగ్రత గురించిన సత్యం. ఈ లక్షణాన్ని ప్రస్తావించడం కూడా చాలా మందికి ఇష్టం ఉండదు. దేవుని ఉగ్రత గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు దాదాపుగా క్షమాపణలు కోరుతున్నట్లుగా, "నన్ను క్షమించండి, దేవుడు ఉగ్రత చూపించే దేవుడని బైబిలు వర్ణిస్తుంది" అని చెప్తారు.

ప్రేమామయుడైన దేవుడే ఉగ్రత చూపించే దేవుడని అంగీకరించడం ప్రజలకు కష్టంగా ఉండడమే అటువంటి వ్యతిరేక వైఖరికి కారణం. "ప్రేమ, దయగల దేవుడే శిక్షించే దేవునిగా కూడా ఎలా ఉంటారు?" అనే ఆలోచనతో వారు పెనుగులాడుతూ ఉంటారు. దేవుని గుణగణాల గురించి బైబిలు చెప్పే దానిపై సరైన అవగాహన లేకుండా దేవుని గురించి తప్పుగా ఆలోచించడం వల్ల అలాంటి భావన వస్తుంది. సాధారణంగా, మనం ఉగ్రత అని చెప్పగానే ఒక ఉన్మాది తుపాకీ పట్టుకుని పరుగెత్తుతూ ప్రజలను విచక్షణారహితంగా కాల్చి చంపడమే చాలామందికి గుర్తుకు వస్తుంది. నిగ్రహం కోల్పోయి విచక్షణ లేకుండా ప్రజలకు బాధ కలిగిస్తూ చంపే వారితో సమానంగా దేవుడిని చూస్తారు. సత్యాన్ని మించింది ఏదీ లేదు. పాపంతో నిండిపోయిన మనుషుల కోపంలా కాకుండా, దేవుని పరిశుద్ధ స్వభావానికి తగినట్లుగానే ఆయన ఉగ్రత కూడా ఉంటుంది.

దేవుడు పరిశుద్ధుడు. పాపం, అంటే అన్ని రకాల పాపాలు దేవుని పరిశుద్ధ స్వభావానికి వ్యతిరేకమైనవే. మరొక విధంగా చెప్పాలంటే దేవునికి వ్యతిరేకమైన ప్రతీది పాపమే. సార్వభౌమాధికారం కలిగిన దేవుడు తనను వ్యతిరేకించే దేనినైనా సహించి సార్వభౌముడిగా ఎలా ఉండగలరు? అలా ఉండలేరు, దేవుడు తన పరిశుద్ధమైన నీతివంతమైన స్వభావానికి అనుగుణంగా పాపాన్ని శిక్షించాలి. పాపాన్ని ద్వేషించని లేదా దాని వల్ల ఇబ్బంది పడని పరిశుద్ధ దేవుడిని ఊహించుకోండి. ఎలాంటి సందేహం లేకుండా ఆయనే నీతిమంతుడైన దేవుడని మనం స్తుతించగలమా? నిజానికి, మనమలా చేయలేము!

కాబట్టి, మనం దేవుని ఉగ్రతని ప్రతికూల లక్షణంగానో లేదా ఆయనకున్న ప్రేమ, దయ, కనికరం, మంచితనం వంటి ఇతర లక్షణాలకు వ్యతిరేకమైన లక్షణంగానో చూడకూడదు. దేవుడు సంపూర్ణుడు. దేవుడు సంపూర్ణంగా ప్రేమించినట్లే, మంచికి వ్యతిరేకమైన ప్రతిదానిని అంటే చెడును కూడా సంపూర్ణంగా ద్వేషిస్తారు. దేవుడు పాపంతో వ్యవహరించకపోతే ఆయన పరిపూర్ణుడు కాలేడు. అందుకే బైబిలులో దేవుని ఉగ్రత గురించి అనేకసార్లు చెప్పడం మనకు ఆశ్చర్యం కలిగించకూడదు. వాస్తవానికి, దేవుడే స్వయంగా తన ఉగ్రత గురించి సిగ్గుపడకుండా, ఏ క్షమాపణలు లేకుండా స్పష్టమైన పదాలలో వివరించారు:

> ***ద్వితీయో 32:39-41*** *- ఇదిగో నేను నేనే దేవుడను; నేను తప్ప వేరొక దేవుడు లేడు. మృతినొందించువాడను బ్రదికించువాడను నేనే గాయపరచువాడను స్వస్థపరచువాడను నేనే. నా చేతిలోనుండి విడిపించువాడెవడును లేడు. నేను తళతళలాడు నా ఖడ్గము నూరి నా చేత న్యాయమును పట్టుకొనినయెడల నా శత్రువులకు ప్రతీకారము కలుగజేసెదను. నన్ను ద్వేషించువారికి ప్రతిఫలమిచ్చెదను. రక్తముచేత నా బాణములను మత్తిల్ల చేసెదను.*

స్వభావరీత్యా స్వచ్ఛంగా మనోహరంగా ఉన్న ప్రతిదానిలో ఆనందించేవాడు అపరిశుభ్రంగా మురికిగా ఉన్న ప్రతిదానిని కూడా అసహ్యించుకోవాలి. దానిలో ఒక అర్థం ఉంది.

తన ఉగ్రత గురించి ప్రకటించడానికి దేవుడు ఏ మాత్రమూ సిగ్గుపడడు. పాత నిబంధనలోని ప్రవక్తలు, క్రొత్త నిబంధనలోని అపొస్తలులు కూడా దానిని బోధించడానికి సిగ్గుపడలేదు.

> ***యెషయా 30:27*** *– ఇదిగో కోపముతో మండుచు దట్టముగా లేచు పొగతోకూడినదై యెహోవా నామము దూరమునుండి వచ్చుచున్నది. ఆయన పెదవులు ఉగ్రతతో నిండియున్నవి. ఆయన నాలుక దహించు అగ్నిజ్వాలవలె ఉన్నది.*

> ***రోమా 1:18*** *– దుర్నీతిచేత సత్యమును అడ్డగించు మనుష్యులయొక్క సమస్త భక్తిహీనతమీదను, దుర్నీతిమీదను దేవుని కోపము పరలోకమునుండి బయలుపరచబడుచున్నది.*

దేవుడు తన ఉగ్రతను వర్ణించడానికి సిగ్గుపడరు. ప్రవక్తలు, అపొస్తలులు కూడా దాని గురించి సిగ్గుపడలేదు. అలాగే మనం కూడా సిగ్గుపడకూడదు. దేవుడు చెడును శిక్షించి న్యాయం చేస్తారు. తాను న్యాయవంతుడనని దేవుడు చూపిస్తారు. ద్వేషం విషయంలో కూడా అదే జరుగుతుంది. ద్వేషించడం చెడ్డ విషయమని మనం అనుకుంటాం కానీ నిజానికి దేవుడు చాలా విషయాలను ద్వేషిస్తారు. మీరు దేనినైనా ప్రేమిస్తే దానికి వ్యతిరేకమైన దానిని ద్వేషిస్తారు కాబట్టి మీరు సత్యాన్ని ప్రేమిస్తే, అబద్ధాన్ని ద్వేషించాలి. మీరు అబద్ధాన్ని ద్వేషించకపోతే, మీరు నిజంగా సత్యాన్ని ప్రేమించలేరు. మీరు స్వేచ్ఛను ప్రేమిస్తే, బానిసత్వాన్ని ద్వేషించాలి. అలాగే దేవుడు మనల్ని ప్రేమిస్తే మనలను నాశనం చేసే దానిని ఆయన ద్వేషించాలి.

చెడ్డపనులు చేసినవారిని శిక్షించి సరైన న్యాయం చేసినప్పుడు మనం న్యాయస్థానాలను ప్రశంసిస్తాము. తన ఉగ్రతతో దుర్మార్గులకు వ్యతిరేకంగా పరిపూర్ణ న్యాయాన్ని అమలు చేసే పరిశుద్ధ దేవుడిని మరి ఎంత ఎక్కువగా స్తుతించాలో కదా? భవిష్యత్తులో దేవుడు తన శత్రువులందరిపై తన ఉగ్రతను చూపించినప్పుడు మనం సంతోషిస్తామని లేఖనాలు సాక్ష్యమిస్తున్నాయి, ప్రస్తుతం మనం ఈ లోక శరీరంలో ఉన్నందున ఈ ఆలోచనను గ్రహించడం కొంచెం కష్టమే.

> ***ద్వితీయో 32:43*** *– జనములారా, ఆయన ప్రజలతోకూడ ఆనందించుడి. హతులైన తన సేవకులనుబట్టి ఆయన ప్రతి దండన చేయును తన విరోధులకు ప్రతీకారము చేయును. తన దేశము నిమిత్తమును తన ప్రజల నిమిత్తమును ప్రాయశ్చిత్తము చేయును.*

> ***ప్రకటన 19:1-3*** *- అటుతరువాత బహుజనులశబ్దమువంటి గొప్ప స్వరము పరలోకమందు ఈలాగు చెప్పగా వింటిని. ప్రభువును స్తుతించుడి, రక్షణ మహిమ ప్రభావములు మన దేవునికే చెల్లును; ఆయన తీర్పులు సత్యములును న్యాయములునై యున్నవి; తన వ్యభిచారముతో భూలోకమును చెరిపిన గొప్ప వేశ్యకు ఆయన తీర్పుతీర్చి తన దాసుల రక్తమునుబట్టి దానికి ప్రతి దండన చేసెను; మరి రెండవసారి వారు–ప్రభువును స్తుతించుడి అనిరి. ఆ పట్టణపు పొగ యుగయుగములు పైకి లేచుచున్నది.*

ఈ వచనాల నుండి మనం నేర్చుకునే సత్యం ఏమిటంటే: దేవుడు తన దయను ప్రేమను చూపించినందుకు మనం ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించినట్లే, తన ఉగ్రతను చూపించినందుకు కూడా ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి.

బైబిలు రచయితలకు సువార్త దేవుడు ప్రేమాస్వరూపి అనే దానితో ప్రారంభం కాలేదు. దేవుడు నీతిమంతుడు పరిశుద్ధుడు కాబట్టి మనమందరం ఆయన పరిశుద్ధ ప్రమాణానికి దూరంగా ఉన్నామని ఇది ప్రారంభమైంది. మనం దేవునితో సరిగ్గా లేము కాబట్టి మనం ఆయనతో సరి చేసుకోవాలి. అది వారి సువార్త బోధలో ప్రారంభ అంశం, అదే మనకు కూడా ప్రారంభాంశంగా ఉండాలి. కాబట్టి దేవుని ఉగ్రత గురించిన ఆలోచనతో చింతించకుండా, మనం దేవుని ఇతర లక్షణాలను ప్రకటించినట్లే ఈ లక్షణాన్ని కూడా నిస్సంకోచంగా ప్రకటించడానికి ప్రయత్నిస్తామని ఆశిస్తున్నాను.

అయితే, దేవుని కోపానికి సంబంధించిన సత్యాల సూచనలు/ ప్రభావాలు ఏమిటి?

## క్రైస్తవుని కోసం నాలుగు సూచనలు

## 1. మనం ఇకపై దేవుని ఉగ్రతకు భయపడాల్సిన అవసరం లేదు

మనం (గతంలో) ఉగ్రతకు పాత్రులుగా ఉన్నప్పటికీ (ఎఫెసీ 2:3) ఇప్పుడు దేవుని పిల్లలుగా క్రీస్తుతో సహ వారసులంగా (రోమా 8:16 -17) ఉన్నాము. 1 థెస్సలో 1:10లో *"రాబోవు ఉగ్రతనుండి మనలను తప్పించుచున్న ఆయన కుమారుడైన యేసు"* అని మనకు వాగ్దానం చేయబడింది.

అవిశ్వాసులు దేవుని ఉగ్రతకు గురికావడానికి ఇష్టపడరు, ఎందుకంటే తాము దోషులని వారికి బాగా తెలుసు. వారి స్వనీతి, వారు చేసిన మంచి పనులు తమను పరలోకానికి చేర్చుతాయని వారు నమ్ముతారు. తమ సొంత ప్రయత్నాలపై ఆధారపడినప్పుడు అది బలమైన నిరీక్షణ కాదు. కాబట్టి విశ్వాసులమైన మనం స్వనీతిపై ఆధారపడటం లేదు. దేవుని పరిశుద్ధ ప్రమాణాలను పూర్తిగా సంతృప్తిపరచే క్రీస్తు నీతిపై మాత్రమే మనం ఆధారపడతాము. అందుకే మనం క్రీస్తులో సురక్షితంగా ఉన్నామని, దేవుని ఉగ్రత గురించి భయపడవలసిన అవసరం లేదనే దృఢమైన అచంచలమైన నిరీక్షణ మనకుంది.

## 2. మనం దేవునికి మరింత అధికంగా కృతజ్ఞతలు చెల్లిస్తాము

మనం దేవుని ఉగ్రతను అనుభవించమని తెలుసుకోవడం వల్ల దేవునికి మరింత అధికంగా కృతజ్ఞతలు చెల్లిస్తాము. మనం చేసిన వాటి వల్ల కాకుండా దేవుడు మన కోసం యేసు ద్వారా చేసిన దాని కారణంగా మన శాశ్వతమైన భవిష్యత్తు చాలా సురక్షితంగా ఉందని గ్రహించినప్పుడు మనం నిరంతరం కృతజ్ఞతలు చెల్లిస్తూనే ఉంటాము (కీర్తన 116:12-13).

## 3. మనం దేవునికి ఎక్కువగా భయపడతాం కాబట్టి పాపాన్ని ఎక్కువగా ద్వేషిస్తాము

నిజమైన క్రైస్తవుడు ఎన్నడూ రక్షణను కోల్పోయి దేవుని ఉగ్రతకు గురికాడు కాని, పశ్చాత్తాపపడని పాపం ఉన్నప్పుడు కొన్నిసార్లు విశ్వాసికి తీవ్రమైన శిక్ష ఎదురవుతుంది (1 కొరింథీ 11:28-32). దేవుని ఉగ్రత గురించి నిరంతరం ఆలోచించడం వల్ల విశ్వాసులు పాపాన్ని తీవ్రంగా పరిగణిస్తారు, పాప జీవితానికి సాకులు చెప్పరు, తద్వారా వారు పాపాన్ని మరి ఎక్కువగా ద్వేషిస్తారు. సామెతలు 8:13 ప్రకారంగా యెహోవా పట్ల భయభక్తులు కలిగిన జీవితాన్ని గడపడం అంటే పాపాన్ని ఎక్కువగా ద్వేషించడమే. *"యెహోవాయందు భయభక్తులు గలిగియుండుట చెడుతనము నసహ్యించుకొనుటయే. గర్వము అహంకారము దుర్మార్గత కుటిలమైన మాటలు నాకు అసహ్యములు."*

## 4. దేవుని ఉగ్రత నుండి పారిపొమ్మని మనం ప్రజలను వేడుకుంటాము

తమ పాపాలకు పశ్చాత్తాపపడి దేవుని ఉగ్రత నుండి తప్పించుకొమ్మని బాప్తిస్మమిచ్చు యోహాను ప్రజలను కోరాడు (మత్తయి 3:7). నరకం గురించి అందరికంటే ఎక్కువగా యేసు చెప్పారు, తన వైపుకు తిరిగి దేవునికి భయపడమని ఆయన మనల్ని పిలిచారు (మత్తయి 10:28). పౌలు దేవుని ఉగ్రతను అర్థం చేసుకున్నందున క్రీస్తు వైపు తిరగమని ప్రజలను హెచ్చరించాడు (2 కొరింథీ 5:11).

నరకం గురించి బోధించడమంటే ప్రేమలేకపోవడం కాదు. ఈ లోకం ఏమనుకున్నా సరే అది చాలా ప్రేమ కలిగిన విషయం! మనం ఎవరినైనా ప్రేమించినప్పుడు, వారు క్రీస్తు లేకుండా జీవిస్తూ ఉంటే వారి ముందున్న శాశ్వతమైన ప్రమాదం గురించి చెప్పకుండా ఎలా ఉండగలం? దేవుని ఉగ్రత గురించి బోధించడమే కాకుండా క్రీస్తు సిలువలో చేసిన బలియాగం ద్వారా ఆయన అందించే క్షమాపణను కూడా ప్రకటించడం చాలా ముఖ్యము (కీర్తన 130:3; రోమా 3:25-26).

## క్రైస్తవేతరుల కోసం రెండు సూచనలు

## 1. గతంలో/ప్రస్తుతం ఉన్న దేవుని ఉగ్రత రాబోయే ఉగ్రతను హామీ ఇస్తుంది.

***గతంలో.*** ఏదేను తోట నుండి ఆదాము హవ్వల బహిష్కరణ (ఆది 3), జలప్రళయంలో నోవాహు ఓడలో ఉన్న వారిని తప్ప భూమి మీద ఉన్న సమస్తాన్ని నాశనం చేయడం (ఆది 7:23), సొదొమ గొమొఱ్ఱాలను నాశనం చేయడం (ఆది 19), క్రీ. శ 70లో రోమీయులతో యెరూషలేమును నాశనం చేయడం అనేవి తనను తిరస్కరించిన వారిపై దేవుడు కుమ్మరించిన ఉగ్రతకు సంబంధించిన వాస్తవమైన కొన్ని చారిత్రాత్మక దృష్టాంతాలు.

***ప్రస్తుతం.*** యోహాను 3:36 ప్రకారం, *"కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచి యుండును."* యేసుకు దూరంగా ఉన్నవారు ప్రస్తుతం దేవుని ఉగ్రతకు గురవుతున్నారు. రోమా 1:18 ప్రకారం, *"దుర్నీతిచేత సత్యమును అడ్డగించు మనుష్యులయొక్క సమస్త భక్తిహీనతమీదను, దుర్నీతిమీదను దేవుని కోపము పరలోకమునుండి బయలుపరచబడుచున్నది."* ప్రస్తుతకాలంలో, తన ఉగ్రతను చూపించడానికి దేవుడు పాపులను వారి స్వమార్గాలకు విడిచిపెట్టారు, తద్వారా వారు తమ దుష్టత్వంలో కొనసాగుతూ దాని పర్యవసానాలను అనుభవిస్తారు (రోమా 1:24-32).

***భవిష్యత్తులో.*** 2 థెస్సలొ 1:6-10 ప్రకారం, *"ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతోకూడ పరలోకమునుండి అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై, దేవుని నెరుగనివారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతి దండన చేయునప్పుడు మిమ్మును శ్రమపరచు వారికి శ్రమయు, శ్రమపొందుచున్న మీకు మాతోకూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే. ఆ దినమున తన పరిశుద్ధులయందు మహిమపరచబడుటకును, విశ్వసించినవారందరియందు ప్రశంసింపబడుటకును, ప్రభువు వచ్చినప్పుడు అట్టివారు ఆయన సముఖము నుండియు ఆయన ప్రభావమందలి మహిమనుండియు పారదోలబడి, నిత్యనాశనమను దండన పొందుదురు. ఏలయనగా మేము మీకిచ్చిన సాక్ష్యము మీరు నమ్మితిరి".* ప్రభువైన యేసుక్రీస్తు సువార్తకు విధేయత చూపడానికి నిరాకరించే వారిపైకి రాబోయే దేవుని అంతిమ ఉగ్రత గురించి ప్రకటన 6-20 అధ్యాయాలు వివరిస్తున్నాయి.

దేవుడు అబద్ధం చెప్పలేడని బైబిలు బోధిస్తుంది (తీతు 1:2, NASB). క్రీస్తును తిరస్కరించే వారందరికీ తీర్పుతీరుస్తానని దేవుడు వాగ్దానం చేశారు కాబట్టి, ఆయన తన మాటను నిలబెట్టుకుంటారు. దేవుడు ప్రతి చెడుపనికి వెంటనే తీర్పుతీర్చనందున, ఆయన పాపానికి ఎన్నటికీ తీర్పు తీర్చడని (ప్రసంగి 8:11-14) భావించి మోసపోకూడదు.

దైవభక్తిగల రైతుల సంఘంలో నివసించిన భక్తిహీనుడైన రైతు గురించి ఒక కథ ఉంది. దైవభక్తిగల రైతులందరూ ప్రతి ఆదివారం ఉదయం ఆ ఊరిలో ఉన్న చర్చిలో కలుసుకున్నప్పుడు ఈ వ్యక్తి మాత్రం తన ట్రాక్టర్‌ని నడుపుతూ వారికి ఇబ్బంది కలిగించేవాడు. అతడలా చాలా నెలలు చేశాడు. చివరగా, అక్టోబర్‌లో పంట కోత కాలం వచ్చినప్పుడు, ఆ సంఘంలో ఉన్న వారందరి కన్నా అతని పొలంలోనే ఎకరానికి అత్యధిక దిగుబడి వచ్చింది. తాను దేవునికి ఆయన ప్రజలకు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ తనకు వచ్చిన విజయాన్ని క్రైస్తవులు ఎలా వివరిస్తారు? అంటూ అతడు గర్వంగా స్థానిక వార్తాపత్రికకు రాసాడు.

దానికి సమాధానంగా ఆ పాస్టర్ ఒకే ఒక్క మాట చెప్పాడు: "దేవుడు తన లెక్కలన్నీ అక్టోబర్‌లోనే సరిచూడడు."

ప్రియమైన మిత్రులారా, మీరు క్రైస్తవులు కాకపోతే, ఈ రోజు అంతా బాగానే ఉంది కాబట్టి దేవుడు మీ పట్ల సంతోషంగా ఉన్నాడని అనుకోకండి. ఆయన చూపిస్తున్న సహనాన్ని మీ పాపానికి ఆయన అంగీకారమని పొరబడకండి. ఆయన మంచితనం దుర్వినియోగం చేయడానికి కాదు కానీ అది మిమ్మల్ని నిజమైన పశ్చాత్తాపంలోకి మరియు ఆయన కుమారుడైన యేసుపై విశ్వాసంలోకి నడిపించడానికి రూపొందించబడింది (రోమా 2:4-5).

## 2. రాబోయే దేవుని ఉగ్రత మిమ్మల్ని యేసు దగ్గరకు పరిగెత్తేలా చేస్తుంది

"జీవముగల దేవుని చేతిలో పడుట భయంకరము" అని బైబిలు చెప్తుంది (హెబ్రీ 10:31). మీ పాపాలు మిమ్మల్ని దేవునికి శత్రువుగా చేశాయని దయచేసి గ్రహించండి. తత్ఫలితంగా, ఆయన కోపం వర్తమానంలో మీపై ఉంటుంది, భవిష్యత్తులో కూడా మీ కోసం ఎదురుచూస్తుంది. కాబట్టి కృప చూపమని ప్రార్థించడండి. రాబోవు ఉగ్రతను తప్పించుకోవాలని (మత్తయి 3:7) కోరుకోవాలి, యేసుక్రీస్తు మన పాపాలను ఉచితంగా క్షమించడానికి దేవుని ఉగ్రతని తనపైకి తెచ్చుకున్న సిలువ దగ్గరకు పరుగెత్తాలి. మీరు ఆత్మవిశ్వాసానంతా విడిచిపెట్టి, "దేవా, పాపాత్ముడైన నన్ను కరుణించు!" అని వినయంగా మొరపెట్టాలి (లూకా 18:13, NASB). రాబోయే ఉగ్రత నుండి తప్పించుకోడానికి ఉన్న ఏకైక మార్గం ఇదే.

ప్రియమైన మిత్రులారా, దేవుని మంచితనం సహనం కన్నా మధురమైనది ఏదీ లేదు. అలాగే రాబోయే ఆయన ఉగ్రత కంటే భయంకరమైనది కూడా ఏదీ లేదు. నీ దాహాన్ని తీర్చగల నీరే వరదలా వచ్చినప్పుడు అది మీకు భయంకరమైన శత్రువుగా మారుతుంది. మీ ఆహారాన్ని ఉడికించడానికి ఉపయోగించే అదే అగ్ని మిమ్మల్ని కాల్చినప్పుడు అది మీకు భయంకరమైన శత్రువుగా మారుతుంది. అదే విధంగా, ఈ రోజు మీ పట్ల సహనంగా మంచిగా ఉన్న అదే దేవుడు ఒక రోజు భయంకరమైన ప్రతీకారంతో మీకు వ్యతిరేకంగా ఉంటారు. ఆ రోజున ఆయన చేతిలో నుండి మిమ్మల్ని ఎవరూ విడిపించలేరు. ఎంత ఏడ్చి మొరపెట్టినా సరే మీకు రక్షణ ఉండదు. మన పాపాల కోసం సిలువపై మరణించి, తన త్యాగం మన పాపాలకు పూర్తి పరిహారంగా అంగీకరించబడిందని నిరూపించడానికి సజీవంగా తిరిగి లేచిన యేసు వైపు చూడండి. యేసు ద్వారానే పూర్తి క్షమాపణ ఉంది.

ఇంకా సమయం ఉండగానే నిజమైన పశ్చాత్తాపంతో విశ్వాసంతో ఆయన వైపు తిరగండి. మీరు ఎంత చెడ్డవారైనప్పటికీ ఆయన మిమ్మల్ని అంగీకరించి మీకు కొత్త ఆరంభాన్ని ఇస్తారు! మీ పాపాలలోనే మీరు చనిపోకండి. యేసుక్రీస్తు ద్వారా దేవుడు ఇచ్చే ఉచిత బహుమానమైన నిత్యజీవాన్ని పొందండి (రోమా 6:23).

## చర్చా ప్రశ్నలు

1. ఈ అధ్యాయం దేవుని ఉగ్రత గురించి మీ దృక్కోణాన్ని ఎలా ప్రభావితం చేసింది?
2. దేవుని ఈ లక్షణాన్ని బట్టి మీరు జీవితంలో ఎలాంటి మార్పులు చేసుకుంటారు?
3. దేవుని ఈ లక్షణం మీ ప్రార్థనలను ఎలా ప్రభావితం చేస్తుంది?
4. దేవుని ఈ లక్షణం మీ సువార్త ప్రచారాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

## ధ్యానించవలసిన /కంఠత చేయవలసిన వాక్యం

***కీర్తనలు 7:11 –*** *న్యాయమునుబట్టి ఆయన తీర్పు తీర్చును, ఆయన ప్రతిదినము కోపపడు దేవుడు.*

## ప్రార్థన

తండ్రీ, మీరు నా పరలోకపు తండ్రి అయినప్పటికీ, మీరు కూడా ఉగ్రత చూపించే దేవుడని నేను తరచుగా మరచిపోతాను. మీరు పాపాన్ని ద్వేషిస్తారు, దానిని తీర్పు తీరుస్తారు. నేను అనుభవించాల్సిన ఉగ్రతనంతా యేసు ప్రభువు భరించినందుకు నేను కృతజ్ఞుడను. నేను పాపాన్ని తేలికగా తీసుకోకుండా నన్ను కాపాడి, దయచేసి నేను భయంతో వణుకుతో నడిచేలా చేయండి. మీపై తిరుగుబాటు చేసే వారందరిపైనా మీ ఉగ్రత రాబోతుంది కాబట్టి రాబోయే మీ తీర్పు నుండి మమ్మల్ని రక్షించగల యేసు దగ్గరకు నా చుట్టూ ఉన్న తప్పిపోయిన వారందరూ పరుగెత్తాలని నేను వేడుకునేలా చేయండి. ప్రజలకు సువార్తను తెలియజేస్తున్నప్పుడు మీ ఉగ్రత గురించి మాట్లాడడానికి సిగ్గుపడకుండా గొప్ప భారంతో ప్రేమతో బోధించేలా నన్ను కాపాడండి. ఆమెన్

# లక్షణం 9: దేవుని విశ్వసనీయత

*దేవుని విశ్వసనీయత అంటే ఆయన*
*తన వాగ్దానాలన్నింటినీ నెరవేరుస్తారని విశ్వసించవచ్చు.*

సామెతలు 20:6లో, *"దయ చూపువానిని కలిసికొనుట అనేకులకు తటస్థించును నమ్ముకొనదగినవాడు ఎవరికి కనబడును?"* అని సొలొమోను రాసాడు. ఈ సామెతలోని సత్యాన్ని నిరూపిస్తున్న ప్రపంచంలో మనమిప్పుడు జీవిస్తున్నాము. మనుషుల నమ్మకద్రోహం వల్ల స్నేహాలు, పెళ్లిళ్లు, వ్యాపారాలు చెడిపోతాయి. చివరి వరకు నమ్మకంగా ఉంటానని వాగ్దానం చేసిన వ్యక్తుల ద్రోహం వల్ల కలిగే తీవ్రమైన బాధను బహుశా మీరు కూడా అనుభవించి ఉండవచ్చు.

అటువంటి వాస్తవాల చీకటిలో, విశ్వసనీయత అనే దేవుని లక్షణం బాధలో ఉన్న ఆత్మకు గొప్ప ఓదార్పునిస్తుంది. ద్వితీయో 7:9లో దేవుని విశ్వసనీయతను బైబిలు ముందుగానే తెలియజేసింది, *"కాబట్టి నీ దేవుడైన యెహోవా తానే దేవుడనియు, తన్ను ప్రేమించి తన ఆజ్ఞల ననుసరించి నడుచుకొనువారికి తన నిబంధనను స్థిరపరచువాడును వేయితరములవరకు కృపచూపువాడును నమ్మతగిన దేవుడుననియు, తన్ను ద్వేషించువారిలో ప్రతివానిని బహిరంగముగా నశింపచేయుటకు వానికి దండన విధించువాడనియు నీవు తెలిసికొనవలెను."*

తర్వాత ద్వితీయో 32:4లో, *"ఆయన ఆశ్రయదుర్గముగా నున్నాడు; ఆయన కార్యము సంపూర్ణము ఆయన చర్యలన్నియు న్యాయములు ఆయన నిర్దోషియై నమ్ముకొనదగిన దేవుడు. ఆయన నీతిపరుడు యథార్థవంతుడు"* అని చదువుతాము.

విశ్వాస విషయంలో అటూఇటూ ఊగిసలాడే పతనమైన మనుషుల్లా కాకుండా దేవుడు తన విశ్వసనీయతలో స్థిరంగా ఉంటారు. *"దేవుడు అబద్ధమాడుటకు ఆయన మానవుడు కాడు పశ్చాత్తాపపడుటకు ఆయన నరపుత్రుడు కాడు ఆయన చెప్పి చేయకుండునా? ఆయన మాట యిచ్చి స్థాపింపకుండునా?"* అని సంఖ్యా 23:19లో మోషే మనకు గుర్తు చేస్తాడు. *"యెహోవా, సైన్యములకధిపతివగు దేవా, యెహోవా, నీవంటి బలాఢ్యుడెవడు? నీ విశ్వాస్యతచేత నీవు ఆవరింపబడియున్నావు"* అని కీర్తనాకారుడు ఎజ్రాహీయుడైన ఏతాను కీర్తన 89:8లో రాసాడు. *అబద్ధమాడనేరని దేవుడు* అని పౌలు తీతు 1:2లో (NASB) గుర్తు చేశాడు. దేవుడు అబద్ధమాడజాలని వాడని హెబ్రీ పత్రిక రచయిత అన్నాడు (హెబ్రీ 6:18). దేవుని ప్రతి మాట దోషరహితమైనది (సామెతలు 30:5) అని ఆగూరు మనకు గుర్తు చేస్తాడు. దేవుడు తన వాగ్దానాలను పూర్తిగా నెరవేరుస్తారని ఈ వచనాలన్నీ మనకు బోధిస్తున్నాయి. ఆయనను హృదయపూర్వకంగా విశ్వసించే వారికి ఆయన ఎన్నటికీ ద్రోహం చేయరు (కీర్తన 34:22).

దేవుని వాగ్దానాన్ని అంగీకరించి ఆయన వాగ్దానం చేసినది నెరవేరడానికి ఆయనపై ఆధారపడడమే నిజమైన విశ్వాసంలోని సారాంశమని వేన్ గ్రూడెమ్ చెప్పాడు. దేవుడు తన వాగ్దానాలన్నిటినీ నెరవేర్చడంలో నమ్మదగినవానిగా ఉన్నందున, యెహోవాకున్న గొప్ప ప్రేమ కారణంగా ఆయన కృప ఎప్పుడూ విఫలం కాదు కాబట్టి మనం నాశనంకామని విశ్వాసి నమ్మకంగా చెప్పగలడు. వారి ప్రతి ఉదయం నూతనంగా ఉంటుంది; ఆయన విశ్వసనీయత ఎంతో గొప్పది. *"యెహోవా నా భాగమని నేననుకొనుచున్నాను ఆయనయందు నేను నమ్మిక యుంచుకొనుచున్నాను"* అని మనం కూడా చెప్పవచ్చు (విలాప 3:22-24).

తన వాగ్దానాలను నెరవేర్చడంలో దేవునికున్న విశ్వసనీయతకు సంబంధించిన దృష్టాంతాలు

బైబిలు నిండా ఉన్నాయి. వాటిలో కొన్ని ఉదాహరణలు:

1. ఆది 8:22 ప్రకారం దేవుడు నోవహుకు చేసిన వాగ్దానం, *"భూమి నిలిచియున్నంతవరకు వెదకాలమును కోతకాలమును శీతోష్ణములును వేసవి శీత కాలములును రాత్రింబగళ్లును ఉండక మానవని తన హృదయములో అనుకొనెను."* ఏటేటా ఇది నెరవేరడం మనం చూస్తున్నాము.
2. ఆది 15:13-16లో తన విమోచన వాగ్దానంతో పాటు యూదులు 400 సం. లు బానిసత్వంలో ఉంటారని దేవుడు అబ్రాహాముతో ముందే చెప్పారు. నిర్గమ 12:41 ఈ విమోచన నెరవేర్పు కనిపిస్తుంది: *"ఆ నాలుగు వందల ముప్పది సంవత్సరములు గడచిన తరువాత జరిగినదేమనగా, ఆ దినమందే యెహోవా సేనలన్నియు ఐగుప్తుదేశములోనుండి బయలుదేరిపోయెను."*
3. యెషయా 7:14లో యేసుక్రీస్తు కన్యకు పుట్టడం గురించి ప్రవచనం ఉంది, *"కాబట్టి ప్రభువు తానే యొక సూచన మీకు చూపును. ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టును."* ఈ ప్రవచన నెరవేర్పును మత్తయి 1:22-25లో చూస్తాము.

పైన పేర్కొన్న మూడింటితో పాటు మరిన్ని ఉదాహరణలు చెప్పవచ్చు. హెబ్రీ 10:23లో *"వాగ్దానం చేసినవాడు నమ్మకమైనవాడు"* అని చెప్పిన ప్రకారం ఈ విషయం స్పష్టంగా ఉంది. ఈ అధ్యాయంలోని మిగిలిన భాగం దేవుని విశ్వసనీయతకు సంబంధించిన 2 అంశాలపై దృష్టి పెడుతుంది:

1. ఆయన పిల్లల జీవితాలలో
2. ఆయన శత్రువుల జీవితాలలో.

## 1. తన పిల్లల జీవితాలలో దేవుని విశ్వసనీయత:

***వారిని సంరక్షించడంలో.*** 1 కొరింథీ 1:8-9లో *"మన ప్రభువైన యేసుక్రీస్తు దినమందు మీరు నిరపరాధులై యుండునట్లు అంతమువరకు ఆయన మిమ్మును స్థిరపరచును. మన ప్రభువైన యేసుక్రీస్తు అను తన కుమారుని సహవాసమునకు మిమ్మును పిలిచిన దేవుడు నమ్మదగినవాడు"* అని మనకు తెలియజేసారు. అంతిమంగా, మన రక్షణ దేవుని విశ్వసనీయతపై ఆధారపడి ఉంటుంది. మన రక్షణ హామీ గురించి, *"నా గొర్రెలు నా స్వరము వినును, నేను వాటి నెరుగుదును, అవి నన్ను వెంబడించును. నేను వాటికి నిత్యజీవము నిచ్చుచున్నాను గనుక అవి ఎన్నటికిని నశింపవు, ఎవడును వాటిని నా చేతిలోనుండి అపహరింపడు"* అనే అమూల్యమైన మాటలను యేసు చెప్పారు (యోహాను 10:27-28). అంతేకాకుండా, యేసు తన ప్రధాన యాజక ప్రార్థనలో మన సంరక్షణ కోసం కూడా ప్రార్థించారు: *"నేనికను లోకములో ఉండను గాని వీరు లోకములో ఉన్నారు; నేను నీయొద్దకు వచ్చుచున్నాను. పరిశుద్ధుడవైన తండ్రీ, మనము ఏకమై యున్నలాగున వారును ఏకమై యుండునట్లు నీవు నాకు అనుగ్రహించిన నీ నామమందు వారిని కాపాడుము"* (యోహాను 17:11).

***వారిని క్రమశిక్షణలో ఉంచడంలో.*** దేవుని విశ్వసనీయత మనలను సంరక్షించడంలో మాత్రమే కాకుండా, ఆయన మనలను క్రమశిక్షణలో ఉంచడంలో కూడా కనిపిస్తుంది. దేవుడు క్రమశిక్షణలో పెడుతున్నప్పుడు దానిని సహించమని హెబ్రీ 12:4-11 మనల్ని ప్రోత్సహిస్తుంది. దేవునిచే క్రమశిక్షణ పొందడం (లేదా శిక్ష పొందడం) మనం ఆయన నిజమైన పిల్లలమని రుజువు చేయడమేనని, నమ్మకమైన దేవుడు మీరు మరింత ఎక్కువగా తన కుమారుని పోలి ఉండేలా చేయడానికి అలా చేస్తారని రచయిత చెప్పాడు. ఈ సత్యాన్ని తెలియజేసే వాక్యభాగాలు ఇక్కడ ఉన్నాయి:

> ***హెబ్రీ 12:7-8, 10-11 -*** *శిక్షాఫలము పొందుటకై మీరు సహించుచున్నారు; దేవుడు కుమారులనుగా మిమ్మును చూచుచున్నాడు. తండ్రి శిక్షింపని కుమారుడెవడు? కుమాళ్లయినవారందరు శిక్షలో పాలుపొందుచున్నారు, మీరు పొందనియెడల దుర్బీజులేగాని కుమారులు కారు. ... మనము తన పరిశుద్ధతలో పాలుపొందవలెనని మన మేలుకొరకే ఆయన శిక్షించుచున్నాడు. మరియు ప్రస్తుతమందు సమస్తశిక్షయు దుఃఖకరముగా కనబడునేగాని సంతోషకరముగా కనబడదు. అయినను దానియందు అభ్యాసము కలిగినవారికి అది నీతియను సమాధానకరమైన ఫలమిచ్చును.*

క్రమశిక్షణ పొందుతున్నప్పుడు కీర్తనకర్త ఈ మాటలు చెప్పడంలో ఆశ్చర్యం లేదు, *"యెహోవా, నీ తీర్పులు న్యాయమైనవనియు విశ్వాస్యతగలవాడవై నీవు నన్ను శ్రమపరచితివనియు నేనెరుగుదును"* (కీర్తన 119:75). నమ్మదగిన దేవుడు మనల్ని మరింత పవిత్రంగా చేయడానికి అవసరమైన దానిని అది బాధాకరంగా ఉన్నప్పటికీ చేస్తారు.

***వారిని మహిమపరచడంలో***. మనలను సంరక్షించడంలో, క్రమశిక్షణలో ఉంచడంలో మాత్రమే కాకుండా మనల్ని క్రీస్తులా చేసే అంతిమ మహిమలో కూడా దేవుని విశ్వసనీయత కనబడుతుంది. *"ఎవరిని ముందుగా నిర్ణయించెనో వారిని పిలిచెను; ఎవరిని పిలిచెనో వారిని నీతిమంతులుగా తీర్చెను; ఎవరిని నీతిమంతులుగా తీర్చెనో వారిని మహిమపరచెను"* అని రోమా 8:30లో మనకు వాగ్దానం ఉంది. "వారిని మహిమపరచెను" అనేది ఇంకా జరగాల్సి ఉన్నప్పటికీ జరిగిపోయినట్లుగా ఇక్కడ కనిపిస్తుందని గమనించండి. దీని అర్థం ఏమిటని మీరు అడగవచ్చు? దేవుని దృష్టిలో, మనల్ని మహిమపరచడం పూర్తి అయిన ఒక ఒప్పందం. అందుకే ఇది భూతకాలంలో ఉంది. అందుకే నమ్మదగిన దేవుడు తన వాగ్దానాలను నిలబెట్టుకుంటాడని మనం ఎంతగానో విశ్వసించగలం. ఫిలిప్పీ 1:6లో పౌలు "మీలో ఈ సత్క్రియ నారంభించినవాడు యేసుక్రీస్తు దినమువరకు దానిని కొనసాగించునని రూఢిగా నమ్ముచున్నాను" అని రాయడంలో ఏ ఆశ్చర్యం లేదు.

1 థెస్సలో 5:23-24లో చెప్పినట్లుగా మహిమపరచడం గురించి మనకున్న వాగ్దానాలన్నీ దేవుని విశ్వసనీయతపై ఆధారపడి ఉన్నాయి, *"సమాధానకర్తయగు దేవుడే మిమ్మును సంపూర్ణముగా పరిశుద్ధపరచును గాక. మీ ఆత్మయు, జీవమును శరీరమును మన ప్రభువైన యేసుక్రీస్తు రాకడయందు నిందారహితముగాను, సంపూర్ణముగాను ఉండునట్లు కాపాడబడును గాక. మిమ్మును పిలుచువాడు నమ్మకమైనవాడు గనుక ఆలాగు చేయును."* తీవ్ర బాధల మధ్యలో కూడా పౌలును మహిమపరచడంలోని దేవుని విశ్వసనీయత వల్ల అతడు, *"ఆ హేతువుచేత ఈ శ్రమలను అనుభవించుచున్నాను గాని, నేను నమ్మినవాని ఎరుగుదును గనుక సిగ్గుపడను; నేను ఆయనకు అప్పగించినదానిని రాబోవుచున్న ఆ దినమువరకు ఆయన కాపాడగలడని రూఢిగా నమ్ముకొనుచున్నాను"* అని నమ్మకంగా చెప్పగలిగాడు (2తిమోతి 1:12).

కాబట్టి, సంరక్షించడం, క్రమశిక్షణ ఇవ్వడం, అంతిమంగా మనల్ని మహిమపరచడం అనే ఈ మూడు అంశాలను బట్టి ఆయన పిల్లలమైన మన పట్ల దేవుని విశ్వసనీయతను మనం చూస్తాము. ఈ సత్యాలు వల్ల మనం చీకటి సమయాలలో ఎలాంటి సణుగుడు లేకుండా విడువక దేవుణ్ణి విశ్వసించగలము. మనం విశ్వాసంలో పట్టుదలతో ఉండి ఆందోళన నుండి విడుదల పొందాలి. విశ్వాసులైన పురుషులు స్త్రీలు అదే చేసారని హెబ్రీ 11లో వివరించారు. వారు నిరాశ చెందలేదు. దేవుడు మనకు చేసిన వాగ్దానాలన్నిటినీ నెరవేర్చడంలో నమ్మదగినవాడు కాబట్టి చివరిలో మనం నిరాశ చెందము.

పాపంతో పోరాడుతున్నప్పుడు, తీవ్రమైన ప్రలోభాలకు గురైనప్పుడు కూడా మనం నిరాశ చెందాల్సిన అవసరం లేదు. *"సాధారణముగా మనుష్యులకు కలుగు శోధనతప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు; మీరు సహింపగలిగినంతకంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు, సహింపగలుగుటకు ఆయన శోధనతోకూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును"* అని 1 కొరింథీ 10:13లో మనకు తెలియజేసారు. దేవుడు "తప్పించుకొను మార్గమును కలుగజేయును" అని పౌలు చెప్పిన దానికి అర్థం మనం తప్పనిసరిగా శోధనల నుండి తప్పించుకుంటామని కాదు కానీ మనం ఆయనపై విశ్వాసం ఉంచినంత కాలం శోధనలకు పడిపోకుండా తీవ్రమైన కష్టాలు ఎదురైనప్పటికి వాటిని తట్టుకోగల శక్తిని ఈ నమ్మకమైన దేవుడు మనకు ఇస్తారని మనం నమ్మవచ్చునని అతని ఉద్దేశం. కొన్నిసార్లు, దాని పర్యవసానం మరణమే అయినప్పటికీ, దేవుడు మనల్ని బలపరచడానికి ఇప్పటికీ నమ్మకంగా ఉన్నారు, తద్వారా మనం చివరి వరకు ఆయనను ఎప్పటికీ తిరస్కరించము!

*"నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను"* అని (హెబ్రీ 13:5) ఈ నమ్మదగిన దేవుడు మనకు వాగ్దానం చేసిన విషయాన్ని మరచిపోకూడదు. అంతం వరకు మనతో ఉంటానని యేసు వాగ్దానం చేసారు, "ఇదిగో నేను యుగసమాప్తివరకు సదాకాలము మీతోకూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:20) దేవుని వాగ్దానాన్ని అంగీకరించి ఆయన వాగ్దానం చేసినది నెరవేరడానికి ఆయనపై ఆధారపడడమే విశ్వాసం ఎందుకంటే అసాధ్యమనిపించే పరిస్థితులలో కూడా ఆయన తన వాగ్దానాలన్నింటినీ నిలబెట్టుకునే నమ్మకమైన దేవుడు కాబట్టి. పాత నిబంధన ప్రవక్త హబక్కూకు అదే పని చేశాడు దాని ఫలితంగా అతని హృదయంలో ఆనందాన్ని అనుభవించాడు: "అంజూరపు చెట్లు పూయకుండినను ద్రాక్షచెట్లు ఫలింపకపోయినను ఒలీవచెట్లు కాపులేకయుండినను చేనిలోని పైరు పంటకు రాకపోయినను గొర్రెలు దొడ్డిలో లేకపోయినను సాలలో పశువులు లేకపోయినను నేను యెహోవాయందు ఆనందించెదను నా రక్షణకర్తయైన నా దేవునియందు నేను సంతోషించెదను" (హబక్కుకు 3:17-18).

ప్రియ క్రైస్తవులారా, మీరు కష్టసమయాన్ని అనుభవిస్తున్నారా? ఒక రోజు గడపడం చాలా కష్టంగా అనిపిస్తోందా? నిరాశ పడవద్దు. హబక్కూకులాగే పరిస్థితులు నిరాశాజనకంగా కనిపించినా, ఈ నమ్మకమైన దేవుణ్ణి నమ్మండి.

ఆయన మిమ్మల్ని అంతం వరకు తీసుకువెళ్తారు. నిరాశపడకుండా విశ్వాసంతో ముందుకు సాగండి! ఆయన యెషయా 46:4లో *"ముదిమి వచ్చువరకు నిన్ను ఎత్తికొనువాడను నేనే తల వెంట్రుకలు నెరయువరకు నిన్ను ఎత్తికొనువాడను నేనే. నేనే చేసియున్నాను చంకపెట్టుకొనువాడను నేనే నిన్ను ఎత్తికొనుచు రక్షించువాడను నేనే"* అని వాగ్దానం చేశారు.

## 2. తన శత్రువుల జీవితాల్లో దేవుని విశ్వసనీయత

దేవుడు తన పిల్లలకు చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో నమ్మదగినవానిగా ఉన్నట్లే, ఆయనను తిరస్కరించి ఆయనకు శత్రువులుగా ఉండిపోయే వారికి తీర్పు తీరుస్తాననే వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో కూడా ఆయన అంతే నమ్మదగినవాడు. మరో మాటలో చెప్పాలంటే, రక్షకునిగాను న్యాయాధిపతిగాను ఆయన నమ్మదగినవాడు. దేవుని గత తీర్పులు తనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసేవారికి తీర్పు తీర్చడంలో ఆయన విశ్వసనీయతను నిస్సందేహంగా రుజువు చేస్తాయి. నోవహు కాలంలో పశ్చాత్తాపపడని లోకాన్నంతా సార్వత్రిక జలప్రళయంతో నాశనం చేశారు (ఆది 6-8). దేవుని దృష్టిలో కృప పొందిన నోవహు, అతని కుటుంబం తప్ప మరెవరూ బ్రతకలేదు. అదే విధంగా, అరణ్య ప్రయాణంలో దేవుడు వాగ్దాన దేశానికి తమను తీసుకువెళ్తారని విశ్వసించడంలో విఫలమైన అవిశ్వాసులకు ఆయన తీర్పు తీర్చారు (సంఖ్యా 14:26-34, హెబ్రీ 3:15-19). తీర్పు తీరుస్తానన్న వాగ్దానాన్ని నిలబెట్టుకుని దేవుడు గతంలో తన విశ్వసనీయతను చూపించారు కాబట్టి, భవిష్యత్తులో కూడా ఆయన నమ్మదగినవానిగా ఉంటారని మనం ఖచ్చితంగా చెప్పవచ్చు!

తమ పాపాలను విడిచిపెట్టి, యేసుక్రీస్తుపై విశ్వాసం ఉంచడంలో విఫలమైన వారందరికీ రాబోయే తీర్పు అగ్ని గుండం లేదా నరకాగ్నియే అని దేవుడు వాగ్దానం చేశారు. "ఎవని పేరైనను జీవగ్రంథమందు వ్రాయబడినట్టు కనబడనియెడల వాడు అగ్నిగుండములో పడవేయబడెను" అని ప్రకటన 20:15లో ఉంది. *"ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతోకూడ పరలోకమునుండి అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై, దేవుని నెరుగనివారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతి దండన చేయునప్పుడు ... అట్టివారు ఆయన సముఖము నుండియు ఆయన ప్రభావమందలి మహిమనుండియు పారదోలబడి, నిత్యనాశనమను దండన పొందుదురు"* (2 థెస్సలో 1:7-9).

మీరు ఆయనకు బిడ్డలుగా కాకుండా శత్రువుగా ఉంటే, తన తీర్పు వాగ్దానాలను నిలబెట్టుకోవడంలోని దేవుని విశ్వసనీయతకు మీ స్పందన ఏమిటి?

మొదటిగా మీ సృష్టికర్తకు వ్యతిరేకంగా మీరు పాపం చేశారని చూడగలిగేలా మీ కళ్ళు తెరవమని దేవుణ్ణి అడగండి. తర్వాత మీరు పాపం చేశారని, దానికి తగిన శిక్షకు పాత్రులమని ఆయన ఎదుట అంగీకరించండి. ఎలాంటి సాకులు చెప్పకండి. "ప్రభువా, నేను మీకు వ్యతిరేకంగా పాపం చేశాను. నేను దోషిని" అని స్పష్టంగా అంగీకరించండి. చేసిన పాపాలను బట్టి బాధపడుతున్నానని, ఈ పాప జీవితం నుండి బయటపడాలనుకుంటున్నారని ఆయనతో చెప్పండి. దానినే బైబిలులో "పశ్చాత్తాపం" అంటారు. కానీ అది ఒక్కటే సరిపోదు. యేసు క్రీస్తు ద్వారా దేవుడు అందించే క్షమాపణను మీరు విశ్వాసంతో అంగీకరించాలి, యేసు పరిపూర్ణమైన జీవితాన్ని గడిపి, సిలువపై మరణించి సజీవంగా తిరిగి లేచి పాపాలన్నింటికి విమోచనా క్రయధనాన్ని చెల్లించారని నమ్మాలి. ఆ విధంగా మీరు మీ పాపాల నుండి, దేవుని ఉగ్రత నుండి రక్షణ పొందవచ్చు. అలాగే మీరు ఆయన బిడ్డగా అవుతారు (యోహాను 1:12).

"ప్రభువు నామమును బట్టి ప్రార్థనచేయు వాడెవడో వాడు రక్షింపబడును" (రోమా 10:13) అని బైబిలు వాగ్దానం చేస్తుంది. ఆయనకు ప్రార్థన చేయండి. యేసును మీ ప్రభువుగా రక్షకునిగా స్వీకరించండి. మునగడం ద్వారా నీటి బాప్తిస్మంతో బహిరంగంగా సాక్ష్యమివ్వడం ద్వారా మీ పశ్చాత్తాపాన్ని విశ్వాసాన్ని అనుసరించండి (అపొ. కా 8:36-38). మీరు దేవుని బిడ్డగా మారిన తర్వాత విధేయతలోని మొదటి మెట్టు బాప్తిస్మం (అపొ. కా 2:41).

తమ పాపాల భారాన్ని అపరాధాల భారాన్ని మోస్తున్న వారందరినీ తన దగ్గరకు రమ్మని యేసు పిలుస్తున్నారు: "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును" (మత్తయి 11:28). ఆయన దగ్గరకు రావాలనుకునే వారికి ఆయన ఇచ్చే వాగ్దానం ఇదే: "నాయొద్దకు వచ్చువానిని నేనెంతమాత్రమును బయటికి త్రోసివేయను" (యోహాను 6:37). యేసు తన వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో నమ్మకంగా ఉన్నారు. ఆయన నమ్మదగినవాడు. వచ్చి ఆయన క్షమాపణను పొందండి. క్రీస్తు దగ్గరకు రాకుండా ఏదీ ఎవరూ మీకు అడ్డురానివ్వకండి. యేసు దగ్గరకు రావడానికన్నా యేసు నుండి దూరంగా ఉన్నందుకే అధిక మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. మీరు యేసుతో ఏకమై ఉండడానికి మీ

జీవితాన్ని లేదా సమస్తాన్ని వదులుకోవలసి వచ్చినా సరే అది మంచిదే. అంతిమంగా మీరు విడిచిపెట్టిన వాటన్నిటి కంటే విలువైన నిజమైన శాశ్వత నిధియైన యేసును మీరు కనుగొంటారు.

మిత్రమా, ఈ నమ్మకమైన దేవుడే క్షమించే దేవుడని అర్థం చేసుకోండి. ఆయన కుమారుడైన యేసు రక్తంతో మీ పాపాలను కడిగివేసుకోండి. యేసు దగ్గరకు రమ్మని హృదయపూర్వకంగా నేను మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. న్యాయాధిపతిగా కాకుండా రక్షకునిగా ఉన్నప్పుడే ఆయనను కలుసుకోండి. రాబోయే తీర్పు నుండి తప్పించుకోండి. మీరు ఎంత ఘోర పాపం చేసినా, ఎంత గందరగోళంలో ఉన్నా మీరు యేసులో నిజమైన సమాధానాన్ని విశ్రాంతిని పొందవచ్చు. మీరు యేసు దగ్గరకు వచ్చిన తర్వాత దేవుని ఇతర పిల్లలతో పాటు మీరు కూడా "యెహోవా, నీ కృప ఆకాశము నంటుచున్నది నీ సత్యసంధత్వము అంతరిక్షము నంటుచున్నది" (కీర్తన 36:5) అని దావీదులా చెప్పవచ్చు.

## చర్చా ప్రశ్నలు

1. ఈ అధ్యాయం దేవుని విశ్వసనీయత గురించి మీ దృక్కోణాన్ని ఎలా ప్రభావితం చేసింది?
2. దేవుని ఈ లక్షణాన్ని బట్టి మీరు జీవితంలో ఎలాంటి మార్పులు చేసుకుంటారు?
3. దేవుని ఈ లక్షణం మీ ప్రార్థనలను ఎలా ప్రభావితం చేస్తుంది?
4. దేవుని ఈ లక్షణం మీ సువార్త ప్రచారాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

## ధ్యానించవలసిన /కంఠత చేయవలసిన వాక్యం

***కీర్తనలు 89:8 –*** *యెహోవా, సైన్యములకధిపతివగు దేవా, యెహోవా, నీవంటి బలాఢ్యుడెవడు? నీ విశ్వాస్యతచేత నీవు ఆవరింపబడియున్నావు.*

## ప్రార్థన

దయగల దేవా, ప్రేమగల తండ్రీ, తమ వాగ్దానాలను నిలబెట్టుకోలేని ప్రజలున్న ఈ లోకంలో మీ వాగ్దానాలన్నింటినీ నిలబెట్టుకునే నమ్మకమైన దేవుడవని నేను మిమ్మల్ని స్తుతిస్తున్నాను. నేను గాఢాంధకార లోయ గుండా వెళ్తున్నప్పుడు కూడా మీ విశ్వసనీయతను గుర్తుంచుకోవడానికి నాకు సహాయం చేయండి. ఎప్పుడూ నాతో ఉంటానని మీరు వాగ్దానం చేశారు. మీరు నాతో లేరని నాకు అనిపించినా సరే విశ్వాసంతో మీ మాటను అంగీకరించడానికి నాకు సహాయం చేయండి. నాలో మంచి పనిని ప్రారంభించిన మీరే ఏదో ఒక రోజు దాన్ని పూర్తి చేస్తారని నమ్మేలా నా హృదయాన్ని బలపరచండి. ఇతరులకు చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో నేను మిమ్మల్ని అనుకరించేలా నా హృదయాన్ని కదిలించండి. విశ్వసనీయతతో గుర్తింపు పొందేలా నాకు సహాయం చెయ్యండి. ఆమెన్!

## లక్షణం 10: దేవుని సార్వభౌమాధికారము

*దేవుని సార్వభౌమాధికారం అంటే జీవితంలోని అన్ని సంఘటనలపై ఆయనకు సంపూర్ణ నియంత్రణ ఉండటం, పరిశుద్ధ గ్రంథంలో ప్రత్యక్షమైన ఆయన చిత్తానికి వ్యతిరేకంగా జరిగే పనులు, వాటి వెనుక ఉన్న కారణాలు ఆయనకు మాత్రమే తెలుసు*

దేవుని సార్వభౌమాధికారం గురించి క్రైస్తవుని ఆలోచన ఎలా ఉండాలనే దానికి ఈ క్రింది కథ గొప్ప ఉదాహరణ:

*1902వ సంవత్సరంలో, ఒక బ్రిటీష్ పిల్లవాడు తన ఇంటిలో టిఫిన్ చేయడానికి వచ్చినప్పుడు బ్రిటన్‌లో 64 సంవత్సరాల తర్వాత జరిగిన మొదటి పట్టాభిషేకానికి సంబంధించిన వార్తలు ప్రచురించిన వార్తాపత్రికను తన తండ్రి చదువుతుండడం చూశాడు. టిఫిన్ చేస్తూ మధ్యలో తండ్రి తన భార్య వైపు తిరిగి, "ఇది చదివి నాకు చాలా బాధగా ఉంది" అన్నాడు.*

*ఆమె, "ఎందుకు?" అని అడిగింది.*

*అందుకతడు, "వెస్ట్‌మిన్‌స్టర్‌లో ఫలానా తేదీన ప్రిన్స్ ఎడ్వర్డ్‌ను రాజుగా పట్టాభిషేకం చేస్తారని ఇక్కడ ఒక ప్రకటన ఉంది కాని దానిలో డియో వోలెంటే అంటే దేవుని చిత్తమైతే అని లేదు" అని జవాబిచ్చాడు.*

*ఆ తేదీ నాటికి భవిష్యత్ ఎడ్వర్డ్ VII కు అపెండిసైటిస్ వల్ల అనారోగ్యం కలిగిన కారణంగా పట్టాభిషేకం వాయిదా వేయవలసి వచ్చిందనే మాటలు ఆ చిన్న పిల్లవాడి మనస్సులో నిలిచిపోయాయి. క్వీన్ విక్టోరియా పాలన ముగింపు కాలానికి బ్రిటిష్ సామ్రాజ్యం రాజకీయంగా, ఆర్థికంగా, సైనికంగా అత్యున్నత స్థాయికి చేరుకుంది.*

*అయినప్పటికీ, గ్రేట్ బ్రిటన్ తనకున్న గొప్ప శక్తితో ప్రణాళిక ప్రకారం అనుకున్న తేదీన పట్టాభిషేకాన్ని నిర్వహించలేకపోయింది. ప్రకటనలో "దేవుని చిత్తమైతే" అనే పదాన్ని విస్మరించడం, పట్టాభిషేకం వాయిదా పడడం కేవలం యాదృచ్ఛికంగా జరిగిందా, రెండు సంఘటనలు ఒకదానికొకటి ఏమైనా సంబంధం కలిగి ఉన్నాయా? లేదా దేవుడు ప్రిన్స్ ఎడ్వర్డ్‌కు అపెండిసైటిస్ వచ్చేలా చేసి అంతా ఆయన "నియంత్రణలోనే" ఉందని చూపించారా?*

*ఆ పరిస్థితి ఎందుకు వచ్చిందో మనకు తెలియదు. ఏది ఏమైనప్పటికీ, మనకు తెలిసిన విషయం ఏమిటంటే: మనం దానిని డియో వోలెంటే అంటే దేవుని చిత్తంగా అంగీకరించినా అంగీకరించకపోయినా దేవుని చిత్తానికి వ్యతిరేకంగా మనం ఏ ప్రణాళికను అమలు చేయలేము. అన్నీ దేవుని నియంత్రణలో ఉన్నాయి; ఆయన సార్వభౌముడనే వాస్తవం గురించి బైబిలులో ఎటువంటి సందేహం లేదు. ఆయన తన చిత్తాన్నే చేస్తారు; మనం అనుకున్నది చేయగలమో లేదో కూడా ఆయనే నిర్ణయిస్తారు. ఆయన కోరుకున్నట్లు చేయడానికి ఆయనకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఉంది. ఆయన చేసిన సమస్త సృష్టిలోని కార్యాలన్నింటిపై ఆయనకు సంపూర్ణ నియంత్రణ ఉంది. ఇదే దేవుని సార్వభౌమాధికారంలోని సారాంశం. ఏ జీవి, ఏ వ్యక్తి లేదా ఏ సామ్రాజ్యం కూడా ఆయన సంకల్పాన్ని అడ్డుకోలేవు లేదా ఆయన చిత్తాన్ని మించి పనిచేయవు.*

ఆర్థర్ పింక్ ఈ విషయాన్ని చాలా చక్కగా చెప్పాడు: "దేవుడు సార్వభౌమాధికారి అని మనం చెప్పినప్పుడు, తన చిత్తప్రకారం తన మహిమ కోసం సృష్టించిన విశ్వాన్ని పరిపాలించే ఆయన హక్కును ధృవీకరిస్తాము. ఆయన హక్కు మట్టిపై కుమ్మరికుండే హక్కు వంటిదని మనం ధృవీకరిస్తున్నాము. దేవుడే ఒక చట్టం కాబట్టి తన

ఇష్టానికి స్వభావానికి మించిన ఏ నియమం క్రింద లేదా చట్టం కింద ఆయన లేడని, ఆయన ఎవరికి జవాబు చెప్పవలసిన అవసరం లేదని మనం ధృవీకరిస్తున్నాము. అవును, జీవితానికి సంబంధించిన అన్ని సంఘటనలపై, వెల్లడియైన దేవుని చిత్తానికి విరుద్ధంగా ఉన్న చర్యలకు, ఆయనకు మాత్రమే తెలిసిన కారణాలతో సహా అన్నింటిపై ఆయనకు పూర్తి నియంత్రణ ఉంది. ఆయనకున్న గొప్ప జ్ఞానంతో తన మంచి ఉద్దేశాలను నెరవేర్చడానికి మనుషులు దెయ్యాలు చేసే చెడు కార్యాలను కూడా ఆయన ఉపయోగించుకొంటారు.

దేవుని సార్వభౌమాధికారం గురించి మనకు బోధించే కొన్ని లేఖనభాగాలు.

> ***ఆది 50:20 -*** *మీరు నాకు కీడుచేయనుద్దేశించితిరిగాని నేటిదినమున జరుగుచున్నట్లు, అనగా బహు ప్రజలను బ్రదికించునట్లుగా అది మేలుకే దేవుడు ఉద్దేశించెను.*

> ***యెషయా 46:9-10 -*** *చాలా పూర్వమున జరిగినవాటిని జ్ఞాపకము చేసికొనుడి. దేవుడను నేనే మరి ఏ దేవుడును లేడు. నేను దేవుడను నన్ను పోలినవాడెవడును లేడు. నా ఆలోచన నిలుచుననియు నా చిత్తమంతయు నెరవేర్చుకొనెదననియు చెప్పుకొనుచు ఆదినుండి నేనే కలుగబోవువాటిని తెలియజేయుచున్నాను. పూర్వకాలమునుండి నేనే యింక జరుగనివాటిని తెలియజేయుచున్నాను.*

> ***యోబు 42:2 -*** *నీవు సమస్తక్రియలను చేయగలవనియు నీవు ఉద్దేశించినది ఏదియు నిష్ఫలము కానేరదనియు నేనిప్పుడు తెలిసికొంటిని.*

> ***కీర్తన 115:3 -*** *మా దేవుడు ఆకాశమందున్నాడు తన కిచ్ఛవచ్చినట్లుగా సమస్తమును ఆయన చేయుచున్నాడు.*

> ***సామెతలు 19:21 -*** *నరుని హృదయములో ఆలోచనలు అనేకములుగా పుట్టును యెహోవా యొక్క తీర్మానమే స్థిరము.*

> ***సామెతలు 21:30 -*** *యెహోవాకు విరోధమైన జ్ఞానమైనను వివేచనయైనను ఆలోచనయైనను నిలువదు.*

> ***విలాప 3:37 -*** *ప్రభువు సెలవులేనిది మాట యిచ్చి నెరవేర్చగలవాడెవడు?*

దేవుడు “తన చిత్తానుసారముగా చేసిన నిర్ణయముచొప్పున సమస్తకార్యములను జరిగించుచున్నాడు” అని పౌలు చెప్పాడు (ఎఫెసీ 11:1). సార్వభౌమాధికారం గురించి క్లుప్తంగా చెప్పాలంటే: దేవుడు తన చిత్తప్రకారం తనకు ఇష్టమైన రీతిగా ప్రతిదీ చేస్తారు. దేవుడు ఎప్పుడూ పాపానికి కర్త కాదు (హబక్కూకు 1:13; యాకోబు 1:13). అయినప్పటికీ, తన సార్వభౌమత్వానికి అనుగుణంగా, ఆయన తన పరిశుద్ధ స్వభావానికి రాజీ పడకుండా మహిమాన్వితమైన తన మంచి ఉద్దేశాలను (ఆది 50:20) సాధించడానికి జరిగే చెడును కూడా ఉపయోగిస్తారు. ఆయన దీన్ని ఎలా చేయగలరనేది మన పరిమిత మేధస్సు ఎప్పటికీ పూర్తిగా అర్థం చేసుకోలేని రహస్యం. చెడు జరిగినప్పుడు కూడా సమస్తం ఎప్పుడూ దేవుని నియంత్రణలోనే ఉంటుందనే సత్యాన్ని తెలియజేసే లేఖనభాగాలు:

> ***నిర్గమ 4:11 –*** *యెహోవా–మానవునకు నోరిచ్చినవాడు ఎవడు? మూగ వానినేగాని చెవిటివానినేగాని దృష్టిగలవానినేగాని గ్రుడ్డి వానినేగాని పుట్టించినవాడెవడు? యెహోవానైన నేనే గదా.*

> ***ద్వితీయో 32:39 –*** *ఇదిగో నేను నేనే దేవుడను నేను తప్ప వేరొక దేవుడు లేడు. మృతినొందించువాడను బ్రదికించువాడను నేనే గాయపరచువాడను స్వస్థపరచువాడను నేనే నా చేతిలోనుండి విడిపించువాడెవడును లేడు.*

> ***యోబు 2:10 -*** *అందుకతడు–మూర్ఖురాలు మాటలాడునట్లు నీవు మాటలాడుచున్నావు; మనము దేవునివలన మేలు అనుభవించుదుమా, కీడును మనము అనుభవింప తగదా అనెను. ఈ సంగతులలో ఏ విషయమందును యోబు నోటిమాటతోనైనను పాపము చేయలేదు.*

> ***యెషయా 45:7 –*** *నేను వెలుగును సృజించువాడను అంధకారమును కలుగజేయువాడను సమాధానకర్తను కీడును కలుగజేయువాడను నేనే. యెహోవా అను నేనే వీటినన్నిటిని కలుగజేయు వాడను.*

> ***విలాప 3:37-38 -*** *ప్రభువు సెలవులేనిది మాట యిచ్చి నెరవేర్చగలవాడెవడు? మహోన్నతుడైన దేవుని నోటనుండి కీడును మేలును బయలు వెళ్లునుగదా?*

ఇతరులను స్వస్థపరచడానికి దేవుడు ఉపయోగించిన ఎలీషా ఒక వ్యాధితో మరణించాడని గమనించడం కూడా ఆసక్తికరంగా ఉంది.

> ***2 రాజులు 13:14 -*** *అంతట ఎలీషా మరణకరమైన రోగముచేత పీడితుడై యుండగా ఇశ్రాయేలురాజైన యెహోయాషు అతని యొద్దకు వచ్చి అతని చూచి కన్నీరు విడుచుచు–నా తండ్రీ నా తండ్రీ, ఇశ్రాయేలువారికి రథమును రౌతులును నీవే అని యేడ్చెను.*

మంచి చెడుతో సహా అన్ని విషయాలలో దేవుడే సార్వభౌమాధికారి అని పై లేఖనాల నుండి మనం స్పష్టంగా చూడవచ్చు.

దేవుని సార్వభౌమాధికారానికి సంబంధించిన కొన్ని ఆచరణాత్మక భావనలు ఏమిటి? వాటిలో నాలుగు భావనలు:

## 1. ఇది విశ్వంలోనే సర్వోన్నతునిగా దేవుడిని గౌరవిస్తుంది

మరో మాటలో చెప్పాలంటే, ఈ లక్షణం దేవుణ్ణి దేవుడని అంగీకరిస్తుంది! ప్రతిదానిపై రాజుగా పరిపాలించే ఆయన హక్కును అంగీకరిస్తుంది. ఆయనే సృష్టికర్త అని, మనము సృష్టించబడ్డామని గుర్తుచేస్తుంది. దేవునికి మన అవసరం లేదు కాని తదుపరి శ్వాస కోసం మనకు ఆయన అవసరం ఉంది!

*"యెహోవాను నేనే; ఇదే నా నామము మరి ఎవనికిని నా మహిమను నేనిచ్చువాడను కాను నాకు రావలసిన స్తోత్రమును విగ్రహములకు చెందనియ్యను"* (యెషయా 42:8) అని యెషయా ప్రవక్త ద్వారా దేవుడు మనతో చెప్పారు. దేవుని సంపూర్ణ సార్వభౌమత్వాన్ని అంగీకరించి మనం ఆయనకు పూర్తి మహిమను చెల్లిస్తాము. ఎందుకంటే దేవుని మహిమపరచడానికే మనం సృష్టించబడ్డాము: *"నా మహిమ నిమిత్తము నేను సృజించినవారిని నా నామము పెట్టబడిన వారినందరిని తెప్పించుము. నేనే వారిని కలుగజేసితిని వారిని పుట్టించినవాడను నేనే"* (యెషయా 43:7) కాబట్టి, అన్ని విషయాలపై ఆయన సార్వభౌమత్వాన్ని అంగీకరించి విశ్వంలో సర్వోన్నతునిగా దేవునికి సరైన స్థానాన్ని ఇద్దాం!

## 2. మనం వినయంగా ఉండేలా చేస్తుంది

దేవుడు ఎప్పుడూ వినయం కలిగిన హృదయాన్ని చూస్తారు కాబట్టి, "అన్నింటికీ కర్త మనం కాదు దేవుడే" అని నిత్యం అంగీకరించడం కంటే వినయపూర్వకమైన విషయం మరొకటి ఉండదు. ఈ సత్యం దేవుని గురించి ఆయన మన కోసం చేసిన దాని గురించి గొప్పగా చెప్తుంది!

ఇప్పటి వరకు ప్రపంచాన్ని పరిపాలించిన అత్యంత శక్తివంతమైన రాజులలో ఒకడైన నెబుకద్నెజరు, సార్వభౌమాధికారియైన దేవుడు మనిషి గర్వాన్ని ఎలా తగ్గించాగలరో కష్టతరమైన మార్గంలో నేర్చుకున్నాడు. అతడు తాను సాధించిన విజయాల గురించి ప్రగల్భాలు పలుకుతూ దేవునికి మహిమ ఇవ్వకుండా అతని గర్వం అతని హృదయాన్ని మోసం చేసింది: *"రాజు–బబులోనను ఈ మహా విశాలపట్టణము నా బలాధికారమును నా ప్రభావఘనతను కనపరచుటకై నా రాజధాని నగరముగా నేను కట్టించినది కాదా అని తనలో తాననుకొనెను"* (దానియేలు 4:30) దేవుడు తాను కేవలం మానవుడను కాదు అన్ని విషయాలపై సార్వభౌమాధికారం కలిగిన వాడనని అతనికి గుర్తు చేసి తీర్పు తీర్చి అతనిని ఎలా తగ్గించారో గమనించండి. *"రాజు నోట ఈ మాట యుండగా ఆకాశమునుండి యొక శబ్దము వచ్చెను, ఏదనగా–రాజగు నెబుకద్నెజరూ, యిదే నీకు ప్రకటన– నీ రాజ్యము నీయొద్దనుండి తొలగిపోయెను. తమయొద్ద నుండి మనుష్యులు నిన్ను తరిమెదరు; నీవు అడవిజంతువులమధ్య నివాసము చేయుచు పశువులవలె గడ్డి మేసెదవు; సర్వోన్నతుడగు దేవుడు మానవుల రాజ్యముపైన అధికారి యైయుండి, తానెవనికి దాని అనుగ్రహింప నిశ్చయించునో వానికి అనుగ్రహించునని నీవు తెలిసికొనువరకు ఏడు కాలములు నీకీలాగు జరుగునని చెప్పెను"* (దానియేలు 4:31-32).

చివరకు నెబుకద్నెజరు తనను తాను తగ్గించుకుని దేవుడే సార్వభౌమాధికారని అంగీకరించాడు: *"ఆ కాలము గడచిన పిమ్మట నెబుకద్నెజరను నేను మరల మానవబుద్ధిగలవాడనై నా కండ్లు ఆకాశముతట్టు ఎత్తి, చిరంజీవియు సర్వోన్నతుడునగు దేవుని స్తోత్రముచేసి ఘనపరచి స్తుతించితిని; ఆయన ఆధిపత్యము చిరకాలమువరకు ఆయన రాజ్యము తరతరములకు నున్నవి. భూనివాసులందరు ఆయన దృష్టికి ఎన్నికకు రానివారు; ఆయన పరలోక సేనయెడలను భూనివాసులయెడలను తన చిత్తము చొప్పున జరిగించువాడు; ఆయన చేయి పట్టుకొని నీవేమి చేయుచున్నావని ఆయనతో చెప్పుటకు ఎవడును సమర్థుడుకాడు. ... ఈలాగు నెబుకద్నెజరను నేను పరలోకపు రాజుయొక్క కార్యములన్నియు సత్యములును, ఆయన మార్గములు న్యాయములునై యున్నవనియు, గర్వముతో నటించు వారిని ఆయన అణపశక్తుడనియు, ఆయనను స్తుతించుచుకొనియాడుచు ఘనపరచుచునున్నాను"* (దానియేలు 4:34-35, 37).

దేవుని సార్వభౌమాధికారం యొక్క ఈ సిద్ధాంతాన్ని మనం ఎంత ఎక్కువగా అంగీకరిస్తామో అంతగా మనం వినయంలో ఎదుగుతాము.

## 3. తీవ్రమైన శ్రమకాలంలో గొప్ప ఆదరణ అందిస్తుంది

విశ్వమంతటికి సార్వభౌముడైన సమస్తాన్ని నియంత్రించే ప్రభువు తన ప్రేమను దయను మనకు చూపించాలనుకున్నారు. అలాంటి ప్రేమను పొందేందుకు మనం ఎప్పుడైనా ఏమైనా చేశామా? ఏమీ చేయలేదు! మనం ఘోరమైన పాపాలు చేసినప్పటికీ దేవుడు మనల్ని ప్రేమిస్తూ తన పిల్లలుగా చేసుకున్నట్లయితే, తీవ్రమైన శ్రమల గుండా వెళుతూ ఉన్నప్పటికీ మనమెందుకు భయపడాలి?

దేవుని సార్వభౌమాధికారంపై యోసేపుకు చాలా నమ్మకం ఉంది. అందుకే కష్ట సమయాలను ఎదుర్కొన్నప్పటికీ అతడు తన సోదరులతో *"మీరు నాకు కీడుచేయనుద్దేశించితిరిగాని నేటిదినమున జరుగుచున్నట్లు, అనగా బహు ప్రజలను బ్రదికించునట్లుగా అది మేలుకే దేవుడు ఉద్దేశించెను"* (ఆది 50:20) అని చెప్పగలిగాడు. తన జీవితంలోని పరిస్థితులన్నీ దేవుని నియంత్రణలో ఉన్నాయని అతనికి తెలుసు కాబట్టి పరిస్థితులు భయంకరంగా ఉన్నప్పటికీ అతడు నిరాశ చెందలేదు.

జెర్రీ బ్రిడ్జెస్ ఇలా రాసాడు:

> *అన్నీ దేవుని నియంత్రణలో ఉన్నాయి, ఆయన తన నియంత్రణలోనే మనం బాధ అనుభవించేలా చేస్తారు. ఆ బాధ చాలా వాస్తవమైనదే. మనం బాధపడతాము, శ్రమపడతాము. కానీ మన బాధల మధ్యలో కూడా అన్నీ దేవుని నియంత్రణలో ఉన్నాయని మనం నమ్మాలి; ఆయనే సార్వభౌమాధికారి. రచయిత్రి మార్గరెట్ క్లార్క్సన్ రాసినట్లు, "దేవుని సార్వభౌమాధికారం అనే అజేయమైన కొండకు బాధలో ఉన్న మానవ హృదయం ఆనుకోవాలి. మన జీవితాలను చుట్టుముట్టిన పరిస్థితులు యాదృచ్ఛికం కాదు: అవి దుష్టుని పని కావచ్చు, కానీ ఆ దుష్టత్వాన్ని సార్వభౌమాధికారం గల మన దేవుని శక్తివంతమైన హస్తం బలంగా ఆపుతుంది … చెడుతనమంతా ఆయనకు లోబడి ఉంటుంది. ఆయన అనుమతి లేకుండా చెడు ఆయన పిల్లలను తాకలేదు. మానవ చరిత్రకు, ఆయన విమోచించిన కుటుంబంలోని ప్రతి సభ్యుని వ్యక్తిగత చరిత్రకు దేవుడే ప్రభువు.*
>
> *ఇతరులు కావాలని చేసే దుర్మార్గపు పనులు మాత్రమే కాదు, ఇతరుల తప్పులు వైఫల్యాలు కూడా దేవుని సార్వభౌమ నియంత్రణలోనే ఉంటాయి. ఒక డ్రైవర్ రెడ్ లైట్ వెలిగినా ఆగకుండా వచ్చి మీ కారును ఢీకొట్టడం వల్ల చాలా దెబ్బలు తగిలి మీరు ఆసుపత్రి పాలయ్యారా? బాగుచెయ్యగలిగే దశలోనే మీ క్యాన్సర్‌ను గుర్తించడంలో డాక్టర్లు విఫలమయ్యారా? కాలేజీలో చాలా ముఖ్యమైన కోర్సులో అసమర్థ టీచర్ మీకు ఎదురయ్యాడా లేదా వ్యాపారంలో మీ పనికి అడ్డుపడే పనికిమాలిన సూపర్‌వైజర్ ఉన్నాడా? ఈ పరిస్థితులన్నీ సార్వభౌమాధికారియైన మన దేవుని నియంత్రణలోనే ఉన్నాయి, మన మంచి కోసం మన జీవితాల్లో ఆయన వాటిని అనుమతిస్తున్నారు.*

దేవుని సార్వభౌమాధికారంపై ఉన్న విశ్వాసంతో పాటు నేనిప్పుడు ఎదుర్కొంటున్న శ్రమ కూడా సార్వభౌమాధికారీ ప్రేమామయుడైన క్రీస్తు గాయపడిన చేతుల గుండా వెళ్ళవలసి ఉంటుందనే ఆలోచన కూడా ఉండాలి. ఈ శ్రమ ద్వారా ఆయన తన ఉద్దేశాలన్నింటినీ నెరవేరుస్తారు. ప్రత్యేకించి మన చుట్టూ ఉన్న పరిస్థితులు విషయంగా ఉన్నప్పుడు ఈ జ్ఞానం ఎంతో ఓదార్పునిస్తుంది! అన్నిటినీ నియంత్రించే ప్రేమగల దేవుని చేతులలో మనం ఎప్పుడూ సురక్షితంగానే ఉంటాము. చీకటి కాలంలో కూడా మనం దీనిని గుర్తుంచుకోవాలి.

## 4. ఇది మానవ బాధ్యతను రద్దు చేయదు

దేవుని సార్వభౌమాధికారం మానవుల స్వేచ్ఛను గాని బాధ్యతను గాని వ్యతిరేకించదు రద్దు చేయదు. మన పరిమిత మేధస్సు ఈ వాస్తవాన్ని పూర్తిగా గ్రహించలేకపోవచ్చు. మానవ చర్యలు దేవునికి హద్దులు ఏర్పరచలేవు, అలాగే మన ప్రయత్నాల వల్ల ఆయన ఉద్దేశాలు విఫలం కావు. మన పనులన్నిటిపై దేవునికి సార్వభౌమాధికారం ఉంటుంది కాని మన పాపాలకు దేవుడు ఎప్పుడూ బాధ్యుడుకాదు. అపొ. కా 2:23లో ఒక మంచి ఉదాహరణ ఉంది, *"దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యత్ జ్ఞానమును* (దేవుని సార్వభౌమాధికారం) *అనుసరించి అప్పగింపబడిన యీయనను* (యేసును) *మీరు దుష్టులచేత సిలువ వేయించి చంపితిరి* (మానవ బాధ్యత)." దేవుడు తన కుమారుని మరణానికి ప్రజలు కారణమయ్యేలా చేశారు. యేసును సిలువ వేయడం ఆయన సార్వభౌమ ప్రణాళికలో భాగమే!

ముఖ్యమైన విషయం ఏమిటంటే: దేవుని సార్వభౌమాధికారం మానవ బాధ్యతను రద్దు చేయదు, మానవ బాధ్యత దేవుని సార్వభౌమత్వాన్ని రద్దు చేయదు. ఈ రెండు సిద్ధాంతాలను లేఖనాల్లో బోధించారు. మన పరిమిత మేధస్సు ఈ సత్యాలను ఒప్పుకోలేదు. అయినప్పటికీ, సార్వభౌమాధికారీ, నిత్యుడూ సర్వజ్ఞానియైన దేవుని దృష్టిలో అవి సంపూర్ణంగా ఉంటాయి. ఆయన మార్గాలు మన అవగాహనకు మించినవి.

అన్ని విషయాలపై సార్వభౌమాధికారం కలిగిన దేవుని ఈ లక్షణానికి మనం ఆశ్చర్యపడి దానికి లోబడినప్పుడు ఆలోచించవలసిన నాలుగు భావనలు ఇవే.

మీరు దేవుని బిడ్డ అయితే, మీ జీవితంలోని ప్రతి దానిని నియంత్రించే దేవుని చేతిలో మీరు ఉన్నారు కాబట్టి సంతోషించి నెమ్మదిగా ఉండడండి. ఏమి జరిగినా త్వరలో మీరు శాశ్వతంగా ఆయనతో ఉంటారు. అప్పటి వరకు మీపై ఆయనకున్న అధికారానికి లోబడండి. మంచి చెడు రెండింటిలోనూ ఎప్పుడూ ఆయనను మహిమపరచడంపై దృష్టి సారించే జీవితాన్ని కొనసాగించండి.

మీరు ఇంకా దేవుని బిడ్డగా మారకపోతే, సార్వభౌమాధికారియైన దేవునితో మీరు పోరాడి గెలవలేరని దయచేసి అర్థం చేసుకోండి. మీ పాపాలను విడిచిపెట్టి, మీ పాపాలకు వెల చెల్లించిన తన కుమారుడైన యేసుక్రీస్తుపై నమ్మకం ఉంచమని ఆయన మీకు ఆజ్ఞాపిస్తున్నారు. అప్పుడే మీరు పాప క్షమాపణ పొంది ఆయన బిడ్డగా మారగలరు, రాబోయే తీర్పు నుండి తప్పించుకోగలరు. కాబట్టి దయచేసి ఈరోజే అలా చేయండి. యేసు రక్తంతో మీ పాపాలు కడిగివేయబడినప్పుడు కలిగే శాంతిని ఆనందాన్ని అనుభవించండి. ఆలస్యం చేయవద్దు!

## చర్చా ప్రశ్నలు

1. ఈ అధ్యాయం దేవుని సార్వభౌమాధికారం గురించి మీ దృక్కోణాన్ని ఎలా ప్రభావితం చేసింది?
2. దేవుని ఈ లక్షణాన్ని బట్టి మీరు జీవితంలో ఎలాంటి మార్పులు చేసుకుంటారు?
3. దేవుని ఈ లక్షణం మీ ప్రార్థనలను ఎలా ప్రభావితం చేస్తుంది?
4. దేవుని ఈ లక్షణం మీ సువార్త ప్రచారాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

## ధ్యానించవలసిన /కంఠత చేయవలసిన వాక్యం

***కీర్తన 115:3 –*** *మా దేవుడు ఆకాశమందున్నాడు. తన కిచ్ఛవచ్చినట్లుగా సమస్తమును ఆయన చేయుచున్నాడు.*

## ప్రార్థన

*ఓ దేవా,*

*నేను మీ మీద ఆధారపడుతున్నాను; నా ఇష్టం కాకుండా మీ చిత్తం నెరవేరడం చూసి*
*నేను నమ్మి, జీవిస్తాను;*

*నీ చిత్తాన్ని వాగ్దానాలను పొందడానికి నాలో ఏ యోగ్యత ఏ మంచి లేదు*
*అది కేవలం మీ మంచితనం మాత్రమే.*
*నీ కృప నన్ను పేదవాడిని అధమునిగా చేసినా నేను ధన్యుడనే!*

*నా అవసరాల నుండి వచ్చే ప్రార్థనలు రాబోయే కృప కోసమే;*
*ఘోరమైన పాపమే నా విశ్వాసానికి కారణమని*
*భావించక ముందే నేను విశ్వసించడం ద్వారా*
*మిమ్మల్ని ఘనపరచడానికి నాకు సహాయం చేయండి.*
*మీ కృపా సమృద్ధిపై ఆధారపడి, మీరు వాగ్దానాలను నెరవేరుస్తారని నమ్మి*

*విశ్వాసంతో ప్రార్థించడానికి మీ చిత్తాన్ని తెలుసుకోడానికి నాకు సహాయం చేయండి*
*మీ నుండి నేను ఏది పొందుకున్నా నా ప్రార్థన మనవులను పొందే వరకు*
*నేను విశ్వాసంతో ప్రార్థించేలా నన్ను బలపరచండి.*

*నేను నీ చిత్తం కోసం వేచి ఉంటాను, అది నెరవేరాలని ప్రార్థిస్తాను*

*మీ కృపతో పూర్తి విధేయత కలిగి ఉంటాను.*

*ఆమెన్!*

# లక్షణం 11: దేవుని సహనము

*దేవుని తీర్పును చాలాకాలం పాటు ఆపడానికి ఆయనకున్న సామర్థ్యమే దేవుని సహనము.*

దేవుడు మోషేకు తనను తాను బయలుపరచుకుని తన లక్షణాలను ప్రకటించారు, *"యెహోవా కనికరము, దయ, దీర్ఘశాంతము, విస్తారమైన కృపాసత్యములుగల దేవుడైన యెహోవా"* (నిర్గమ 34:6). మీరు *దీర్ఘశాంతము* అనే పదాన్ని గమనించారా? దేవుడు చాలా సహనంగా ఉంటారు, ఆయన ప్రజలను వెంటనే శిక్షించరు కానీ తన తీర్పును చాలాకాలం పాటు నిలిపివేస్తారు.

దేవుని సహనం గురించి స్టీఫెన్ చార్నాక్ చెప్పిన మాటలను ఆర్థర్ పింక్ ఉదాహరించాడు:

> *ఇది దేవుని కృపలో దయలో భాగమే అయినప్పటికీ రెండింటికీ భిన్నంగా ఉంటుంది. దేవుడు ఎంతో కృపగలవాడు, ఎంతో శాంతం గలవాడు; శాంతం ఎప్పుడూ నిజమైన కృప వెంట ఉంటుంది; కృప ఎంత ఎక్కువగా ఉంటే, శాంతం కూడా అంత ఎక్కువగా ఉంటుంది. క్రీస్తు వంటి పరిశుద్ధుడూ శాంతపరుడూ ఎవరున్నారు? దేవుడు త్వరగా కోపపడకపోవడం ఆయన కృపలో భాగమే: "ఆయన దీర్ఘశాంతుడు కృపాతిశయముగలవాడు" (కీర్తన 145:8).*[2]

దేవుని సహనానికి సంబంధించిన కొన్ని పాత నిబంధన వాక్యభాగాలు:

> ***సంఖ్యా 14:17 -*** *యెహోవా దీర్ఘశాంతుడును, కృపాతిశయుడును, దోషమును అతిక్రమమును పరిహరించువాడును.*
>
> ***కీర్తన 86:15 -*** *ప్రభువా, నీవు దయాదాక్షిణ్యములుగల దేవుడవు దీర్ఘశాంతుడవు కృపాసత్యములతో నిండినవాడవు.*
>
> ***కీర్తన 103:8 -*** *యెహోవా దయాదాక్షిణ్య పూర్ణుడు దీర్ఘశాంతుడు కృపాసమృద్ధిగలవాడు.*
>
> ***కీర్తన 145:8 -*** *యెహోవా దయాదాక్షిణ్యములుగలవాడు ఆయన దీర్ఘశాంతుడు కృపాతిశయముగలవాడు.*

నీనెవె వాసులకు ప్రకటించమన్న దేవుని ఆజ్ఞ నుండి తాను ఎందుకు పారిపోయానో వివరిస్తూ తన అవిధేయతకు కారణం దేవుని సహనమే అని యోనా చెప్పాడు. అతడు యెహోవాకు ప్రార్థించాడు, *"యెహోవా, నేను నా దేశమందుండగా ఇట్లు జరుగునని నేననుకొంటిని గదా? అందువలననే నీవు కటాక్షమును జాలియును బహు శాంతమును అత్యంత కృపయుగల దేవుడవై యుండి, పశ్చాత్తాపపడి కీడుచేయక మానుదువని నేను తెలిసికొని దానికి ముందుగానే తర్షీషునకు పారిపోతిని"* (యోనా 4:2). మరో మాటలో చెప్పాలంటే, యోనా ప్రవక్తకు దేవుని సహనం గురించి, పశ్చాత్తాపపడితే చెడ్డవారైన నీనెవె వాసులను కూడా ఆయన క్షమిస్తారని తెలుసు. దేవుడు వారిని క్షమించాలని అతడు కోరుకోలేదు. కాబట్టి, దేవుడు అతనిని తన ఆజ్ఞకు లోబడేలా చేసే వరకు వారికి సువార్త ప్రకటించడానికి అతడు నిరాకరించాడు. దేవునికి పాపుల పట్ల ఉన్న ప్రేమతో పాటు ఆయనకున్న సహనం చెడ్డవారైన నీనెవెవాసులను కూడా ఆయన క్షమించేలా చేసిందని ఇది స్పష్టంగా చూపిస్తుంది. చాలా సంవత్సరాల తర్వాత నహూము ప్రవక్త నీనెవె వాసులకు బోధిస్తూ వారిని పశ్చాత్తాపపడమని చెప్పినప్పుడు కూడా దేవుని సహనం గురించి చెప్పాడు, *"యెహోవా దీర్ఘశాంతుడు, మహా బలముగలవాడు, ఆయన దోషులను నిర్దోషులుగా ఎంచడు, యెహోవా తుపానులోను సుడిగాలిలోను వచ్చువాడు; మేఘములు ఆయనకు పాదధూళిగా నున్నవి"* (నహూము 1:3)!

పాతనిబంధనలోని దేవుడు శిక్షించే దేవుడని, ప్రేమను చాలా అరుదుగా చూపిస్తారని చెప్పేవారికి పైన చెప్పిన వాక్యభాగాలు ఒక గద్దింపుగా ఉంటాయి. చాలా కాలంగా పాపం చేసిన ప్రజల విషయంలో దేవుడు ఎంతో సహనం చూపించారు!

క్రొత్త నిబంధన విషయానికి వస్తే, దేవుని సహనాన్ని తెలిపే అనేక లేఖనభాగాలు మనకు కనిపిస్తాయి. వాటిలో కొన్ని:

> ***రోమా 2:4 -*** *లేదా, దేవుని అనుగ్రహము మారుమనస్సు పొందుటకు నిన్ను ప్రేరేపించుచున్నదని యెరుగక, ఆయన అనుగ్రహైశ్వర్యమును సహనమును దీర్ఘశాంతమును తృణీకరించుదువా?*

> ***1 తిమోతి 1:16 -*** *అయినను నిత్యజీవము నిమిత్తము తనను విశ్వసింపబోవు వారికి నేను మాదిరిగా ఉండులాగున యేసుక్రీస్తు తన పూర్ణమైన దీర్ఘశాంతమును ఆ ప్రధానపాపినైన నాయందు కనుపరచునట్లు నేను కనికరింపబడితిని.*

"పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునై యున్నది. అట్టి వారిలో నేను ప్రధానుడను" (1 తిమోతి 1:15) అని పౌలు చెప్పిన తర్వాత "అయినను నిత్యజీవము నిమిత్తము తనను విశ్వసింపబోవువారికి నేను మాదిరిగా ఉండులాగున యేసుక్రీస్తు తన పూర్ణమైన దీర్ఘశాంతమును ఆ ప్రధానపాపినైన నాయందు కనుపరచునట్లు నేను కనికరింపబడితిని" అని చెప్పాడు. మరో మాటలో చెప్పాలంటే, యేసుకు వ్యతిరేకంగా పోరాడిన పౌలును రక్షించి, అతని పట్ల చాలా సహనంగా ఉన్న దేవుడు, తన కుమారుడైన యేసుపై విశ్వాసముంచి ఆయన ఇచ్చే నిత్యజీవాన్ని అంగీకరించే ఇతర పాపులను కూడా ఆయన రక్షిస్తారు కదా?

గతంలో ఓడను కడుతున్నప్పుడు దేవుడు చూపిన సహనం గురించి పేతురు చెప్పాడు, *"దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా, అవిధేయులైనవారియొద్దకు, అనగా చెరలో ఉన్న ఆత్మలయొద్దకు, ఆయన ఆత్మరూపిగానే వెళ్లి వారికి ప్రకటించెను. ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిది మంది నీటిద్వారా రక్షణపొందిరి"* (1 పేతురు 3:20). తాను ఇచ్చే తీర్పును తప్పించుకునేలా ప్రజలు పశ్చాత్తాపపడాలని దేవుడు దీర్ఘశాంతంతో 100 సం. లకు పైగా వేచి ఉన్నారు. వారి దుష్టత్వానికి ఆయన వెంటనే వారందరినీ చంపి ఉండవచ్చు. వారు పశ్చాత్తాపపడరని తెలిసినప్పటికీ ఆయనకున్న సహనం వల్ల ఆయన తీర్పును చాలా కాలం పాటు ఆపారు (ఆది 6:13, 18).

పౌలు ఇలాంటి విషయాన్నే రోమా 9:22లో చెప్పాడు *"ఆలాగు దేవుడు తన ఉగ్రతను అగపరచుటకును, తన ప్రభావమును చూపుటకును, ఇచ్ఛయించినవాడై, నాశనమునకు సిద్ధపడి ఉగ్రతాపాత్రమైన ఘటములను ఆయన బహు దీర్ఘశాంతముతో సహించిననేమి?"* పశ్చాత్తాపంతో ఆయన వైపు తిరగడంలో విఫలమై, చివరికి ఆయన కోపాన్ని నాశనాన్ని ఎదుర్కొనే వారిపట్ల కూడా ఆయన సహనంతోనే ఉంటారు. చివరికి ఆయనను తిరస్కరించే వారిపై కూడా దేవుడు చూపించే సహనం గురించి ఆలోచించినప్పుడది నమ్మలేనిదిగా ఉంటుంది!

కాబట్టి, మన జీవితాల్లో దేవుని ఈ లక్షణానికున్న ప్రాముఖ్యత ఏమిటి?

## క్రైస్తవులకు

ఒకరి పట్ల ఒకరికి ఉన్న సంబంధాలలో సహనాన్ని చూపించాలి. అదే ప్రధాన అంతరార్థం. చాలా సార్లు మనకు ఇతరులపై కోపం వస్తూ ఉంటుంది. అటువంటి వైఖరి కొన్నిసార్లు మనకు నొప్పి కలిగినందున హానికరమైన మార్గాల్లో ప్రతీకారానికి దారితీస్తుంది. అయినప్పటికీ మన మధ్య సంబంధాలలో ఒకరితో ఒకరు సహనం కలిగి ఉండాలని (దీర్ఘశాంతం) బైబిలు పదేపదే చెప్తుంది.

> ***సామెతలు 19:11 -*** *ఒకని సుబుద్ధి వానికి దీర్ఘశాంతము నిచ్చును, తప్పులు క్షమించుట అట్టివానికి ఘనతనిచ్చును.*

> ***1 కొరింథీ 13:4 -*** *ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును ప్రేమ మత్సరపడదు; ప్రేమ డంబముగా ప్రవర్తింపదు; అది ఉప్పొంగదు.*

> ***కొలస్సీ 3:12 -*** *కాగా, దేవునిచేత ఏర్పరచబడినవారును పరిశుద్ధులును ప్రియులునైనవారికి తగినట్లు, మీరు జాలిగల మనస్సును, దయాళుత్వమును, వినయమును, సాత్వికమును, దీర్ఘశాంతమును ధరించుకొనుడి.*

> ***ఎఫెసీ 4:2 -*** *శ్రద్ధ కలిగినవారై, ప్రేమతో ఒకనినొకడు సహించుచు.*

***1 థెస్సలో 5:14 -*** *సహోదరులారా, మేము మీకు బోధించునది ఏమనగా –అక్రమముగా నడుచుకొనువారికి బుద్ధిచెప్పుడి, ధైర్యము చెడినవారిని ధైర్యపరచుడి, బలహీనులకు ఊత నియ్యుడి, అందరి యెడల దీర్ఘశాంతముగలవారై యుండుడి.*

అందరూ పశ్చాత్తాపపడాలని కోరుతూ దేవుడు చూపిస్తున్న సహనాన్ని విశ్వాసులకు గుర్తు చేస్తూ, "కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమునుగూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతముగలవాడై యున్నాడు" (2 పేతురు 3:9) అని పేతురు చెప్పాడు.

మనం ఆయన దగ్గరకు రాకముందు దేవుడు మన పట్ల ఎంతో సహనంగా ఉన్నారని, ఆయన పిల్లలుగా మారిన తర్వాత కూడా ఆయనను విఫలమయ్యేలా చేస్తున్న మన పట్ల ఇంకా సహనంగా ఉన్నారని నిత్యం జ్ఞాపకం చేసుకుంటూ ఉన్నప్పుడు, ఇతరులతో మరి ముఖ్యంగా మనకు చెడుచేసిన వారితో మనం కూడా సహనంగా వ్యవహరించేలా మన వైఖరిని పెంపొందించుకోవచ్చు. మనల్ని పదే పదే అవమానించినా లేదా నిర్లక్ష్యం చేసినా దానికి ప్రతీకారం తీర్చుకోవాల్సిన అవసరం లేదు. *"ఒకని సుబుద్ధి వానికి దీర్ఘశాంతము నిచ్చును తప్పులు క్షమించుట అట్టివానికి ఘనతనిచ్చును"* అని సొలొమోను చెప్పినట్లే (సామెతలు 19:11) గతంలో చర్చి నాయకుడైన క్రిసోస్టమ్ చెప్పిన ప్రకారం, ఓర్పు కలిగిన మనిషి అంటే "తనకు ప్రతీకారం తీర్చుకోవడానికి వనరులు మరియు అవకాశం ఉన్నప్పటికీ, వాటిని ఉపయోగించకుండా ఉండటాన్ని ఎంచుకునే వ్యక్తి"

ఎడ్విన్ స్టాంటన్ కంటే ఎక్కువగా మరి ఎవరూ అబ్రాహాము లింకన్‌ను ఎగతాళి చేయలేదు. అతడు లింకన్ విధానాలను ఖండించడమే కాకుండా లింకన్ ఒక భయంకరమైన మోసగాడని చెప్పాడు. లింకన్‌కు గొరిల్లా అని మారుపేరు పెట్టాడు. అంతే కాకుండా ఇల్లినోయిస్‌లోని స్ప్రింగ్‌ఫీల్డ్‌లో ఒక గొరిల్లాను సులభంగా చూడగలిగినప్పుడు దాని కోసం పాల్ డూ చైలు మూర్ఖంగా ఆఫ్రికాలో వెదకుతున్నాడని అన్నాడు. లింకన్ దానికే సమాధానం ఇవ్వలేదు. అయితే లింకన్ తన వార్ మినిస్టర్‌గా స్టాంటన్‌ను నియమించాడు ఎందుకంటే స్టాంటన్ దానికి తగిన వ్యక్తి. లింకన్ అతనితో చాలా మర్యాదగా ప్రవర్తించాడు. అలా కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి.

ఒక రాత్రి థియేటర్‌లో లింకన్‌పై హంతకులు కాల్పులు జరిపారు. లింకన్ మృతదేహం ఉన్న గదిలో ఆ రాత్రి స్టాంటన్ నిలబడి ఉన్నాడు. మొరటుగా మౌనం ఉన్న ప్రెసిడెంట్ ముఖం వైపు చూస్తూ, "ప్రపంచం ఇప్పటివరకు చూడని గొప్ప పాలకుడు ఇక్కడ పడుకుని ఉన్నాడు" అని కన్నీళ్లతో స్టాంటన్ అన్నాడు.

*"కీడువలన జయింపబడక, మేలు చేత కీడును జయించుము"* అని రోమా 12:21 మనకు గుర్తుచేస్తున్నట్లుగా ప్రేమలోని సహనమే చివరికి జయించింది. తనను నిరంతరం అపహాస్యం చేసే దుర్మార్గుల పట్ల కూడా దేవుడు చాలా సహనంగా ఉంటారు. కాబట్టి మనల్ని బాధపెట్టే వారితో సహనంగా ఉండడానికి మనమెందుకు ఆయనను అనుకరించకూడదు? తండ్రిని పోలిన పిల్లలుగా! అదే మన లక్ష్యం!

**మనం సహనాన్ని ఎలా పెంపొందించుకోవచ్చు?** ఈ సహనాన్ని మనంతట మనమే పెంపొందించుకోలేమని గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం. సహనమనే లక్షణాన్ని మన జీవితాల్లో కలిగి ఉండడానికి మనకు పరిశుద్ధాత్మ అవసరం. ఆత్మ ఫలంలో ... దీర్ఘశాంతం (సహనం) ఒకటి (గలతీ 5:22-23). మనం పరిశుద్ధాత్మకు లోబడడం అలవాటుగా చేసుకున్నప్పుడు (లేఖనాల పట్ల విధేయతతో కలిగిన జీవితాన్ని గడపడం), ఆయన (పరిశుద్ధాత్మ) దీర్ఘశాంతమనే ఫలం మనలో ఫలించేలా చేస్తారు. ఒకరిపట్ల ఒకరికి ఉన్న సంబంధాలలో సహన స్ఫూర్తిని పెంపొందించడానికి సహనాన్ని చూపించడానికి ఇదే మార్గము.

## క్రైస్తవేతరులకు

ప్రజలు పశ్చాత్తాపపడాలని దాదాపు ఒక శతాబ్ద కాలం పాటు ఆయన ఎదురుచూడటంలో పాపుల పట్ల దేవునికున్న సహనం కనిపిస్తుంది. నీతిని ప్రకటించిన నోవహును (2 పేతురు 2:5) ఉపయోగించి వారు పశ్చాత్తాపపడేందుకు అనేక అవకాశాలను ఇచ్చి, పాపాలను విడిచిపెట్టి విశ్వాసంతో తన వైపుకు తిరగమని ఆయన పదే పదే వారిని పిలిచారు. అయినా సరే వారు పశ్చాత్తాపపడలేదు కాబట్టి దేవుడు వారికి తీర్పు తీర్చారు.

అదే విధంగా, రోమా 2:4లో, "లేదా, దేవుని అనుగ్రహము మారుమనస్సు పొందుటకు నిన్ను ప్రేరేపించుచున్నదని యెరుగక, ఆయన అనుగ్రహైశ్వర్యమును సహనమును దీర్ఘశాంతమును తృణీకరించుదువా?" అని పౌలు మనకు గుర్తుచేస్తున్నట్లుగా దేవుడు మీ పట్ల తన సహనాన్ని చూపిస్తున్నప్పుడు మీరు పశ్చాత్తాపపడాలనేదే ఆయన ఉద్దేశం. అయితే మీరు పశ్చాత్తాపపడకుంటే జరిగే దాని గురించి తర్వాతి రెండు వచనాల్లో హెచ్చరిక కనిపిస్తుంది: "నీ కాఠిన్యమును, మార్పు పొందని నీ హృదయమును అనుసరించి,

ఉగ్రతదినమందు, అనగా దేవుని న్యాయమైన తీర్పు బయలుపరచబడు దినమందు నీకు నీవే ఉగ్రతను సమకూర్చుకొనుచున్నావు. ఆయన ప్రతివానికి వాని వాని క్రియల చొప్పున ప్రతిఫలమిచ్చును" (రోమా 2:5-6).

పాత నిబంధన కూడా అదేవిధమైన హెచ్చరికను ఇస్తుంది. ఈ రోజు మీరు తీర్పు పొందలేదని భవిష్యత్తులో కూడా మీరు ఎన్నటికీ తీర్పు పొందరని భావించి మిమ్మల్ని మీరు మోసగించుకోవద్దు. ప్రసంగి 8:11-13లో దేవుని హెచ్చరిక ఉంది, "దుష్క్రియకు తగిన శిక్ష శీఘ్రముగా కలుగకపోవుట చూచి మనుష్యులు భయమువిడిచి హృదయపూర్వకముగా దుష్ క్రియలు చేయుదురు. పాపాత్ములు నూరు మారులు దుష్కార్యముచేసి దీర్ఘాయుష్మంతులైనను దేవునియందు భయభక్తులుకలిగి ఆయన సన్నిధికి భయపడువారు క్షేమముగా నుందురనియు, భక్తిహీనులు దేవుని సన్నిధిని భయపడరు గనుక వారికి క్షేమము కలుగదనియు, వారు నీడ వంటి దీర్ఘాయువును పొందకపోవుదురనియు నేనెరుగుదును." ఈ రోజు అంతా బాగానే ఉంది కాబట్టి, రేపు కూడా అంతా బాగానే ఉంటుందని దయచేసి అనుకోకండి! మీరు దేవుని వైపు తిరిగి, ఆయన కుమారుడైన యేసుక్రీస్తును విశ్వసించకపోతే ప్రసంగి 8:13 బోధిస్తున్నట్లుగా మీకు క్షేమం కలుగదు. శాశ్వతమైన తీర్పు మాత్రమే మీ కోసం వేచి ఉంటుంది. నేను భారమైన హృదయంతో ప్రేమగా చెప్తున్నాను. ఈ మాటలు సత్యం! వీటిని తీవ్రంగా తీసుకోండి.

దీర్ఘశాంతం కలిగి త్వరగా కోపించని సహనంగల అదే దేవుడు ఉగ్రతను చూపిస్తారు (దేవుని ఉగ్రత అనే అధ్యాయాన్ని చదవండి). తన కుమారుడిని తిరస్కరించే వారందరికీ ఆయన తీర్పు తీరుస్తారు. ఆయన సహనానికి కూడా హద్దు ఉంటుంది. మీరు మీ హృదయాన్ని కఠినం చేసుకుని మీపై ఆయన చూపించే సహనాన్ని త్రోసివేసేవారిగా ఉంటే చివరికి మీకు మిగిలేది ఆయన ఉగ్రతను పూర్తిగా ఎదుర్కోవడమే. దయచేసి దేవుడు చూపిస్తున్న సహనాన్ని మీ పట్ల దేవుడు సంతోషంగా ఉన్నారని పొరబడకండి. మీరు ఆయన ఆజ్ఞలకు తిరుగుబాటు చేస్తూ జీవించినంత కాలం ఆయన మీ గురించి సంతోషించరు. కాబట్టి, దయచేసి మీ పాపాలను విడిచిపెట్టి నేడే యేసు వైపు తిరగండి!

## చర్చా ప్రశ్నలు

1. ఈ అధ్యాయం దేవుని సహనము గురించి మీ దృక్కోణాన్ని ఎలా ప్రభావితం చేసింది?
2. దేవుని ఈ లక్షణాన్ని బట్టి మీరు జీవితంలో ఎలాంటి మార్పులు చేసుకుంటారు?
3. దేవుని ఈ లక్షణం మీ ప్రార్థనలను ఎలా ప్రభావితం చేస్తుంది?
4. దేవుని ఈ లక్షణం మీ సువార్త ప్రచారాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

## ధ్యానించవలసిన /కంఠత చేయవలసిన వాక్యం

***కీర్తనలు 103:8*** – *యెహోవా దయాదాక్షిణ్య పూర్ణుడు దీర్ఘశాంతుడు కృపాసమృద్ధిగలవాడు.*

## ప్రార్థన

తండ్రీ, నాపై మీరు చూపించే సహనం నాకెంతో ఆశ్చర్యం కలిగిస్తుంది. నేను ప్రతిరోజూ పదే పదే పడిపోయినప్పటికీ, మీరు నాపట్ల సహనంగానే ఉన్నారు. మీరు నన్ను క్రమశిక్షణలో ఉంచినప్పుడు కూడా, మీరు నా మంచి కోసమే ప్రేమతో చేస్తున్నారు. దయచేసి మీ సహనాన్ని నిర్లక్ష్యం చేయకుండా నాకు సహాయం చేయండి. ఇతరుల పట్ల నాకున్న అసహనంతో నీ ఆత్మకు దుఃఖం కలిగించకుండా నన్ను కాపాడండి. నా పాపాలకు తగినట్లుగా నాతో వ్యవహరించకుండా మీరు నాపై దీర్ఘశాంతం చూపినట్లే నేను కూడా ఇతరుల పట్ల ఎక్కువ సహనాన్ని చూపించాలని దయచేసి నాకు గుర్తు చేయండి. ఈ భూమిపై జీవించినప్పుడు తనకు కష్టం కలిగించిన వారి పట్ల ఎంతో సహనాన్ని చూపించిన మీ కుమారుడైన యేసును పోలి ఉండేలా నాకు సహాయం చేయండి. ఆమెన్!

# లక్షణం 12: మార్పు చెందని దేవుని

*దేవుని మార్పులేని స్వభావాన్ని ఆయన స్థిరత్వంగా వివరించవచ్చు అనగా ఆయన తన ఉనికిలో తన ఉద్దేశాలన్నింటిలో మార్పులేనివాడు.*

పైన పేర్కొన్న నిర్వచనానికి అర్థం దేవునికి భావోద్వేగాలు ఉండవని లేదా భిన్న పరిస్థితులలో భిన్నంగా ప్రవర్తించలేరని కాదు. ఆయన ఎన్నడూ ఎదగరు లేదా క్షీణించరని దాని అర్థం. ఆయనకు ఆది అంతం లేదు. ఆయన మంచిగా కాని చెడుగా కాని మారరు. ఆయన నిన్న ఒకలా ఈ రోజు ఒకలా ఉండరు. ఆయన పరిశుద్ధతలో, ప్రేమలో లేదా దయలో ఎక్కువ తక్కువలు ఉండవు, ఆయన ఉన్న రీతిగానే ఎప్పుడూ ఉంటారు. ఆయన లక్షణాలకు ఏదీ జోడించబడదు, తీసివేయబడదు లేదా తగ్గించబడదు.

## దేవుడు తన ఉనికిలో మార్పులేనివాడు

దేవుడు తనను తాను మోషేకు బయలుపరచినప్పుడు, "*నేను ఉన్నవాడను*" (నిర్గమ 3:14) అని చెప్పారు. ఆయన ఎప్పటికీ ఒకేలా ఉంటారు. మలాకీ ద్వారా మాట్లాడుతూ, "యెహోవానైన నేను మార్పులేనివాడను" (3:6) అని ప్రకటించి దేవుడు తన మార్పులేని స్వభావాన్ని ధృవీకరించారు. దేవునిలో *"ఏ చంచలత్వమైనను గమనా గమనములవలన కలుగు ఏ ఛాయయైనను లేదు"* (1:17b) అని యాకోబు మనకు గుర్తు చేస్తున్నాడు. తన చుట్టూ ఉన్న సముద్రం నిరంతరం హెచ్చుతగ్గులకు గురవుతున్నా ఎన్నడూ కదలని కొండతో దేవుని అందుకే పోలుస్తారు: *"ఆయన ఆశ్రయదుర్గముగా నున్నాడు; ఆయన కార్యము సంపూర్ణము ఆయన చర్యలన్నియు న్యాయములు ఆయన నిర్దోషియై నమ్ముకొనదగిన దేవుడు. ఆయన నీతిపరుడు యథార్థవంతుడు"* (ద్వితీయో 32:4).

భూమి ఆకాశాలు శాశ్వతమైనవని భావించే మానవ దృష్టికి విరుద్ధంగా దేవుని గురించి కీర్తనాకారుడు ఇలా చెప్పాడు:

> ***కీర్తనలు 102:25-27 –*** *ఆదియందు నీవు భూమికి పునాది వేసితివి ఆకాశములు కూడ నీ చేతిపనులే. అవి నశించును గాని నీవు నిలచియుందువు అవియన్నియు వస్త్రమువలె పాతగిలును ఒకడు అంగవస్త్రమును తీసివేసినట్లు నీవు వాటిని తీసివేయుదువు అవి మార్చబడును. నీవు ఏకరీతిగా నుండువాడవు నీ సంవత్సరములకు అంతము లేదు.*

భూమి ఆకాశాలు సృష్టించడానికి ముందే ఉన్న దేవుడు అవి నాశనం అయిన తర్వాత కూడా ఉనికిలో ఉంటారని కీర్తనాకారుడు ధృవీకరిస్తున్నాడు. సృష్టికర్తగా, ఆయన ఏ మార్పు లేకుండా ఉంటారు. ఆసక్తికరంగా హెబ్రీ పత్రిక రచయిత ఈ వచనాలను హెబ్రీ 1:10-12లోని యేసుక్రీస్తుకు అన్వయించాడు. అలాగే "యేసుక్రీస్తు నిన్న, నేడు, ఒక్కటే రీతిగా ఉన్నాడు" అని కూడా వర్ణించాడు (హెబ్రీ 13:8). యేసు అదే దైవిక లక్షణాన్ని కలిగి ఉన్నారని చెప్పడం ద్వారా రచయిత యేసుకు తండ్రితో ఉన్న సమానత్వాన్ని ధృవీకరించాడు.

దేవుడు మార్పులేనివాడు అనే దాని గురించి A.W. పింక్ ఈ విధంగా చెప్పాడు:

> *ఈ రోజు ఉన్న ట్లే ఆయన (దేవుడు) ఎప్పుడూ ఉన్నారు, ఎప్పటికీ ఉంటారు ... ఆయన పరిపూర్ణుడు కాబట్టి ఆయన మరింత మంచిగా మారలేరు చెడ్డగా మారలేరు. తనకు వెలుపల ఉన్న దేనిచేత ప్రభావితం కాకుండా అభివృద్ధి చెందడం లేదా క్షీణించడం అసాధ్యం. ఆయన శాశ్వతంగా ఒకేలా ఉంటారు.*

## దేవుడు తన ఉద్దేశాలలో మార్పులేనివాడు

దేవుడు తన ఉనికిలో మాత్రమే కాదు, తన ఉద్దేశ్యాలన్నిటిలో కూడా ఆయన మార్పులేనివాడు. అనేక లేఖనభాగాలు ఈ సత్యాన్ని ధృవీకరిస్తున్నాయి. వాటిలో కొన్ని:

> ***యోబు 23:13 –*** *అయితే ఆయన ఏకమనస్సుగలవాడు ఆయనను మార్చగలవాడెవడు? ఆయన తనకిష్టమైనది ఏదో అదే చేయును.*
>
> ***యోబు 42:2 –*** *నీవు సమస్తక్రియలను చేయగలవనియు నీవు ఉద్దేశించినది ఏదియు నిష్ఫలము కానేరదనియు నేనిప్పుడు తెలిసికొంటిని.*
>
> ***కీర్తనలు 33:11 –*** *యెహోవా ఆలోచన సదాకాలము నిలుచును ఆయన సంకల్పములు తరతరములకు ఉండును.*
>
> ***కీర్తనలు 115:3 –*** *మా దేవుడు ఆకాశమందున్నాడు తన కిచ్ఛవచ్చినట్లుగా సమస్తమును ఆయన చేయుచున్నాడు.*
>
> ***యెషయా 46:10 –*** *నా ఆలోచన నిలుచుననియు నా చిత్తమంతయు నెరవేర్చుకొనెదననియు చెప్పుకొనుచు ఆదినుండి నేనే కలుగబోవువాటిని తెలియజేయుచున్నాను. పూర్వకాలమునుండి నేనే యింక జరుగనివాటిని తెలియజేయుచున్నాను.*

పరిస్థితులు చాలా దుర్భరంగా అనిపించినప్పుడు కూడా ఇశ్రాయేలీయులకు చేసిన వాగ్దానాలలో దేవుని కనికరాన్ని నిబద్ధతను మీకా ధృవీకరిస్తున్నాడు: *"తన స్వాస్థ్యములో శేషించినవారి దోషమును పరిహరించి, వారు చేసిన అతిక్రమముల విషయమై వారిని క్షమించు దేవుడవైన నీతో సముడైన దేవుడున్నాడా? ఆయన కనికరము చూపుటయందు సంతోషించువాడు గనుక నిరంతరము కోపముంచడు. ఆయన మరల మనయందు జాలిపడును, మన దోషములను అణచివేయును, వారి పాపములన్నిటిని సముద్రపు అగాధములలో నీవు పడవేతువు. పూర్వకాలమున నీవు మా పితరులైన అబ్రాహాము యాకోబులకు ప్రమాణము చేసిన సత్యమును కనికరమును నీవు అనుగ్రహింతువు"* (మీకా 7: 18-20). ఇతరుల మధ్యలో ఇశ్రాయేలీయులను దేవుడు సంరక్షిస్తారని ఈ వచనాలు హామీ ఇస్తున్నాయి.

హెబ్రీ పత్రిక రచయిత కష్టాల్లో ఉన్న విశ్వాసులకు వ్రాస్తూ, దేవుడు తన ప్రజలకు చేసిన మంచి వాగ్దానాలన్నింటినీ, ప్రత్యేకంగా రాబోయే వాగ్దాన వారసత్వాన్ని నెరవేర్చడానికి దేవునికున్న నిశ్చయాన్ని గుర్తు చేస్తూ వారిని విశ్వాసంలో స్థిరంగా ఉండమని ప్రోత్సహించాడు. అతడు హెబ్రీ 6:17-18లో ఇలా రాసాడు: "ఈ విధముగా దేవుడు తన సంకల్పము నిశ్చలమైనదని ఆ వాగ్దానమునకు వారసులైనవారికి మరి నిశ్చయముగా కనుపరచవలెనని ఉద్దేశించినవాడై, తాను అబద్ధమాడజాలని నిశ్చలమైన రెండు సంగతులనుబట్టి, మనయెదుట ఉంచబడిన నిరీక్షణను చేపట్టుటకు శరణాగతులమైన మనకు బలమైన ధైర్యము కలుగునట్లు ప్రమాణము చేసి వాగ్దానమును దృఢపరచెను."

పూర్వకాలంలోనే దేవుడు తాను సాధించాలని అనుకున్నవన్నీ నిర్ణయించారు. కొత్త జ్ఞానం ఆధారంగా గాని శక్తి లేకపోవడం వల్ల గాని ఆయన తన ప్రణాళికలను సవరించాల్సిన అవసరం లేదు. దేవుడు ఎల్లప్పుడూ సర్వజ్ఞుడు (సర్వజ్ఞాని), సర్వశక్తి గలవాడు (సర్వశక్తిమంతుడు). ఆయన తన ఉద్దేశాలన్నింటిని నెరవేరుస్తారు.

అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న ఎదురవుతుంది.

### దేవుడు కొన్నిసార్లు తన మనసు మార్చుకుంటారా?

దేవుడు తన ఉనికిలో తన ఉద్దేశాలలో స్థిరంగా (మార్పులేకుండా) ఉన్నట్లయితే, దేవుడు దయ చూపించడం (పశ్చాత్తాపపడటం లేదా బాధపడడం) లేదా మనసు మార్చుకోవడం గురించి మనం చదివే వాక్యభాగాల సంగతి ఏమిటి?

> ***ఆది 6:6 –*** *తాను భూమిమీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది తన హృదయములో నొచ్చుకొనెను.*
>
> ***1 సమూయేలు 15:11 -*** *సౌలు నన్ను అనుసరింపక వెనుకతీసి నా ఆజ్ఞలను గైకొనకపోయెను గనుక అతనిని రాజుగా నిర్ణయించినందుకు నేను పశ్చాత్తాపపడుచున్నాను.*

దేవుడు తీర్పు తీరుస్తానని హెచ్చరించిన సందర్భాలలో కొన్నిసార్లు ప్రజలు ప్రార్థించినందుకు తమ మార్గాలను మార్చుకున్నందుకు ఆయన పశ్చాత్తాపపడి వాగ్దానం చేసిన తీర్పును తీసుకురాలేదు. దానికి కొన్ని ఉదాహరణలు:

a. దేవుడు ఇశ్రాయేలు ప్రజలను నాశనం చేయకుండా ఆపడానికి మోషే ప్రార్థనలో విజయవంతంగా మధ్యవర్తిత్వం వహించాడు (నిర్గమ 32:9-14). ఇశ్రాయేలీయులు *"లోబడనొల్లని ప్రజలు"* (వ. 9) కాబట్టి దేవుడు వారిని *"కాల్చివేసి"* నాశనం చేయాలనుకున్నారు (వ. 10). కాబట్టి, *"మోషే తన దేవుడైన యెహోవాను బ్రతిమాలుకున్నాడు"* (వ. 11). అతని మధ్యవర్తిత్వం ఫలితంగా, *"అంతట యెహోవా తన ప్రజలకు చేసెదనని చెప్పిన కీడునుగూర్చి సంతాపపడెను"* (వ. 14).

b. దేవుడు హిజ్కియా జీవితకాలానికి 15 సం. లు జోడించారు (యెషయా 38:1-6). *"ఆ దినములలో హిజ్కియాకు మరణకరమైన రోగము కలుగగా ... నీవు మరణమవుచున్నావు, బ్రదుకవు గనుక నీవు నీ యిల్లు చక్కబెట్టుకొనుమని"* చెప్పడానికి దేవుడు యెషయాను పంపించారు (వ. 1). అది విన్న హిజ్కియా *"యెహోవాకు ప్రార్థించాడు"* (వ. 2). అతని హృదయపూర్వకమైన ప్రార్థన చూసిన దేవుడు యెషయా ద్వారా హిజ్కియాతో, *"నీవు కన్నీళ్లు విడుచుట చూచితిని; నీ ప్రార్థన నేనంగీకరించియున్నాను; ఇంక పదిహేను సంవత్సరముల ఆయుష్యము నీకిచ్చెదను"* (వ. 5, 6) అని చెప్పారు.

దేవుని మార్పులేని స్వభావాన్ని ధృవీకరించే (ముందు పేర్కొన్న వాటితో పాటు) క్రింది లేఖనభాగాలతో ఈ సందర్భాలను మనం ఎలా సమన్వయపరుస్తాము?

> ***సంఖ్యా 23:19 –*** *దేవుడు అబద్ధమాడుటకు ఆయన మానవుడు కాడు పశ్చాత్తాపపడుటకు ఆయన నరపుత్రుడు కాడు ఆయన చెప్పి చేయకుండునా? ఆయన మాట యిచ్చి స్థాపింపకుండునా?*

> ***1 సమూయేలు 15:29 –*** *మరియు ఇశ్రాయేలీయులకు ఆధారమైనవాడు నరుడుకాడు, ఆయన అబద్ధమాడడు, పశ్చాత్తాపపడడు.*

అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దేవునిలో మార్పు వచ్చినట్లయితే, ఆయనకున్న మార్పులేని స్వభావాన్ని ధృవీకరించే లేఖనభాగాలకు అది విరుద్ధంగా ఉండదా? దేవుడు తన ఉద్దేశాలను నెరవేర్చడానికి స్థిరమైనవాడు శక్తివంతుడు కాదని దీని అర్థమా? ఈ సమస్య కొంతమందిని గందరగోళానికి గురిచేస్తుంది కాబట్టి క్లుప్తంగా అయినా సరే ఈ విషయాన్ని ప్రస్తావించడం చాలా అవసరం.

బైబిల్ డాక్టరీన్ అనే తన పుస్తకంలో వేన్ గ్రూడెమ్ ఇచ్చిన వివరణ:

> *ఈ సందర్భాలన్నీ ఆ సమయంలో ఉన్న పరిస్థితికి దేవుని ప్రస్తుత వైఖరి లేదా ఉద్దేశం యొక్క నిజమైన వ్యక్తీకరణలని మనం అర్థం చేసుకోవాలి. పరిస్థితి మారితే, దేవుని వైఖరి లేదా ఉద్దేశ్య వ్యక్తీకరణ కూడా మారుతుంది. ఇది కేవలం దేవుడు వేర్వేరు పరిస్థితులకు వేర్వేరుగా స్పందిస్తారని చెబుతోంది.*

మరో మాటలో చెప్పాలంటే, మార్పుచెందిన ప్రజలతో మార్పులేని దేవుడు తన ప్రేమను దయను తెలియజేసే తన ఇతర లక్షణాలకు అనుగుణంగా తన వ్యవహరించే విధానాన్ని మారుస్తారు. ఈ సమస్యపై రోలాండ్ మెక్క్యూన్ ఇచ్చిన వివరణ:

> *మార్పులేనిది అంటే కదలికలేనిదని కాదు. ముఖ్యంగా పాపం విషయంలో దేవుని మార్పులేని దృక్పథం చెడు ఉనికితో నైతిక కారకాలతో కలిసి దేవుడు వ్యవహరించే తీరు మారేలా చేస్తాయి. అంటే, ఆయన ప్రజలతో వ్యవహరించే విధానం మారుతుంది; మానవునికి దేవునితో ఉన్న నైతిక సంబంధం మారినప్పుడు దేవుడు తన ధోరణిని మారుస్తారు.*

దాని గురించి ఆలోచించండి. ప్రజలు మార్పు చెందినప్పుడు దేవుడు భిన్నంగా స్పందించకపోతే, ప్రార్థన గాని మన మార్గాలను మార్చడం గాని దేవునికి ఎటువంటి తేడాను కలిగించవు. కానీ మోషే, హిజ్కియాల ప్రార్థనలు దేవుని చర్యలను ఎలా మార్చాయో మనం ఇప్పటికే చూశాము ఎందుకంటే అవి ఆయన సార్వభౌమ ఉద్దేశాలకు అనుగుణంగా ఉన్నాయి. దేవుడు యోనాను పంపిన నీనెవెవాసుల ఉదాహరణను గమనించి ప్రజల చర్యలు దేవుడు వారితో వ్యవహరించే విధానాన్ని "మార్చడానికి" ఎలా కారణమయ్యాయో చూద్దాం.

నీనెవె వాసుల దుర్మార్గాన్ని చూసిన దేవుడు తన తీర్పు గురించి ప్రకటించడానికి యోనాను పంపారు: *"నీనెవె పట్టణస్థుల దోషము నా దృష్టికి ఘోరమాయెను గనుక నీవు లేచి నీనెవె మహా పట్టణమునకు పోయి దానికి దుర్గతి కలుగునని ప్రకటింపుము"* (యోనా 1:2). దాని సందేశం ఏమిటంటే, *"ఇక నలువది దినములకు నీనెవె*

*పట్టణము నాశనమగును"* (యోనా 3:2). తాము పశ్చాత్తాపపడితే దేవుడు తన తీర్పును నిలిపివేస్తారని స్పష్టమైన సూచనలు లేకపోయినా, వారు తమ మార్గాలను మార్చుకుంటే దేవుడు ఉద్దేశించిన తీర్పును తీసుకురారని స్పష్టమవుతుంది. నీనెవె రాజు దానిని అర్థం చేసుకున్నాడు, అందుకే అతడు ఒక శాసనాన్ని ప్రకటించాడు, అదేమిటంటే:

> ***యోనా 3:7-9 –*** *ఒకవేళ దేవుడు మనస్సు త్రిప్పుకొని పశ్చాత్తప్తుడై మనము లయము కాకుండ తన కోపాగ్ని చల్లార్చుకొనును గనుక మనుష్యులు ఏదియు పుచ్చుకొనకూడదు, పశువులుగాని యెద్దులుగాని గొఱ్ఱెలుగాని మేత మేయకూడదు, నీళ్లు త్రాగకూడదు, మనుష్యులందరు తమ దుర్మార్గములను విడిచి తాముచేయు బలాత్కారమును మానివేయవలెను, మనుష్యులేమి పశువులేమి సమస్తమును గోనెపట్ట కట్టుకొనవలెను, జనులు మనఃపూర్వకముగా దేవుని వేడుకొనవలెను.*

దేవుడు హెచ్చరికను పంపడంలో ఉన్న ఉద్దేశ్యం తాము పశ్చాత్తాపపడి తీర్పును తప్పించుకోవడమేనని రాజు అర్థం చేసుకున్నాడు. ఖచ్చితంగా అదే జరిగింది: *"ఈ నీనెవెవారు తమ చెడు నడతలను మానుకొనగా వారు చేయుచున్న క్రియలను దేవుడు చూచి పశ్చాత్తప్తుడై వారికి చేయుదునని తాను మాట యిచ్చిన కీడుచేయక మానెను"* (యోనా 3:10). వాస్తవానికి, ఈ సంఘటనల మార్పు గురించి యోనాకు తెలుసునని అతని మాటలు ధృవీకరిస్తున్నాయి: *"యెహోవా, నేను నా దేశమందుండగా ఇట్లు జరుగునని నేననుకొంటిని గదా? అందువలననే నీవు కటాక్షమును జాలియును బహు శాంతమును అత్యంత కృపయుగల దేవుడవై యుండి, పశ్చాత్తాపపడి కీడుచేయక మానుదువని నేను తెలిసికొని దానికి ముందుగానే తర్షీషునకు పారిపోతిని"* (యోనా 4:2).

గతం, వర్తమానం, భవిష్యత్తు అన్నీ తెలిసిన దేవుడు ప్రజలు మార్పుచెందినప్పుడు లేదా శ్రద్ధగా ప్రార్థించినప్పుడు ఎప్పుడూ ఆశ్చర్యపోరు. సార్వభౌమాధికారీ సర్వజ్ఞానియైన ప్రేమగల దేవుడు తన తీర్పును నిలిపివేసే మానవ ప్రవర్తనలోని ఈ మార్పులను కూడా తన శాశ్వతమైన ప్రణాళికలుగా మార్చారు.

గాలివీస్తున్న సమయంలో బైక్‌ను నడుపుతున్న మీరు ఒక చోట ఆగి వెనుకకు తిరిగి ప్రయాణిస్తున్నప్పుడు గాలి మిమ్మల్ని అడ్డుకోకుండా మీకు సహాయం చేయడం వల్ల గాలి మారిందని మీరు అనుకోవచ్చు. కాని వాస్తవానికి గాలి మారలేదు కాని మీరే మారారు.

తప్పు మార్గంలో వెళ్లేవారు దేవుని హెచ్చరికలను విని దేవుని మార్గం వైపు మళ్లినప్పుడు వారు దేవుని ఉగ్రతకు లోనయ్యే స్థానం నుండి రక్షణ ఇచ్చే ఆయన హస్తం క్రిందకు వస్తారని యెహెజ్కేలు ప్రవక్త ద్వారా దేవుడు మనకు చెప్తున్నారు.

> ***యెహెజ్కేలు 18:21-23 –*** *అయితే దుష్టుడు తాను చేసిన పాపములన్నిటిని విడిచి, నా కట్టడలన్నిటిని అనుసరించి నీతిని అనుసరించి న్యాయము జరిగించినయెడల అతడు మరణము నొందడు, అవశ్యముగా అతడు బ్రదుకును. అతడు చేసిన అపరాధములలో ఒకటియు జ్ఞాపకములోనికి రాదు, అతని నీతినిబట్టి అతడు బ్రదుకును. దుష్టులు మరణము నొందుటచేత నాకేమాత్రమైన సంతోషము కలుగునా? వారు తమ ప్రవర్తనను దిద్దుకొని బ్రదుకుటయే నాకు సంతోషము; ఇదే ప్రభువగు యెహోవా వాక్కు.*

సులభంగా చెప్పాలంటే, ప్రజలు పశ్చాత్తాపపడితే దేవుడు వారిపై తీర్పును తీసుకురాకుండా పశ్చాత్తాపపడతారని వాగ్దానం చేశారు. వారు పశ్చాత్తాపపడకపోతే, వారిపై తన కోపాన్ని కుమ్మరించడానికి ఆయన పశ్చాత్తాపపడడు. స్వభావరీత్యా బైబిలు దేవుడు ప్రజలను శాశ్వతమైన నరకంలోకి నెట్టడంలో సంతోషించడు. కాని వారు తమ మార్గాలను మార్చుకుని, యదార్థ హృదయంతో ఆయనను వెదకినట్లయితే వారి పాపాన్ని క్షమించి కనికరం చూపడంలోనే ఆయన సంతోషిస్తారు (మీకా 7:18). ఆ వాస్తవం ఇప్పటికే ముందుగానే నిర్ణయించిన దేవుని ప్రణాళికలో ఉద్దేశ్యంలో భాగంగా ఉంది. కాబట్టి, ఆయన తన మనసు మార్చుకున్నాడని కాదు. ప్రజలు తమ మార్గాలను మార్చుకున్నప్పుడు వారు ఆయన ఉగ్రతను ఎదుర్కోడానికి బదులు ఆయన దయను పొందుతారు.

దేవుడు ఈ విధంగా తన మనసు మార్చుకోవడం గురించి జాన్ మాక్ఆర్థర్ ఇచ్చిన వివరణ:

> *ఒక వ్యక్తి దేవుని ముందు నిలబడే విధానం అతనికి లేదా ఆమెకు ఏమి జరుగుతుందో నిర్దేశిస్తుంది. మైనం కరిగిపోయినందుకు, మట్టి గట్టిగా అయ్యిపోయినందుకు మీరు సూర్యుడిని నిందించలేరు. సమస్య ఆ వస్తువుల పదార్థంలోనే ఉంది కాని సూర్యుడిలో కాదు. దేవుడు ఎప్పుడూ మారరు. ఆయన మంచికి ప్రతిఫలమిస్తూ, చెడును శిక్షిస్తూ ఉంటారు.*

అయితే, దేవుని మార్పులేని స్వభావానికి సంబంధించిన భావనలు ఏమిటి?

## 1. ఇది విశ్వాసులకు ఓదార్పునిస్తుంది

ప్రత్యేకించి మనం మానవుల చంచల స్వభావంతో పోల్చినప్పుడు విశ్వాసికి ఓదార్పునివ్వడంలో దేవుని లక్షణాలలో ఆయన మార్పులేని స్వభావం చాలా ముఖ్యమైనది. "హోసన్నా... హోసన్నా" (మత్తయి 21:9) అనే కేకలతో యేసు ప్రభువును స్వాగతించిన అదే జనసమూహం చాలా త్వరగా మనసు మార్చుకొని కేవలం ఐదు రోజుల తర్వాత, "అతన్ని సిలువ వేయండి" (మత్తయి 27:22b) అని అరిచారు! స్నేహితులు, కుటుంబ సభ్యులు, సహోద్యోగులు లేదా పొరుగువారు మనల్ని నిరాశపరచడాన్ని మనమందరం అనుభవించినవారమే. ఈ విషయంలో మనం కూడా ఇతరులను నిరాశపరచడం విచారకరం. కానీ కొండయైన దేవుడు తన ఉనికిలోనే కాకుండా తన ఉద్దేశాలలో కూడా మార్పు లేకుండా ఉంటారు. యేసుపై విశ్వాసం ఉంచడం ద్వారా ఆయనను విశ్వసించిన వారందరినీ అంతం వరకు సురక్షితంగా ఉంచడం ఆయన ఉద్దేశాలలో ఒకటి!

*"మీలో ఈ సత్క్రియ నారంభించినవాడు యేసుక్రీస్తు దినమువరకు దానిని కొనసాగించునని రూఢిగా నమ్ముచున్నాను"* అని పౌలు ఫిలిప్పీ 1:6లో ఈ హామీని గురించి చెప్పాడు. "సృష్టింపబడిన మరి ఏదైనను, మన ప్రభువైన క్రీస్తుయేసునందలి దేవుని ప్రేమనుండి మనలను ఎడబాప నేరవని రూఢిగా నమ్ముచున్నాను" (రోమా 8:39) అని అతడు మనకు వాగ్దానం చేశాడు. *"నేను వాటికి నిత్యజీవము నిచ్చుచున్నాను గనుక అవి ఎన్నటికిని నశింపవు, ఎవడును వాటిని నా చేతిలోనుండి అపహరింపడు"* (యోహాను 10:28) అనే ఆదరణ ఇచ్చే మాటలతో యేసే స్వయంగా తనకు చెందిన వారందరికీ హామీ ఇస్తున్నారు. అది చాలదన్నట్లుగా, మనల్ని అంతం వరకు సురక్షితంగా ఉంచడంలో తండ్రికి కూడా అదే నిబద్ధత ఎలా ఉందో తెలుపుతూ ఆయన మనకు హామీ ఇచ్చారు: *"నా తండ్రి చేతిలోనుండి యెవడును వాటిని అపహరింపలేడు"* (యోహాను 10:29).

దేవుని మార్పులేని స్వభావం వీటితోపాటు అనేక ఇతర వాగ్దానాల నెరవేర్పుకు హామీ ఇస్తుంది, అంటే యేసు మహిమతో రావడం (మత్తయి 25:31), కొత్త ఆకాశాన్ని కొత్త భూమిని సృష్టించడం (యెషయా 65:17; ప్రకటన 21:1), మన కన్నీటిని తుడవడం, మరణాన్ని, దుఃఖాన్ని, ఏడుపును, బాధని పూర్తిగా నిర్మూలించడం (ప్రకటన 21:4). అందుకే జీవితపు తుఫానులు మనలను తాకినప్పుడు (అవి వస్తాయి కూడా) ఏ మార్పు లేకుండా స్థిరంగా ఉండే కొండలాంటి బైబిలు దేవునిపై మనం ఆధారపడవచ్చు, ఆయనను ఏ సంకోచం లేకుండా నమ్మవచ్చు.

ఆయన "అబద్ధం చెప్పలేని" దేవుడు (తీతు 1:2) కాబట్టి ఆయన వాగ్దానాలలో ఏ ఒక్కటీ విఫలం కాదు. దేవుని మార్పులేని స్వభావాన్ని మనం అర్థం చేసుకోవడం వల్ల మన జీవితాల పట్ల ఆయనకున్న మేలైన మహిమాన్వితమైన ఉద్దేశాలన్నింటిని ఆయన నెరవేరుస్తారని తెలుసుకుని విశ్వాసంతో ప్రార్థించగలుగుతాము, అలాగే అంతం వరకు మనం విశ్వాసంతో ముందుకు కొనసాగుతాము. ఇశ్రాయేలుకు ఆయన చేసిన వాగ్దానం (అతని సంతానాన్ని వృద్ధి చేయడం ద్వారా) ఇప్పటికీ అమలులో ఉంది. దేవుని మార్పులేని స్వభావం గురించిన సత్యాన్ని మనం హృదయపూర్వకంగా స్వీకరించినప్పుడు అది ఎంతో ఓదార్పునిస్తుంది:

> ***యెషయా 54:10*** *– పర్వతములు తొలగిపోయినను మెట్టలు తత్తరిల్లినను నా కృప నిన్ను విడిచిపోదు సమాధానవిషయమైన నా నిబంధన తొలగిపోదు అని నీయందు జాలిపడు యెహోవా సెలవిచ్చుచున్నాడు.*

## 2. ఇది అవిశ్వాసులకు భయాన్ని కలిగిస్తుంది

దాహం తీర్చి ప్రాణం పోసే నీరే జీవితాలను కూడా నాశనం చేస్తుంది. అలాగే యేసుపై విశ్వాసం ఉంచి దేవుని బిడ్డలైనవారికి ఆయన మార్పులేని స్వభావం ఎంత ఓదార్పునిస్తుందో ఆయనకు ఇంకా దూరంగా ఉన్నవారికి అంతే భయాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే దేవుడు పరిశుద్ధుడు, నీతిమంతుడు, ఉగ్రత చూపించేవాడు కాబట్టి పాపం పట్ల ఆయన వైఖరి మారదు. ఆయన పాపాన్ని శిక్షించకుండా ఉండరు ఉండలేరు.

నోవాహు అతని కుటుంబం మినహా మొత్తం మానవ జాతిని నాశనం చేసిన నోవాహు కాలంలో వచ్చిన జలప్రళయం, సొదొమ గొమొర్రాలను కాల్చివేయడం, ఫరో సైన్యాలు ఎర్ర సముద్రంలో మునిగిపోవడం, క్రీ. శ 70లో యెరూషలేము నాశనం కావడం వంటివి దేవుడు ఎప్పుడూ పాపాన్ని ద్వేషిస్తారని, ప్రజలు పశ్చాత్తాపం చెందకపోతే తీర్పు తెస్తారని మనకు గుర్తుచేసే కొన్ని ఉదాహరణలు మాత్రమే.

పాపం విషయంలో దేవుడు తన మనసు మార్చుకోలేదు. భవిష్యత్తులో కూడా ఆయన మార్చుకోరు! పాపాన్ని చూడలేని పరిశుద్ధ దేవుడు (హబక్కూకు 1:13) తనకు మహిమ చెల్లించడానికి నిరాకరించిన వారందరికీ తీర్పు తీరుస్తారు (రోమా 3:23). తీర్పు దినాన వారు ఎంత ఏడ్చినా సరే ఆయన మనసు మార్చుకోరు. తన నిబంధనల ప్రకారం తన దగ్గరకు రావడానికి నిరాకరించే తన శత్రువులందరిపై ప్రతీకారం తీర్చుకుంటానని ఆయన వాగ్దానం చేశారు. కింది లేఖనభాగాలు ఈ వాస్తవాన్ని ధృవీకరిస్తున్నాయి:

***ద్వితీయో 32:40-42 –*** *నేను తళతళలాడు నా ఖడ్గము నూరి నా చేత న్యాయమును పట్టుకొనినయెడల నా శత్రువులకు ప్రతీకారము కలుగజేసెదను. నన్ను ద్వేషించువారికి ప్రతిఫలమిచ్చెదను రక్తముచేత నా బాణములను మత్తిల్ల చేసెదను. చంపబడినవారి రక్తమును చెరపట్టబడినవారి రక్తమును శత్రువులలో వీరుల తలలను నా ఖడ్గము భక్షించును. నేను ఆకాశముతట్టు నా హస్తమెత్తి నా శాశ్వత జీవముతోడని ప్రమాణము చేయుచున్నాను.*

***యెహెజ్కేలు 8:18 –*** *కాబట్టి కటాక్షము లేకయు కనికరము చూపకయు నేను నా క్రోధమునగుపరచి, వారు నా చెవులలో ఎంత బిగ్గరగా మొఱ్ఱపెట్టినను నేను ఆలకింపకుందును.*

***మత్తయి 13:41-43 –*** *మనుష్యకుమారుడు తన దూతలను పంపును; వారాయన రాజ్యములోనుండి ఆటంకములగు సకలమైనవాటిని దుర్నీతిపరులను సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లుకొరుకుటయును ఉండును. అప్పుడు నీతిమంతులు తమ తండ్రి రాజ్యములో సూర్యునివలె తేజరిల్లుదురు చెవులుగలవాడు వినును గాక.*

***2 థెస్సలో 1:6-10 –*** *ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతోకూడ పరలోకమునుండి అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై, దేవుని నెరుగనివారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతి దండన చేయునప్పుడు మిమ్మును శ్రమపరచు వారికి శ్రమయు, శ్రమపొందుచున్న మీకు మాతోకూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే. ఆ దినమున తన పరిశుద్ధులయందు మహిమపరచబడుటకును, విశ్వసించిన వారందరయందు ప్రశంసింపబడుటకును, ప్రభువు వచ్చినప్పుడు అట్టివారు ఆయన సముఖము నుండియు ఆయన ప్రభావమందలి మహిమనుండియు పారదోలబడి, నిత్యనాశనమను దండన పొందుదురు. ఏలయనగామేము మీకిచ్చిన సాక్ష్యము మీరు నమ్మితిరి.*

ఇంకా దేవునికి దూరంగా ఉన్న ప్రియమైన పాఠకుడా, రాబోయే తీర్పుకు సంబంధించిన ఈ వాగ్దానాలన్నింటిని బట్టి (పైన పేర్కొన్నవి కొన్ని వచనాలు మాత్రమే) మీరు ఏమి చేయాలి? మీరు ఆయన దృష్టిలో నిజంగా పాపులుగా ఉన్నారని చూడగలిగేలా మీ కళ్ళు తెరవమని ఆయనను అడగాలి. మీరు ఇంకా ఆయనను తిరస్కరిస్తూ మీ ఇష్టం వచ్చినట్లుగానే జీవిస్తూ ఉంటే, మీరు అవిధేయత చూపినప్పటికీ మీకు తినడానికి ఆహారాన్ని ఆనందించడానికి అనేక ఆహ్లాదకరమైన వస్తువులను ఇచ్చే ఈ దేవుడే ఒక రోజు తన ఉగ్రతను మీపై కుమ్మరిస్తారని గ్రహించండి.

మీరు దేవుని పరిశుద్ధ ఆజ్ఞలను విస్మరించి ఆయనపై తిరుగుబాటు చేసిన పాపి అని మీరు గుర్తించేలా సహాయం చేయమని మీరు ఆయనను తప్పక వేడుకోవాలి. మీరు అలాంటి జీవనశైలిని విడిచిపెట్టి, ఆయన తన కుమారుడైన యేసు ద్వారా అందించే క్షమాపణను అంగీకరించడానికి సిద్ధంగా ఉండాలి. ఒక సెకను కూడా ఎవరూ జీవించలేని పరిపూర్ణ జీవితాన్ని యేసు జీవించారు. ఆయన మన పాపాల కోసం సిలువపై మరణించారు, దేవుడు మూడవ రోజున ఆయనను తిరిగి సజీవంగా లేపి, ఆయన మన పాపాలకు చెల్లించిన వెలను అంగీకరించారు. యేసును విశ్వసించడం ద్వారా మాత్రమే మీ పాపాలన్నింటికి క్షమాపణ పొందగలరు. పరిశుద్ధాత్మను పొందగలరు. మీరు దేవుని ముందు ఉండే హక్కును పొందగలరు. రాబోయే ఈ భయంకరమైన అంతిమ తీర్పు నుండి తప్పించుకోవడానికి అదొక్కటే మార్గం.

దేవుని దయతో మీరు గనుక అలా చేయగలిగితే, మీకు భయం ఉండదు కాని మీరు ప్రభువైన యేసుక్రీస్తు తండ్రియైన మహిమాన్వితమైన దేవుని మార్పులేని స్వభావం గురించి తెలుసుకున్నప్పుడు మీరు గొప్ప ఆదరణను అనుభవిస్తారు. దయచేసి ఆలస్యం చేయవద్దు. ఎలా ఉన్నారో అలాగే రండి. రాజైన యేసు ముందు మోకరిల్లండి. ఆయన రక్తంలో మీ పాపాలన్నింటిని కడిగివేసుకోండి. కొత్త జీవితాన్ని పొందండి. ఆయన పరిశుద్ధాత్మను పొందండి. మీరు ఎప్పటికీ చింతించని కొత్త ప్రారంభాన్ని అనుభవించండి!

## చర్చా ప్రశ్నలు

1. ఈ అధ్యాయం దేవుని మార్పులేని స్వభావాన్ని గురించి మీ దృక్కోణాన్ని ఎలా ప్రభావితం చేసింది?
2. దేవుని ఈ లక్షణాన్ని బట్టి మీరు జీవితంలో ఎలాంటి మార్పులు చేసుకుంటారు?
3. దేవుని ఈ లక్షణం మీ ప్రార్థనలను ఎలా ప్రభావితం చేస్తుంది?
4. దేవుని ఈ లక్షణం మీ సువార్త ప్రచారాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

## ధ్యానించవలసిన /కంఠత చేయవలసిన వాక్యం

> ***మలాకీ 3:6 –*** *యెహోవానైన నేను మార్పులేనివాడను గనుక యాకోబు సంతతివారైన మీరు లయము కాలేదు.*

## ప్రార్థన

తండ్రీ, మీరు మీ స్వభావంలో మీ ఉద్దేశాలలో మార్పులేని వారని తెలుసుకోవడం వల్ల నిరంతరం మారుతూ ఉండే ఈ లోకంలో ఎంతో ఆదరణ కలుగుతుంది. తరచుగా నేను దీన్ని మరచిపోతూ సందేహపడి నిరుత్సాహానికి గురవుతున్నాను. ఈ పాపాన్ని బట్టి నన్ను క్షమించండి. పరిస్థితులు విషమంగా ఉన్నప్పుడు కూడా నిన్ను విశ్వసించి భవిష్యత్తు గురించి చింతించకుండా నీ సన్నిధిలో విశ్రాంతి తీసుకునేలా నాకు సహాయం చెయ్యండి. నన్ను సురక్షితంగా ఇంటికి తీసుకువెళ్లే నా ప్రభువైన క్రీస్తులో మేలైన మీ వాగ్దానాలన్నీ ఒక రోజు నెరవేరతాయని నాకు గుర్తు చేస్తూ ఉండండి. ఆమెన్!

## ముగింపు: ధన్యవాదాలు

మీరు ఈ పుస్తకాన్ని ఇంత వరకు చదివినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మీ హృదయం ప్రోత్సహించబడిందని, మీరు దేవుని పట్ల ఉన్నతమైన దృక్పథాన్ని కలిగి ఉన్నారని నేను ఆశిస్తున్నాను.

దేవుని లక్షణాలను నిరంతరం మీ ఎదుట ఉంచుకునే విషయంలో నేను మీకు ఒక మంచి సలహా ఇవ్వాలనుకుంటున్నాను. ప్రార్థన విషయంలో ACTS అనే సంక్షిప్త పదాన్ని మీరు బహుశా వినే ఉంటారు. ఒకవేళ వినకపోతే దాని వివరణ క్రింద ఉంది:

- (**A**doration) ఆరాధన – దేవునికున్న ఒకటి లేదా అంతకంటే ఎక్కువ లక్షణాల పరంగా ఆయన ఎవరో గుర్తించడం.
- (**C**onfession) ఒప్పుకోలు – దేవుని ముందు మీ పాపాలను ఒప్పుకుని క్షమాపణ కోరడం.
- (**T**hanksgiving) కృతజ్ఞతలు – మీ జీవితంలో ఇతరుల జీవితంలో దేవుని ఆశీర్వాదాల కోసం కృతజ్ఞతలు చెల్లించడం.
- (**S**upplication) విన్నపం – ఇతరుల అవసరాల గురించి మీ అవసరాల గురించి దేవునికి విన్నవించడం.

దేవుని లక్షణాలను మీ మనస్సులో ఎప్పుడూ తాజాగా ఉంచుకోవాలని నేను మిమ్మల్ని ప్రోత్సహిస్తున్నాను. ఈ పుస్తకంలో ఇచ్చిన వివిధ లక్షణాలను, బైబిల్లో తెలియజేసిన ఇతర లక్షణాలను పరిశీలించండి. వాటిలో ప్రతి దానినిబట్టి దేవుణ్ణి స్తుతించండి. ఆ విధంగా, మీరు నిత్యం దేవుడు ఎవరూ అని ఆలోచిస్తూ ఉంటారు అలాగే ఆ లక్షణానికి అనుగుణంగా జీవితాన్ని కొనసాగించేలా ప్రోత్సహించబడతారు.

ఉదాహరణకు, మీరు దేవుని పరిశుద్ధత గురించి ఆలోచించాలనుకుంటే, కింద ఇచ్చిన మాటలతో మీరు ప్రార్థన చేయవచ్చు:

> *తండ్రీ, మీరు పరిశుద్ధుడని నాకు తెలుసు. పరిశుద్ధతలో నీవంటివారు ఎవరూ లేరు. నాలాంటి పాపిని రక్షించినందుకు వందనాలు. నీవలె పరిశుద్ధంగా ఉండేలా నాకు సహాయం చేయండి.*

ఆయన విశ్వసనీయత గురించి మీరు ఇలా ప్రార్థన చేయవచ్చు:

> *తండ్రీ, మీరు ఎప్పటికీ నమ్మకమైన దేవుడవు. మీ పిల్లల పట్ల మీ విశ్వసనీయత గురించి బైబిలులో అనేక ఉదాహరణలు ఉన్నాయి. గతంలో నేనే స్వయంగా దీన్ని అనేకసార్లు రుచి చూశాను. ప్రస్తుతం శ్రమలు నన్ను చుట్టుముట్టగా నేను చాలా నిరుత్సాహంతో ఉన్నాను. నా విశ్వాసం బలహీనంగా ఉంది. నా పట్ల ఉన్న మీ విశ్వసనీయత నేను విశ్వసించడానికి దయచేసి నాకు సహాయం చెయ్యండి. మీరు త్వరలో నాకు విడుదల కలిగిస్తారని లేదా ఆ శ్రమల గుండా వెళ్ళడానికి నాకు మరింత కృపను ఇస్తారని నమ్మడానికి నాకు సహాయం చేయండి.*

దేవుడు సర్వజ్ఞాని అనే సత్యం గురించి మీరు ఈ విధంగా ప్రార్థించవచ్చు:

> *తండ్రీ, నీవు సర్వ జ్ఞానివని నాకు తెలుసు. మీ జ్ఞానంతో ఈ సమస్త విశ్వాన్ని సృష్టించావు. మీకు సమస్తం తెలుసు కానీ నాకు తెలియదు. కాబట్టి ఈ నిర్దిష్టమైన విషయానికి సంబంధించి ఏ నిర్ణయం తీసుకోవాలో నాకు తెలియడం లేదు. ఏమి చేయాలో నాకు తెలియదు. అందుకే జ్ఞానం ఇవ్వమని మీ వైపు చూస్తున్నాను. నిన్ను యథార్థంగా వెదకే వారందరికీ జ్ఞానాన్ని ఇస్తానని వాగ్దానం చేశారు కాబట్టి నేను అడుగుతున్నాను. సవాలుకరంగా ఉన్నప్పటికీ నేను సరైన నిర్ణయం తీసుకుని మిమ్మల్ని ఘనపరచగలిగేలా నాకు సహాయం*

*చేయండి. నాపట్ల మీ చిత్తం ఎప్పుడూ ఉత్తమమైనదేనని విశ్వసించడానికి నాకు సహాయం చేయండి. నా సొంత జ్ఞానంపై అవగాహనపై ఆధారపడకుండా నన్ను రక్షించండి.*

దేవుని లక్షణాలతో మన ప్రార్థనలను ప్రారంభించడం ద్వారా, మనం దేవునికి మొదటి స్థానం ఇవ్వడమే కాకుండా ఆయన గురించిన మన జ్ఞానంలో గొప్ప వృద్ధిని పొందుతాము అలాగే ఆయనను మరి ఎక్కువగా ప్రేమిస్తాము.

***గమనిక:*** మీరు ఈ అలవాటును అలవరచుకోడానికి ఈ పుస్తకంలోని ప్రతి లక్షణం చివరిలో ఉన్న నమూనా ప్రార్థనలను కూడా ఉపయోగించుకోవచ్చు.

## రచయిత గురించి

కేవలం యేసు ప్రభువు కృప వలన మాత్రమే పాపినైన నేను రక్షణ పొందాను. సనాతన హిందూ బ్రాహ్మణ (భారతీయ) నేపథ్యం నుండి నేను వచ్చాను. ఒకప్పుడు హిందువుగా ఉండి క్రీస్తును తెలుసుకుని క్రైస్తవునిగా మారిన నా క్రైస్తవ మిత్రుడు విజయ్ ప్రేమతో విశ్వాసంతో నిరంతరం ఇచ్చిన సాక్ష్యం ద్వారా, అదే సమయంలో USAలోని టెక్సాస్‌లో నేను చదువుతున్నప్పుడు నాకు తెలియని ఒక వ్యక్తి నా ఇంటి ముందు ఉంచిన బైబిలును చదవడం ద్వారా ప్రభువు నన్ను రక్షించారు. తిరుగుబాటు చేసిన ఈ పాపిని దయగల కాపరీ రక్షకుడూ ప్రభువైన యేసుక్రీస్తు రక్షణ జ్ఞానంలోకి తీసుకురావడానికి యోహాను 10:11లోని *"నేను గొర్రెలకు మంచి కాపరిని; మంచి కాపరి గొర్రెలకొరకు తన ప్రాణము పెట్టును"* అనే యేసు మాటలను పరిశుద్ధాత్మ నా హృదయంలో లోతుగా నాటుకునేలా చేశారు.

దేవుని ఆశీర్వాదంతో నాకు గీతతో వివాహం జరిగింది; మాకు పాల్, ప్రీతి అనే ఇద్దరు పిల్లలు కలిగారు. దేవుని కృప వల్ల వారందరూ విశ్వాసులుగా ఉన్నారు. 2003లో అంటారియోలోని విండ్సర్‌లో గ్రేస్ బైబిల్ చర్చిని స్థాపించినప్పటి నుండి దానిలో పాస్టర్‌గా సేవ చేసే గొప్ప ఆధిక్యత కూడా నాకు లభించింది! వారెంతో ప్రేమగల సహోదరీ సహోదరులు. నిజానికి వారికి సేవ చేయడం నాకెంతో ఆనందం.

అంకితభావం కలిగిన మా అనువాదకులకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. మీ నమ్మకమైన పని, అచంచలమైన నిబద్ధత ఈ పుస్తకానికి జీవం పోసి బహుళ భాషల్లో అనేకమంది పాఠకులకు అందుబాటులో ఉండేలా చేసింది. ఎంతో మద్దతును సహకారాన్ని అందించిన M/s CBase Solutions Pvt Ltd వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు. వారు ఈ పుస్తకాన్ని అనువదించడమే కాకుండా, వివిధ ఆంగ్ల బ్లాగ్ కథనాలను తెలుగులోనికి అనువదించారు.

నా గురించి మరియు బ్లాగ్/పుస్తకం గురించి మరిన్ని వివరాలను www.telugu.biblebasedhope.com మరియు www.gbc-windsor.orgలో చూడవచ్చు. మీరు నన్ను నేరుగా సంప్రదించాలనుకుంటే, దయచేసి Rk2serve@yahoo.comకి ఇమెయిల్ చేయండి.

ఈ పుస్తకం కాపీలు అమెజాన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. అలాగే, ఈ పుస్తకం అందుబాటులో ఉండే ఇతర మాధ్యమాల గురించి తెలుసుకోడానికి మమ్మల్ని సంప్రదించండి.

ఈ పుస్తకం యొక్క ఉచిత PDF వెర్షన్ పైన పేర్కొన్న సైట్‌లలో అందుబాటులో ఉంది.

ఈ పుస్తకంలోని అంశాల గురించి మీకు ఏవైనా ప్రశ్నలు ఉంటే నన్ను అడగడానికి సంకోచించకండి. మీ అభిప్రాయాలను తెలియజేయండి. నా పరిమితులను నేను పూర్తిగా గ్రహించాను కాబట్టి లేఖనాల పట్ల నా అవగాహనను పెంచుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నాను.

# దేవుణ్ణి మహిమపరచడం ఆయనలో నిత్యం ఆనందించడమే మనిషి యొక్క ప్రధాన లక్ష్యం!

వెస్ట్‌మినిస్టర్ చిన్న ప్రశ్నోత్తరాలలో "మనిషి యొక్క ప్రధాన లక్ష్యం ఏమిటి?" అనే మొదటి ప్రశ్నకు ఇచ్చిన సమాధానం - మనం ఆయన స్వభావాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేకపోతే మనం దేవుణ్ణి మహిమపరచలేము అలాగే ఆయనలో నిత్యం ఆనందించలేము. బైబిలు దేవుణ్ణి ఆయన లక్షణాల ద్వారా మాత్రమే అర్థం చేసుకోగలం కాబట్టి మనం వాటిని అధ్యయనం చేయడం చాలా కీలకము.

యేసును వెంబడించేవారు బైబిలు దేవుని గురించి తమ అవగాహనను పెంచుకోవడంలో సహాయం అందించడానికే వివరణలు అనువర్తనాలు కలిగిన ఈ చిన్న ఆధ్యాత్మిక పుస్తకం వ్రాయబడింది. ఒకవేళ మీరు క్రైస్తవులు కాకపోయినా సరే క్రైస్తవ విశ్వాసం గురించి మరింత తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్నట్లయితే ఇది మీకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. మిమ్మల్ని సృష్టించి, తనతో సహవాసం చేయడానికి మిమ్మల్ని ఆహ్వానిస్తున్న బైబిలు దేవుని స్వభావాన్ని అర్థం చేసుకోవడంలో మీకు ఈ పుస్తకం సహాయం చేస్తుంది కాబట్టి మీరు కూడా ప్రయోజనం పొందవచ్చు.

దేవుడు పరిమితి లేనివాడు, "ఆయన మహాత్మ్యము గ్రహింప శక్యము కానిది" (కీర్తన 145:3) కాబట్టి మనం ఆయనను ఎప్పటికీ పూర్తిగా అర్థం చేసుకోలేనప్పటికీ, పరిమితి గలిగిన మనకు ఆయన గురించి కొంతవరకు తెలుసుకునే ఆధిక్యత ఇవ్వబడింది. బైబిలు వాక్యాలలో ఉన్న కొత్త ఒడంబడిక "చిన్నలు మొదలుకొని పెద్దలవరకు అందరును" దేవుణ్ణి తెలిసికొందురు అని వాగ్దానం చేస్తుంది (హెబ్రీ 8:11). అది మనకు ఆదరణ కలిగించడమే కాకుండా ఆయన గురించిన లోతైన జ్ఞానాన్ని వెంబడించేలా ప్రోత్సహిస్తుంది. అలా చేయడానికి ఈ పుస్తకం మీకు సహాయపడుతుందని నేను ఆశిస్తున్నాను.

కెనడాలోని అంటారియోలోని విండ్సర్‌లో ఉన్న గ్రేస్ బైబిల్ చర్చ్‌లో రామ్ కృష్ణమూర్తిగారు రెండు దశాబ్దాలకు పైగా పాస్టరుగా సేవచేస్తున్నారు. ఆయనకు గీతతో వివాహమైనది, వారికి ఇద్దరు పిల్లలు. ఆయన గురించిన మరిన్ని వివరాలను www.telugu.biblebasedhope.com మరియు www.gbc-windsor.orgలో చూడవచ్చు.

**తెలుగు / TELUGU**